
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5
ప్రకాశం
జిల్లా వార్తలు
మంగళవారం 28, అక్టోబరు 2025

అప్రమత్తంగా ఉండాలి

- ప్రాణ, ఆస్తి నష్టం కలగకుండా చర్యలు తీసుకోవాలి
- ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశం



ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ నేపథ్యంలో కలెక్టర్లు అప్రమత్తంగా ఉండి ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టాలు వాటిల్లకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశించారు. సోమవారం కలెక్టర్లు, ఎస్పీలతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. వచ్చే మూడురోజులు రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర గాలులతో కూడిన భారీవర్షాలు కురిసే అవకాశం ఉన్నదన్నారు. తీరప్రాంత ప్రజలను అప్రమత్తం చేయడంతోపాటు మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లకుండా చూడాలన్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేలా పటిష్టమైన ఏర్పాట్లు చేయాలన్నారు. శాఖల వారీగా తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై కలెక్టర్లకు సీఎం దిశానిర్దేశం చేశారు. వీసీలో కలెక్టర్ రాజాబాబు, ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ, డీఆర్వో చినఓబులేశు పాల్గొన్నారు.



తుఫాన్‌ను సమర్థవంతంగా ఎదుర్కోవాలి

- ఎక్కడా నష్టం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి
- పునరావాస కేంద్రాల్లో ఇబ్బందులు లేకుండా చూడాలి
- మంత్రి శ్రీబాలవీరాంజనేయ స్వామి ఆదేశం
- విశాఖ, ప్రకాశం కలెక్టర్‌లతో టెలికాన్ఫరెన్స్

7



మొంథా నుంచి రక్షణకు ముందస్తు ఏర్పాట్లు

- నేడు, రేపు జిల్లాలో అతి భారీ వర్షాలు కురిసే అవకాశం
- తీరప్రాంత మండలాలపై ప్రత్యేక దృష్టి
- 27 పునరావాస కేంద్రాల ఏర్పాటు
- విలేకరుల సమావేశంలో కలెక్టర్ రాజాబాబు వెల్లడి

7

మొంథా తుఫాన్ ప్రభావం జిల్లాపై కనిపిస్తోంది. సోమవారం మధ్యాహ్నం నుంచి వర్షం ప్రారంభమైంది. మరోవైపు మంగళ, బుధవారాల్లో తీవ్రత మరింత ఎక్కువగా కనిపించే అవకాశం ఉంది. మంగళవారం రాత్రి పొద్దుపోయాక కాకినాడ సమీపంలో తుఫాన్ తీరం దాటే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ అంచనా. అయితే సముద్రంలో చెన్నై వైపు నుంచి తుఫాన్ విశాఖ వైపునకు కదులుతుండటంతో జిల్లాపైనా దాని ప్రభావం తీవ్రంగానే ఉండనుంది. దీంతో వాతావరణ శాఖ, రాష్ట్ర విపత్తుల సంస్థ జిల్లాకు రెడ్ అలర్ట్ ప్రకటించాయి. తుఫాన్ కారణంగా భారీ వర్షాలు, గాలులు వీచే అవకాశాలు ఉన్నాయని హెచ్చరించాయి. దీంతో అధికార యంత్రాంగం మరింత అప్రమత్తమైంది.


కొత్తపట్నం తీరం వద్ద ఎగిసిపడుతున్న అలలు


వలలను ఒడ్డుకు తెచ్చుకుంటున్న మత్స్యకారులు

రెడ్ అలర్ట్

మొంథా ప్రభావంతో ప్రారంభమైన వర్షం

- నేడు, రేపు భారీ వర్షాలు
- అప్రమత్తంగానే యంత్రాంగం
- బీచ్‌లలోకి ప్రవేశాలు రద్దు
- విద్యా సంస్థలు మూత
- జిల్లా అంతటా అధికారుల సమీక్షలు
- అన్నిచోట్లా కంట్రోల్ రూంలు
- నిలిచిన వేట, ఒడ్డుకు చేరిన పడవలు
- నీటి వనరులు, రవాణా, విద్యుత్, తాగునీటి రంగాలపై ప్రత్యేక దృష్టి
- పంటల పరిస్థితిపై రైతుల్లో ఆందోళన
- వర్షం పెరిగితే అంతా నష్టమే

ఎగిసిపడుతున్న అలలు..

తుఫాన్ ప్రభావంతో సముద్రంలో అలలు ఎగసిపడుతున్నాయి. దీంతో మత్స్యకారులు పడవలను, వలలను ఒడ్డుకు చేర్చుకున్నారు. అధికారుల హెచ్చరికలతో వేటకు వెళ్లకుండా ఇళ్లకే పరిమితమయ్యారు. తుఫాన్ కారణంగా కురిసే భారీవర్షాలు, గాలులకు విద్యుత్ అంతరాయం, చెట్లు విరిగిపడటం, వాగులు, వంకల్లో నీటి ప్రవాహ ఉధృతితో రవాణాకు ఆటంకంతోపాటు ప్రమాదాలు జరిగే అవకాశాలన్నింటిని దృష్టిలో పెట్టుకొని ఆయా శాఖల అధికారులు అప్రమత్తమయ్యారు. వాగులు పొంగే ప్రాంతాలలో రాకపోకలు ఆపేలా పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. చెట్లు విరిగిపడి రవాణాకు ఎదురయ్యే ఆటంకాలను తక్షణం తొలగించేలా రవాణా, ఆర్‌అండ్‌బీ శాఖ సిద్ధమైంది. నీటి వనరులు బలహీనంగా ఉన్న ప్రాంతాల్లో ముందస్తు ఏర్పాట్లలో ఇరిగేషన్, అలాగే తాగునీరు సమస్య రాకుండా ఆర్‌డబ్ల్యూఎస్, విద్యుత్ అంతరాయం ఏర్పడితే వీలైనంత త్వరగా పునరుద్ధరించేలా విద్యుత్ శాఖ అధికారులు కలెక్టర్ ఆదేశాలతో తగు ప్రణాళికలు సిద్ధం చేసుకున్నారు. మండల స్థాయిలో నియమితులైన స్పెషల్ ఆఫీసర్లు సోమవారం తమకు కేటాయించిన మండలాల్లో పర్యటించి యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు..


కొత్తపట్నం తీరం వద్ద ఒడ్డుకు చేర్చిన పడవలు


ఒంగోలులో కురుస్తున్న వర్షం

ఒంగోలు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాపై మొంథా తుఫాన్ ప్రభావం మొదలైంది. సోమవారం మధ్యాహ్నం నుంచి జిల్లావ్యాప్తంగా జల్లులు పడుతున్నాయి. సోమవారం నుంచి బుధవారం వరకు తీవ్రంగా ఉంటుందన్న సమాచారంతో ఆదివారం నుంచే అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. ఉన్నతాధికారులు తీరప్రాంత మండలాలపై ప్రత్యేక దృష్టి సారించారు. కార్తీక సోమవారం సముద్ర స్నానాలకు పెద్దసంఖ్యలో భక్తులు వచ్చే అవకాశాలు ఉండటంతో జిల్లా పరిధిలోని కొత్తపట్నం, పాకల, ఈతముక్కల, కనపర్తి ఇతర బీచ్‌లు, తీరాలను మూసివేసి పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆ పరిసరాలకు ఎవ్వరినీ రానివ్వలేదు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సోమవారం మధ్యాహ్నం వీడియో కాన్ఫరెన్స్‌ను ఏర్పాటు చేసి అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, ఇతర కీలక అధికారులతో సమీక్ష చేశారు. కలెక్టర్ పి.రాజాబాబు, ఎస్పీ హర్షవర్ధన్‌రాజులు హాజరై జిల్లాలో తీసుకుంటున్న చర్యలను వివరించారు. జిల్లాకు చెందిన మంత్రి డాక్టర్ స్వామి కూడా కలెక్టర్‌తో పరిస్థితిని సమీక్షించారు. జిల్లా అంతటా ప్రాథమిక పాఠశాల నుంచి ఇంజనీరింగ్ వరకు అన్ని యాజమాన్యాల్లోని విద్యా సంస్థలకు సెలవులు ప్రకటించడంతో వాటిని మూసివేశారు.

పునరావాస కేంద్రాలు సిద్ధం

తీర ప్రాంతంలో ఐదు మండలాల్లోని 18 గ్రామాలపై తుఫాన్ ప్రభావం తీవ్రంగా ఉండనున్న దృష్ట్యా ఆ గ్రామాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. వారిని అవసరమైతే సురక్షిత ప్రాంతాలకు చేర్చేలా ఏర్పాట్లు చేశారు. అందుకోసం పునరావాస శిబిరాలను సిద్ధం చేశారు. పాకల బీచ్ ప్రాంతాన్ని ఎస్పీ హర్షవర్ధన్‌రాజు సందర్శించి అక్కడి పరిస్థితిని పరిశీలించారు. పట్టణాల్లో వర్షపు నీరు ఎక్కడికక్కడ రోడ్లపై చేరి తీవ్ర ఇబ్బందులు కలిగిస్తుండటంతో ప్రధాన కాలువల్లో ప్రవాహం సజావుగా సాగేలా అధికారులు చర్యలు చేపట్టారు. ఒంగోలు నగరంలోని కొప్పోలు రోడ్డులో ఈ తరహా పనులు కమిషనర్ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో జరుగుతుండగా సోమవారం ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పరిశీలించారు. నగరంలో ముందస్తు చర్యలపై అధికారులకు తగు సూచనలు చేశారు.

తీవ్ర ఆందోళనలో రైతులు

మొంథా తుఫాన్ ప్రభావంపై రైతుల్లో ప్రత్యేకించి పశ్చిమ ప్రాంతం వారిలో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. ఖరీఫ్ సీజన్‌లో ఆ ప్రాంతంలో పత్తి, మిర్చి, కంది, వరి, సజ్జ, పొగాకు వంటి పంటలు విస్తారంగా సాగయ్యాయి. కొన్ని

మిగతా 6వ పేజీలో

వైద్యారోగ్యశాఖ అప్రమత్తం

- అన్ని ఆస్పత్రుల్లో అత్యవసర మందులు ఏర్పాటు
- నిండు గర్భిణిలు సమీపంలోని వైద్యశాలలకు తరలింపు
- డాక్టర్లు, సిబ్బంది సెలవులు రద్దు.. అంబులెన్స్‌లు సిద్ధం


కొండపి సీహెచ్‌సీకి తరలించిన అనకర్లపూడి గ్రామానికి చెందిన నిండు గర్భిణి శ్రావణి

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాన్ నేపథ్యంలో వైద్యారోగ్యశాఖ అప్రమత్తమైంది. డాక్టర్లు, ఇతర సిబ్బంది సెలవులను రద్దు చేశారు. ఆయా వైద్యశాలలకు అత్యవసర మందులను సరఫరా చేశారు. 108 వాహనాలు 40, 104 వాహనాలు 38, 102 వాహనాలు 18 కలిపి 96వాహనాలను అందుబాటులో ఉంచారు. అత్యవసర సమయాల్లో వినియోగించేందుకు ప్రైవేటు అంబులెన్స్‌లను కూడా సిద్ధం చేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో వారం, పది రోజుల్లో కాన్పు అయ్యే గర్భిణులను ముందస్తుగానే వైద్యశాలలకు తరలించారు. ప్రజలకు అత్యవసర సమయాల్లో వైద్యసేవలు అందించేందుకు మూడు ప్రత్యేక బృందాలు, అన్ని వైద్యశాలల్లో కంట్రోలు రూంలను ఏర్పాటు చేశారు. అత్యవసరం అయితే నర్సింగ్ విద్యార్థుల సేవలను వినియోగించుకోవాలని ప్రభుత్వం ఆదేశించడంతో తదనుగుణంగా చర్యలు తీసుకున్నారు.


పాకల తీరాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

రంగంలోకి ప్రత్యేక బలగాలు

- అత్యవసర పరిస్థితుల్లో 112, వాట్సాప్ నెంబర్ 91211 02266 కు సమాచారం ఇవ్వాలి
- ఎస్పీ హర్షవర్ధన్‌రాజు
- పాకల బీచ్ పరిశీలన

7

పశ్చిమాన అపార నష్టం

- ఉరకెత్తుతున్న పత్తి, మిర్చి, పొగాకు పంటలు
- మొలకెత్తుతున్న సజ్జ
- తాజా వర్షాలతో మరింత నష్టం
- ఆందోళన చెందుతున్న రైతులు


రాచర్ల మండలం రామాపురం వద్ద పత్తి చేలో నిలిచి ఉన్న నీరు

ఒంగోలు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని పశ్చిమ రైతులు ఇటీవలి వర్షాలకు తీవ్రంగా నష్టపోయారు. ఆ ప్రాంతంలో ఖరీఫ్ సీజన్‌లో వేసిన పంటలలో అత్యధిక భాగం దెబ్బతిన్నాయి. అల్పపీడన ప్రభావంతో ఈనెల 22 నుంచి 25 వరకు నాలుగు రోజుల పాటు విస్తారంగా కురిసిన వర్షాలతో ఆ ప్రాంతంలోని పత్తి, మిర్చి, పొగాకు, సజ్జ ఇతర పంటలకు

మిగతా 6వ పేజీలో


ఒంగోలులోని కొత్తపట్నం బస్టాండ్ వద్ద శివాలయంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు

కార్తీక శోభ

జిల్లావ్యాప్తంగా కార్తీక శోభ సంతరించుకుంది. పవిత్ర మాసంలోని తొలి సోమవారం సందర్భంగా శివాలయాలకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. పసుపు, కుంకుమ సమర్పించారు. రాత్రి కూడా కొందరు దీపారాధనలు చేశారు. నిండు నూరేళ్ల ముత్తైదువులుగా జీవించేలా దీవించాలని సర్వేశ్వరుడిని ప్రార్థించారు. ఆలయాల వద్ద భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.

వివరాలు లోపలి పేజీల్లో..

పదవీకాలం పెంపు... కమిటీలకు పూర్వవైభవం

- ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని ఏఎంసీ చైర్మన్ల సమావేశంలో తీర్మానం
- సమన్వయం కోసం రాచగర్ల అధ్యక్షుడుగా త్రిసభ్య కమిటీ ఎన్నిక
- సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే జనార్దన్

ఒంగోలు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : మార్కెట్ కమిటీల పాలకవర్గాల పదవీ కాలం ఏడాది కాకుండా కనీసం రెండేళ్లకు పెంపు, గత ప్రభుత్వ కాలంలో నిర్లక్ష్యంగా మారిన కమిటీల రోజువారీ కార్యకలాపాలను విస్తృతపరిచి పూర్వవైభవం తెచ్చేలా చర్యలు తీసుకోవాలని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్లు ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం స్థానిక ఏఎంసీ కార్యాలయంలో సమావేశమై ఈమేరకు తీర్మానం చేశారు. ఒంగోలు ఏఎంసీ చైర్మన్ రాచగర్ల వెంకట్రావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జిల్లాలోని ఇతర ఏఎంసీ చైర్మన్లు అందరూ పాల్గొన్నారు. ఏఎంసీ చైర్మన్లుగా ఉన్న కొందరు

మిగతా 6వ పేజీలో


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జనార్దన్, హాజరైన ఏఎంసీల చైర్మన్‌లు

'రైతు వారధి'కి పొంచి ఉన్న ముప్పు

- తెగిన అప్రోచ్ రోడ్డు
- నిలిచిన రాకపోకలు

7

8,140 హెక్టార్లలో పంటలు నష్టం

భారీ వర్షాలతో దెబ్బతిన్న పత్తి, మొక్కజొన్న, మిరప పంటలు

ప్రాథమికంగా గుర్తించిన వ్యవసాయశాఖ

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు జిల్లాలో 8,140.18 హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నట్లు వ్యవసాయశాఖ అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. జిల్లాలోని 21 మండలాల పరిధిలోని 159 గ్రామాలకు చెందిన 9,312 మంది రైతులకు చెందిన పంటలు దెబ్బతిన్నట్లు ప్రభుత్వానికి నివేదించినట్లు సమాచారం. ఇంకా వర్షం వీడకపోవడంతో పంట నష్టాలు ఇంకా పెరిగే అవకాశం ఉంది. పెద్దారవీడు మండలంలో 13 గ్రామాలకు చెందిన 1,309 మంది రైతులు, మార్కాపురం మండలంలో 15 గ్రామాలకు చెందిన 3,260 మంది, తర్లుబాడు మండలంలో 13 గ్రామాలకు చెందిన 99 మంది, కంభం మండలంలో రెండు గ్రామాలకు చెందిన 30 మంది రైతులు, అర్ధవీడు మండలంలో నాలుగు గ్రామాలకు చెందిన 55 మంది రైతులు, మర్రిపూడి మండలంలో 18 గ్రామాలకు చెందిన 420 మంది రైతులు, పొదిలి మండలంలో 27 గ్రామాలకు చెందిన 185 మంది రైతులు, దర్శి మండలంలో ఐదు గ్రామాలకు చెందిన 228 మంది రైతులు, కొనకనమిట్ల మండలంలో మూడు గ్రామాలకు చెందిన 258 మంది రైతులు, దొనకొండ మండలంలో ఐదు గ్రామాలకు చెందిన 389 మంది రైతులకు చెందిన పలు రకాల పంటలు దెబ్బతిన్నట్లు గుర్తించారు. మొత్తమ్మీద పత్తి 6,178 హెక్టార్లు, మొక్కజొన్న 124.06 హెక్టార్లు, సజ్జ 771.40 హెక్టార్లు, జొన్న 5.42 హెక్టార్లు, వేరుశనగ 9.7 హెక్టార్లలో వర్షాలకు పంటలు దెబ్బతిన్నట్లు వ్యవసాయశాఖ అధికారులు ప్రాథమికంగా అంచనా వేసి ప్రభుత్వానికి నివేదించారు.

పత్తికి నష్టం

రాచర్ల, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : వర్షాల వలన పత్తికి తీవ్ర నష్టం జరిగిందని వ్యవసాయ శాఖ అధికారి షేక్ మహబూబ్ బాషా చెప్పారు. మండలంలోని ఒద్దులవాగుపల్లి, రామాపురం, మేడంవారిపల్లిలో పత్తి పైర్లు దెబ్బతిన్నట్లు తెలిపారు. ముందుగా వేసిన పంటలు కొంతమేర రైతులకు మేలు చేకూరతాయని, ఆలస్యంగా వేసినవి కాయ దశకు రావడంతో వర్షాలకు నష్టపోయాయని చెప్పారు. మొత్తం 250హెక్టార్ల పత్తి నష్టానికి గురైందన్నారు. ప్రస్తుతం ఏయే పంటలు ఎంతమేర నష్టం జరిగింది అంచనా వేస్తున్నామని చెప్పారు.



దెబ్బతిన్న పంట



తర్లుపాడులో ఉరకెత్తిన పొగాకు

లబోదిబోమంటున్న రైతులు

తర్లుపాడు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మిరప, పొగాకు దెబ్బతిన్నాయి. పైర్లలో నీరు నిల్వ ఉండడంతో ఉరకెత్తుతున్నాయి. మండలంలో సుమారు 800 ఎకరాల్లో మిరప సాగుచేశారు. ఎకరాకు దాదాపు రూ.70వేల వరకు ఖర్చు చేశారు. ఈ వర్షాలకు మిరప తోటల్లో నీరు నిల్వ ఉండి 2 రోజులుగా ఎండలు కాస్తుండటంతో మిరప మొఖాలు వేలేస్తున్నాయి. పొగాకు కూడా నీరు నిల్వ ఉండి మొక్కలు ఉరకెత్తుతున్నాయి. ఇప్పటి వరకు దాదాపుగా 400 ఎకరాల్లో పొగాకు సాగు చేశారు. రేగడి నేలల్లో పొగాకు మొక్కలు దెబ్బతింటున్నాయి. తర్లుపాడు, సీతానాగులవరం, నాయుడపల్లె గ్రామాల్లో ఎక్కువగా మిరప, పొగాకు పంటలు సాగు చేశారు. మొంథా తుఫాన్ దెబ్బకు పైర్లు కూడా పూర్తిగా దెబ్బతిన్నాయి. ఈ ఏడాది మిర్చి, పొగాకు రైతులకు కోలుకోలేని దెబ్బతిన్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. దీంతో రైతులు లబోదిబోమంటున్నారు.

భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలి : ఎమ్మెల్యే అశోక్ రెడ్డి

అట్టహాసంగా పాతాళ నాగేశ్వరస్వామి పాలకవర్గం ప్రమాణ స్వీకారం



ప్రమాణం చేయిస్తున్న ఈవో శ్రీనివాసులు, పక్కన ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

గిద్దలూరు టౌన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : నూతనంగా ఏర్పడిన పాలకవర్గం భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి సూచించారు. సోమవారం పట్టణంలో ప్రసిద్ధ శ్రీ పాతాళ నాగేశ్వరస్వామి పాలకవర్గ ప్రమాణ స్వీకారం అట్టహాసంగా జరిగింది. శ్రీ పాతాళ నాగేశ్వరస్వామి దేవస్థాన ధర్మకర్తల మండలి ఛైర్మన్‌గా పట్టణానికి చెందిన ఆరవీటి సుబ్రమణ్యం, కమిటీ సభ్యులుగా దుర్బాక అనిల్‌శాస్త్రి, గంటా కృష్ణారెడ్డి, మోడిగారి క్రిష్ణ, రాచర్ల కాసులు, మరడ మంగమ్మ, రావూరి లక్ష్మీదేవి, బెల్లం అనసూయ, వేములపాటి లక్ష్మీదేవిని ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ చిక్కుడు శ్రీనివాసులు ప్రమాణం చేయించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి హాజరై ధర్మకర్తల మండలి సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ భక్తుల మనోభావాలకు అనుసరించి పాలకవర్గ సభ్యులు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్ అండ్‌బీ ఓఎస్‌డీ సన్నిధి మురళికల్యాణి, జనసేన ఇన్‌చార్జి బెల్లంకొండ సాయిబాబా, టీడీపీ నాయకులు క్రిష్ణకిశోర్‌రెడ్డి, దప్పిలి కాశిరెడ్డి, అమ్మవారిశాల అధ్యక్షులు వాడకట్టు రంగసత్యనారాయణ, సొసైటీ బ్యాంక్ ఛైర్మన్ దుత్తా బాలీశ్వరయ్య, మార్కెట్‌యార్డు వైస్ ఛైర్మన్ గోడి ఓబులరెడ్డి, బీజేపీ నాయకులు రమేష్‌రెడ్డి, జేవీ నారాయణ పాల్గొన్నారు.

ఘనంగా ముగిసిన బ్యాడ్మింటన్ పోటీలు



విజేతలతో పీడీబీఏ ప్రతినిధులు

ఒంగోలు కార్పొరేషన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మూడు రోజులపాటు జరిగిన రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలు సోమవారం ఘనంగా ముగిశాయి. స్థానిక లార్డ్ కృష్ణ షటిల్ అకాడమీలో ఈనెల 24 నుంచి 27వ తేదీ వరకు జరిగిన అండర్ 13 బాల, బాలికల పోటీలు హోరా హోరీగా సాగాయి. ఈ పోటీలలో 343 మందికి మ్యాచ్‌లు నిర్వహించగా, అందులో బాలికల సింగిల్స్‌లో కృష్ణా జిల్లాకు చెందిన శ్రీరామ్ కావ్య విజేతగా నిలిచింది. అదే జిల్లాకు చెందిన కియా కొసరాజు రన్నర్‌గా నిలిచారు. బాలుర సింగిల్స్‌లో నెల్లూరు జిల్లాకు చెందిన వర్షిత్ విజేత కాగా, కర్నూలు జిల్లాకు చెందిన రేహాన్ రన్నర్ స్థానాలను దక్కించుకున్నారు. బాలుర డబుల్స్‌లో విజయవాడకు చెందిన సుహాన్, విశాఖకు చెందిన రిత్విక్ విజయం సాధించారు. నెల్లూరుకు చెందిన మనోహర్ రెడ్డి, వసంత్‌రమేష్ రన్నర్‌గా నిలిచారు. ఈ సందర్భంగా అకాడమీ ఫౌండర్ ప్రెసిడెంట్ అద్దంకి మురళీకృష్ణ, పీడీబీఏ అసోసియేషన్ కార్యదర్శి పి.విజయ్ కృష్ణ, టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ రఘుబాబు విజేతలకు బహుమతి ప్రదానం చేశారు.

రెడ్ అలర్ట్

(5వ పేజీ తరువాయి)

పంట, మరికొన్ని కోత, ఇంకొన్ని ఎదుగుదల దశలో ఉన్నాయి. నాలుగు రోజులక్రితం అల్పపీడన ప్రభావంతో కురిసిన వర్షాలు వాటిని దెబ్బతీశాయి. ఈ పరిస్థితుల్లో తుఫాన్ రావడం, భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో ఆ పంటలన్నీ తుడిచిపెట్టుకపోతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. తుఫాన్ నేపథ్యంలో జిల్లా నుంచి చెన్నై ఇటు విజయవాడ- చెన్నై, అటు గుంటూరు- గుంతకల్ మార్గాలలో పలు రైళ్లను రైల్వే అధికారులు రద్దుచేశారు ఆర్టీసీ అధికారులు కూడా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. గుండ్లకమ్మ ప్రాజెక్టులోకి 9,767 క్యూసెక్కుల వరద నీరు వస్తుండటంతో నాలుగు గేట్లు ఎత్తి ఆ నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

పశ్చిమాన అపార నష్టం

(5వ పేజీ తరువాయి)

నష్టం వాటిల్లింది. ప్రాథమికంగా ఆ వర్షాలకు జిల్లాలోని 21 మండలాల్లోని 156 గ్రామాల్లో 8,888 మంది రైతులకు చెందిన దాదాపు 2వేల ఎకరాలలో పంటలు దెబ్బతిన్నట్లు వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేశారు. అందులో 90శాతం పంటలు పశ్చిమ ప్రాంతంలోనే ఉన్నాయి. బాగా దెబ్బతిన్న వాటిలో ఒక్క పత్తి పంటే ఇంచుమించు 14వేల ఎకరాలలో ఉంది. వర్షాలు వెలసి పశ్చిమప్రాంతంలో శనివారం సాయంత్రం నుంచి సోమవారం సాయంత్రం వరకు పొడి వాతావరణం నెలకొనగా పంటలు జరిగిన నష్టం వెలుగుచూస్తోంది.

పొలాల్లోనే వాన నీరు

అల్పపీడన ప్రభావంతో కురిసిన వర్షాలు ఆగిపోయి మూడు రోజులు గడుస్తున్నా ఇంకా పశ్చిమప్రాంతంలోని అనేక గ్రామాల్లో పంట పొలాల్లో నీరు బయటకు వెళ్లలేదు. దీంతో వేలాది ఎకరాల్లో పంటలు ఉరకెత్తుతున్నాయి. ప్రధానంగా పత్తి, మిర్చి, పొగాకు పంటలకు ఈ పరిస్థితి ఎదురు కాగా సజ్జ పంట కోత దశలో ఉండటంతో కంకులు మొలకెత్తుతున్నాయి. అల్పపీడన ప్రభావంతో కురిసిన వర్షాలకే ఈ పరిస్థితి ఎదుర్కొన్న ఈ ప్రాంత రైతులు ప్రస్తుత తుఫాన్ ప్రభావంపై మరింత ఆందోళన చెందుతున్నారు. మొంథా తుఫాన్ ప్రభావంతో సోమవారం సాయంత్రం నుంచి వర్షాలు ప్రారంభమయ్యాయి. బుధవారం వరకు అవి కొనసాగే అవకాశం ఉంది. ఇప్పటికే ఉరకెత్తుతున్న పంట పొలాలు ఈ వర్షాలతో పూర్తిగా దెబ్బతిని పోతాయని రైతులు వాపోతున్నారు. సగటున ఒక్కో ఎకరాకు రూ.40 వేల నుంచి రూ.50వేల వరకు రైతులు ఖర్చుచేయగా ఇప్పటికే సగం నష్టపోయిన రైతులు తాజా వర్షాలతో పూర్తిగా నష్టపోతామని ఆవేదన చెందుతున్నారు.

పదవీకాలం పెంపు.. కమిటీలకు పూర్వ వైభవం

(5వ పేజీ తరువాయి)

మహిళల బదులు వారి భర్తలు హాజరయ్యారు. కాగా రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లోనూ ఏఎంసీ ఛైర్మన్లు సమావేశాలు నిర్వహించుకొని ఈ అంశాలపై చర్చించి త్వరలో రాష్ట్రస్థాయిలో అన్ని జిల్లాల ప్రతినిధులతో ప్రత్యేక సదస్సు నిర్వహణకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో జిల్లా స్థాయిలో సోమవారం ఈ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఏడాది కాలం మాత్రమే పదవి ఉంటే ఏ ఒక్క పని సజావుగా చేసే అవకాశం ఉండదని, కనీసం ఆ రెండేళ్ళ అయినా ప్రస్తుత పాలక వర్గాలను కొనసాగించాలని పలువురు అభిప్రాయపడ్డారు. అలాగే గతంలో టీడీపీ పాలనలో ఏఎంసీల ద్వారా గ్రామాల్లో లింకు రోడ్లు, గోడౌన్ల నిర్మాణం, పశు వైద్యశిబిరాలు, ఇతర పలు కార్యక్రమాలు జరిగేవన్నారు. వైసీపీ ప్రభుత్వ కాలంలో వాటన్నింటినీ మూలన పడేసి పాలకవర్గాలను నిర్వీర్యం చేసిందని ఆరోపించారు. ప్రస్తుత ప్రజా ప్రభుత్వం తిరిగి మార్కెట్ కమిటీలకు పూర్వ వైభవం తెచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. త్వరలో రాష్ట్రస్థాయిలో జరిగే సదస్సుకు జిల్లా నుంచి ఛైర్మన్‌లందరూ హాజరుకావాలని నిర్ణయించారు. జిల్లాలో సమన్వయం కోసం ఒంగోలు ఏఎంసీ ఛైర్మన్ రాచగొర్ల వెంకట్రావు అధ్యక్షుడిగా కంభం, కనిగిరి ఛైర్మన్లతో కూడిన త్రిసభ్య కమిటీని ఎన్నుకున్నారు. ఇదిలా ఉండగా సమావేశంలో ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ కొద్దిసేపు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అలాగే ఎన్నికల సమయంలోనూ క్రియాశీలకంగా పనిచేసిన వారిని గుర్తించి ప్రోత్సహించేందుకు అన్ని నియోజకవర్గాల్లోనూ ముఖ్య నేతలనే ఏఎంసీ ఛైర్మన్లుగా ఎంపిక చేశారన్నారు. రైతు ప్రయోజనాలు ప్రధానంగా పనిచేసి రైతు పక్షపాతులుగా పేరు తెచ్చుకోవాలని సూచించారు. సమావేశంలో ఒంగోలు మేయర్ గంగాడ సుజాత కూడా పాల్గొన్నారు.

తుఫాన్ నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి

మంత్రి గొట్టిపాటి రవికుమార్



టీడీపీ నేత ఏడుకొండలను పరామర్శిస్తున్న మంత్రి గొట్టిపాటి

పంగులూరు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి):మొంథా తుఫాన్ తీవ్రతను గుర్తించి అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి తగిన సహాయక చర్యలు చేపట్టాలని రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. మండలంలోని ముప్పవరం గ్రామ టీడీపీ కార్యాలయంలో సోమవారం సాయంత్రం నియోజకవర్గ పరిధిలోని 78 మంది లబ్ధిదారులకు రూ.45 లక్షల సీఎంఆర్ఎఫ్. చెక్కులను పంపిణీచేశారు. పార్టీ కార్యకర్తలకు ప్రమాదభీమా చెక్కులను అందచేశారు. దేశంలో ఏ పార్టీకి లేనిబలం టీడీపీకి ఉందని, పార్టీకి కార్యకర్తలే బలమని అన్నారు. ఇక గ్రామాల్లో పంటసాగుకు సరిపడ ఎరువులు అందుబాటులో ఉండేలా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. తుఫాన్ దృష్ట్యా గ్రామాలలో విద్యుత్ సమస్యలు తలెత్తకుండా అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఇ.ఇ. మస్తానరావు, ఎ.డి. ఇ.ఇ దామోదరంలను ఆదేశించారు. తుఫాన్ సమయంలో ప్రజలు ఎవరూ బయటకు రాకుండా చూడాలన్నారు. ప్రభుత్వ యంత్రాగం నిబద్ధతతో పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేషన్ డైరెక్టర్ నాగినేని రామకృష్ణ, పంగులూరు, అద్దంకి మండలాల టీడీపీ అధ్యక్షులు రావూరి రమేష్, మురళిమోహన్‌దాస్, అల్లంనేని బ్రహ్మానందస్వామి, గొల్లపూడి అంజయ్య, బత్తుల వెంకట్రావు, చింతల సహదేవుడు, గరిమిడి జగన్, ఓబుల్‌రెడ్డి, సింగర్, నార్నె సుబ్బారావు, శ్రీనివాసరెడ్డి, మురకొండ సుబ్బారావు, రవి.వీరాంజనేయులు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఏడుకొండలకు మంత్రి పరామర్శ

రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స తీసుకుంటున్న టీడీపీ మండల నాయకుడు కుక్కపల్లి ఏడుకొండలను మంత్రి గొట్టిపాటి రవికుమార్ సోమవారం పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరితగతిన కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆయన వెంట టీడీపీ మండల అధ్యక్షుడు రావూరి రమేష్, పీఏసీఎస్ అధ్యక్షుడు అల్లంనేని బ్రహ్మానందస్వామి, ఆదిరెడ్డి పాల్గొన్నారు.

జలకళ

కంభం, అర్ధవీడు మండలాల్లో నిండుకుండల్లా చెరువులు

ఇప్పటికే అలుగులు పారుతున్న వైనం

20 ఏళ్లలో ఇదే మొదటిసారి అంటున్న రైతులు

సాగుకు ఢోకాలేదని ఆనందం వ్యక్తం చేస్తున్న కర్షకులు





దాదాపు 20 ఏళ్ల క్రితం కంభం, అర్ధవీడు మండలాలకు సంతరించుకున్న జలకళ మళ్లీ ఇన్నాళ్లకు ఆవహించింది. ఇటీవల విడవకుండా కురుస్తున్న వర్షాలకు వాగులు, వంకలు నిండిపోవడంతో రైతులు ఉబ్బితబ్బిబ్బు అవుతున్నారు. అర్ధవీడు మండలంలోని 5 చెరువులు, 20కిపైగా కుంటలు నిండి అలుగులు పారుతున్నాయి. అలాగే కంభం మండలం తురిమెళ్ల గ్రామ పంచాయతీలోని తప్పెటవాని చెరువు నిండి అలుగు పారేందుకు సిద్ధంగా ఉండడంతో రెండు మండలాల రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. చారిత్రాత్మక కంభం చెరువులో ప్రస్తుతం 15అడుగుల మేర నీరు చేరింది. కంభం ఇరిగేషన్ ఏఈ శ్రీనివాస నాయక్ మాట్లాడుతూ పదిరోజులుగా కురుస్తున్న భారీ వర్షాల వలన అర్ధవీడు మండలంలోని నాయునిచెరువు, తిమ్మనచెరువు, మల్లయ్య చెరువు, చెన్నరాయుని చెరువులు నిండి అలుగులు పారుతున్నట్లు తెలిపారు. మండలంలోని 30కి పైగా కుంటలు ఉండగా వాటిలో 21 పైగా కుంటలు నిండాయన్నారు. భౌగోళికంగా రెండు పాయలుగా చీలి ఉండే అర్ధవీడు మండలంలో తాగు, సాగు నీటి సమస్య తీరినట్లేనని చెప్పారు. 20ఏళ్ల తర్వాత రెండు మండలాల్లో చెరువులు, కుంటలు, చెక్‌డ్యాములు నిండుకుండలను తలపిస్తుండడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. - కంభం, ఆంధ్రజ్యోతి

చెరువు కట్టల పటిష్టతకు సత్వర చర్యలు



చెరువును పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి జగన్

పెద్దారవీడు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఇరిగేషన్ చెరువుల ఆనకట్టల పటిష్టతకు సత్వర చర్యలు చేపడుతున్నట్లు మండల ప్రత్యేకాధికారి, వయోజన విద్య డిప్యూటీ డైరెక్టర్ జగన్ చెప్పారు. మండలంలో ఇటీవల కురుస్తున్న వర్షాల నేపథ్యంలో ఇరిగేషన్ చెరువుల బలోపేతానికి అవసరమైన చర్యలను చేపట్టేందుకు తహసీల్దార్ దిలీప్‌కుమార్, ఇరిగేషన్ ఏఈ సుధాకర్‌లతో కలిసి పర్యటించారు. తొలుత బదీటీ చెర్లోపల్లి చెరువు వద్ద జరుగుతున్న పిచ్చిమొక్కల తొలగింపు పనులను పరిశీలించారు. అనంతరం సానికవరం-తమ్మడపల్లి మధ్య ఉన్న గండిచెరువును సందర్శించారు. గండి చెరువు ఇప్పటికే 100 శాతం వర్షపు నీటితో నిండిపోయినట్లు గుర్తించారు. చెరువుకు ఉన్న కాల్వల తూములు ద్వారా నీటిని బయటకు పంపే అంశాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. బద్వీటి చెర్లోపల్లి - రామాయపాలెం మధ్య నల్లవాగును పరిశీలించారు. అనంతరం మండల స్థాయిలో క్షేత్ర స్థాయి సిబ్బందితో సమావేశాలు నిర్వహించి చెరువుల పటిష్టతకు చర్యలు తీసుకుంటామన్నారు.

కార్తీక శోభ..!

భక్తిశ్రద్ధలతో తొలి సోమవారం పూజలు

పలు దేవాలయాలలో మహిళల దీపారాధనలు

శివాలయాలకు పోటెత్తిన భక్తులు





హారతి ఇస్తున్న మహిళ, రాజరాజేశ్వరస్వామి దేవాలయంలో వినాయక స్వామి

ఒంగోలు కల్చరల్, అక్టోబర్ 27(ఆంధ్రజ్యోతి) : కార్తీకమాసం తొలి సోమవారాన్ని జిల్లా వ్యాప్తంగా ప్రజలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఆదివారం రాత్రి వరకు కురిసిన వర్షం సోమవారం ఉదయం తెరపి ఇవ్వడంతో శివాలయాలకు భక్తులు పెద్దసంఖ్యలో హాజరై పరమేశ్వరుని, అమ్మవారిని దర్శించుకున్నారు. ఇక మహిళలు సోమవారం తెల్లవారుజాము నుంచే తమ దగ్గరలోని శివాలయాలకు వచ్చి కార్తీక దీపాలను వెలిగించి పసుపు, కుంకుమ సమర్పించారు. ఒంగోలు నగరంలోని ప్రముఖ శివాలయాలైన కేశవస్వామిపేట గంగా పార్వతీ సమేత కాశీవిశ్వేశ్వర స్వామి దేవస్థానం, కొత్తపట్నం బస్టాండు శ్రీరాజరాజేశ్వర స్వామి దేవస్థానం, అంజయ్య రోడ్డు శ్రీపంచముఖ శివాలయంతో పాటు సంతపేట, లాయర్‌పేటలలో ఉన్న సాయిబాబా మందిరాలలోని శివాలయాలు, రంగారాయుడు చెరువు దగ్గర ఉన్న శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానం, గంటాపాలెం శివాలయం మొదలైన అనేక ఆలయాలలో భక్తులు పెద్దసంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులు శీఘ్రంగా స్వామివారిని దర్శించుకునే విధంగా ఆయా దేవస్థానాల కార్యనిర్వహణాధికారులు, నిర్వాహకులు తగిన ఏర్పాట్లు చేశారు. సోమవారం రాత్రి సైతం ఆలయాలకు మహిళలు పెద్దసంఖ్యలో వచ్చి దీపారాధనలు చేశారు.



స్వామి దర్శనానికి బారులుదీరిన భక్తులు



కొత్తపట్నం బస్టాండ్ సెంటర్‌లోని గుడిలో మహిళల పూజలు

భగ్గుమంటున్న కూరగాయల ధరలు

టమాటా బాక్స్ రూ.1000

కిలో మునగ కాయలు వందరూపాయలు

మార్కెట్‌కు తగ్గిన దిగుమతులు

మార్టూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : కూరగాయల ధరలు భగ్గుమంటున్నాయి. మొన్నటివరకూ అందుబాటులో ఉన్నా ఇప్పుడు ఒక్కసారిగా పెరిగాయి. ప్రతి కూరలోనూ రుచి కోసం వినియోగించే టమాటా 25 కిలోలు బాక్స్ రూ.1000 ధర పలుకుతోంది. అంటే హోల్‌సేల్‌గా కిలో రూ.40 కాగా, చిల్లరగా కిలో ధర రూ.50 పలుకుతోంది. ఇక మార్కెట్ నుంచి టమాటా బహిరంగ మార్కెట్‌లోకి, గ్రామాలలో వీధులలోకి వచ్చిన తర్వాత కిలో రూ.50 నుంచి రూ.60లకు పైగానే ధర ఉంది. మార్టూరులోని పచ్చిమిర్చి కూరగాయల మార్కెట్‌లో సోమవారం కూరగాయల ధరలు భగ్గుమంటున్నాయి. ఈ ప్రాంతంలో టమాటా సాగు చాలా తక్కువ కావడంతో, మార్కెట్‌లోని వ్యాపారులు అనంతపురం, చిత్తూరు, మదనపల్లి, కర్నూలు, డోన్, కర్నాటకలోని చంతామణి, కోలారు తదితర ప్రాంతాలు నుంచి దిగుమతి చేసుకుంటారు. ఇటీవల దిగుబడి పూర్తిగా తగ్గిపోవడం, కేవలం అనంతపురం, మదనపల్లి, చిత్తూరు జిల్లాల నుంచి టమాటాను దిగుమతి చేసుకోవడంతో డిమాండు పెరిగింది. గతంలో రోజుకు 1200 బాక్స్‌లు మార్కెట్‌కు రాగా, వారం రోజుల నుండి కేవలం 800 బాక్స్‌లు మాత్రమే వస్తున్నాయి. వారం రోజుల క్రితం బాక్స్ ధర రూ.500 ఉండగా, ప్రస్తుతం ధర రెట్టింపు పలుకుతోంది. అదే విధంగా మునగ కాయలు స్థానికంగా దిగుబడి లేకపోవడంతో, చెన్నై నుంచి వస్తున్నాయి. అవి కూడా సక్రమంగా రావడం లేదు. ప్రస్తుతానికి కిలో మునగ వంద రూపాయలు ధర పలుకుతోంది. అవి కూడా మార్కెట్‌లో లభించడం లేదు. నాలుగురోజుల క్రితం ఈ ప్రాంతంలో కురిసిన వర్షాలకు కూరగాయలు పంటలు దెబ్బతినడంతో, ప్రస్తుతం మార్కెట్‌కు కూరగాయలు చాలా తక్కువగా వస్తున్నాయి. అయ్యప్ప, వెంకన్న, ఆంజనేయ స్వామి మాలధారులకు వివిధ దేవాలయాల్లో అన్నదాన కార్యక్రమాలు పెరగడంతో కూరగాయలకు మరింత డిమాండు పెరిగింది. ఇటీవల కురిసిన వర్షాలకు మిరప కాయలు కోతలు జరగకపోవడంతో, ప్రస్తుతం రైతులందరూ మిరప కోస్తుండటంతో, దిగుబడి పెరిగి, మిరప ధర కిలో రూ.20 పలకడం విశేషం.

మార్టూరు మార్కెట్‌లో ధరలు	
టమోటాలు	రూ.40
బంగాళదుంపలు	రూ.40
బెండ	రూ.40
దొండ	రూ.50
వంకాయ	రూ.40
బీర	రూ.40
కాకర	రూ.50
క్యాప్సికం	రూ.80
క్యారెట్	రూ.70
కీరదోస	రూ.40

ప్రియురాలికి పురుగుల మందు ఇచ్చిన ప్రియుడు..

సహజీవనం వద్దన్నందుకు ఘాతుకం

అద్దంకి,అక్టోబరు27(ఆంధ్రజ్యోతి):సహజీవనం చేసేందుకు నిరాకరించిందన్న ఉద్దేశ్యంతో ప్రియుడు కూల్‌డ్రింక్‌లో పురుగుల మందు కలిపి ఇచ్చాడు. పోలీసుల కథనం మేరకు అద్దంకి మండలంలోని తిమ్మాయపాలేనికి చెందిన ఓ మహిళ కొంతకాలంగా భర్తకు దూరంగా ఒంటరిగా ఉంటుంది. కుమారుడు, కుమార్తె ఉన్నారు. వినుకొండ ప్రాంతానికి చెందిన రాజు అనే యువకుడితో గత ఏడాదిగా సహజీవనం చేస్తోంది. అయితే కుమారుడు, కుమార్తె ఇద్దరు 15 సంవత్సరాల కంటే ఎక్కువ వయస్సు ఉన్నవారే కావడంతో సహజీవనం చేసేందుకు సదరు మహిళ నిరాకరించింది. దీంతో యువకుడు ఏదోవిధంగా ప్రియురాలిని చంపాలన్న ఉద్దేశ్యంతో ఆదివారం రాత్రి కూల్ డ్రింక్ లో గడ్డిమందు కలిపి ఇచ్చాడు. సదరు మహిళ కూల్‌డ్రింక్‌ను సగం తాగి మిగిలిన సగాన్ని మంచం వద్ద ఉంచింది. ఆమెకు సోమవారం ఉదయం వాంతులు అయ్యాయి. వేకువజామునే రాజు ఇంటి నుండి బయటకు వెళ్లాడు. దీంతో ఈ విషయాన్ని సమీప గృహాల ప్రజలు రాజుకు చెప్పారు. కూల్‌డ్రింక్‌లో పురుగు మందు కలిపి ఇచ్చానని వారికి రాజు చెప్పాడు. దీంతో స్థానికులు సదరు మహిళను అద్దంకి వైద్యశాలకు తరలించి మెరుగైన వైద్యం కోసం రిమ్స్ కు తరలించారు. రిమ్స్ నుండి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ సుబ్బరాజు తెలిపారు.

పండుతున్న పచ్చదనం

- కంకణాలపల్లె పాఠశాలలో కిచెన్ గార్డెన్
- మొలకెత్తిన విత్తనాలు, పచ్చని పర్యావరణం


కిచెన్‌గార్డెన్ ద్వారా పండుతున్న తోటకూర


తీగజాతి కూరగాయ మొక్కలు

త్రిపురాంతకం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ప్రవేశపెట్టిన కిచెన్ గార్డెన్ పథకం ఆశయాన్ని విద్యార్థులు ప్రేమతో శ్రమతో నెరవేరుస్తున్నారు. వారి చేతుల్లో మొలకెత్తిన విత్తనాలు, పెరుగుతున్న కూరగాయలు విద్యతో పాటు విలువలు నేర్పిస్తున్నాయి. పచ్చదనంతో నిండిన ఈ ప్రాంగణం పర్యావరణానికి ప్రాణం పోసిన ఈ పాఠశాల విద్యార్థుల జీవితానికే కొత్త స్ఫూర్తిని అందిస్తోంది. త్రిపురాంతకం మండలం కంకణాలపల్లి పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి వివిధ రకాల కూరగాయలను పండిస్తూ పర్యావరణ పరిరక్షణతో పాటు ఆహార భద్రతకు కొత్త దారులు వేస్తున్నారు. కిచెన్ గార్డెన్ కార్యక్రమంతో పిల్లల్లో ప్రకృతిపై ఆసక్తితో పాటు శ్రమ విలువ, ఆరోగ్యకర ఆహారం పట్ల ఆసక్తి పెరుగుతోంది. కూరగాయలు పండించటము, పాఠాలు నేర్చుకోవటము ఏకకాలంలో కొనసాగుతున్న ఈ ప్రయత్నం అక్కడి విద్యా వాతావరణాన్ని పచ్చగా మార్చింది.

కంకణాలపల్లి జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల ఆవరణలో కిచెన్ గార్డెన్ కార్యక్రమాన్ని ప్రధానోపాధ్యాయిని వెంకాయమ్మతో పాటు ఉపాధ్యాయులు అమలు పరుస్తున్నారు. ప్రభుత్వం కిచెన్ గార్డెన్ నిర్వహణ కోసం రూ.5వేలను ప్రోత్సాహంగా ఇస్తోంది. వాటితో ఇక్కడి ప్రాంగణంలో ఆకుకూరలు, కూరగాయలు పండిస్తూ వాటిని మధ్యాహ్న భోజనంలో వినియోగిస్తూ విద్యార్థులకు ఆరోగ్యకర వాతావరణాన్ని ఏర్పాటు చేస్తున్నారు. పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయులంతా కలిసి దాదాపు రూ.20వేల ఖరీదైన బాదం, కొబ్బరి, బూరుగ, మహాగని, క్రోటాన్ లాంటి వివిధ రకాల మొక్కలను దర్శి ఒంగోలు ప్రాంతాల నుంచి తెచ్చి పెంచుతూ పర్యావరణాన్ని కూడా కాపాడుతూ పచ్చని ప్రకృతి అందాలను విద్యార్థులకు అందిస్తున్నారు. కేవలం ప్రభుత్వ ప్రోత్సాహమే కాకుండా ఉపాధ్యాయులు విద్యార్థుల ఆసక్తిని కూడా ఇందుకు జత చేసి మంచి ఫలితాలను పొందగలుగుతున్నారు. విద్యార్థులు నాటిన విత్తనాలు కేవలం మొక్కలుగా మాత్రమే కాక వారికి జీవిత పాఠాలుగా నిలుస్తాయని ఉపాధ్యాయులు చెప్తున్నారు. ప్రకృతి నేర్పే పాఠాలతో పాటు ఆరోగ్యకర వాతావరణం, సొంతంగా పండించిన పంట ద్వారా తింటున్నామనే తృప్తి వారిలో కనిపిస్తుందంటున్నారు. ప్రభుత్వం అందించే కిచెన్ గార్డెన్ పథకాన్ని అవకాశం ఉన్న అన్ని పాఠశాలల్లో వినియోగించగలిగితే పచ్చదనం తెచ్చే మార్పు ఎంతో ప్రేరణగా నిలుస్తోందనడంలో సందేహం లేదు.



కంకణాలపల్లి పాఠశాల

తుఫాన్ ముప్పును ఎదుర్కొనేందుకు సర్వం సిద్ధం

కలెక్టర్ రాజాబాబు వెల్లడి

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాన్ ముప్పును ఎదుర్కొనేందుకు జిల్లా యంత్రాంగం ముందస్తు ఏర్పాట్లతో పూర్తి సన్నద్ధంగా ఉందని కలెక్టర్ రాజాబాబు వెల్లడించారు. స్థానిక కలెక్టరేట్‌లోని కమాండ్ కంట్రోలు రూములో సోమవారం సాయంత్రం జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ, డీఆర్వో చిన ఓబులేషుతో కలిసి ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. సోమవారం రాత్రి నుంచి జిల్లాలో తుఫాన్ ప్రభావం ఉంటుందని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో తగిన చర్యలు తీసుకున్నట్టు తెలిపారు. జిల్లాలో సోమవారం మధ్యాహ్నం నుంచే చిరు జల్లులు ప్రారంభమయ్యాయని, రాత్రికి ఉధృతి అధికంగా ఉండే అవకాశం ఉందని అన్నారు. మంగళ, బుధవారాల్లో తుఫాన్ ముప్పు ఉండే అవకాశం ఉన్నందున ఆ రెండు రోజులపాటు అతి భారీ వర్షాలు, బలమైన గాలులు సంభవించొచ్చని తెలిపారు. తీర ప్రాంత మండలాలైన సింగరాయకొండ, టంగుటూరు, కొత్తపట్నం, నాగులుప్పలపాడు మండలాలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. సోమవారం డ్రై రన్ కూడా నిర్వహించామన్నారు. తుఫాన్ నేపథ్యంలో 27 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు.


విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజాబాబు

మొంథాతో అప్రమత్తంగా ఉండాలి

మొంథా తుఫాన్ నేపథ్యంలో జిల్లాలోని ఎప్పటికప్పుడు పరిస్థితులను తెలుసుకుంటూ తగిన విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రాజాబాబు... అధికారులను ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణతో కలిసి స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ సమావేశపు హాలులో ఏర్పాటుచేసిన మొంథా తుఫాన్ కంట్రోలు రూమును సోమవారం సందర్శించి అక్కడ ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ అన్నిశాఖలను సమన్వయం చేసుకుంటూ తుఫాన్ పరిస్థితులు ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కంట్రోలు రూము సిబ్బందిని ఆదేశించారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి చిన ఒబులేషు, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ పీడీ మాధురి, కంట్రోలు రూము అధికారులు, సిబ్బంది ఉన్నారు.

తుఫాన్‌ను ఎదుర్కొనేందుకు ప్రత్యేక బలగాలు

- అత్యవసర పరిస్థితుల్లో 112, వాట్సప్ నెంబర్ 91211 02266కు సమాచారం ఇవ్వాలి
- ఎస్పీ హర్షవర్ధన్‌రాజు
- పాకల బీచ్ పరిశీలన

సింగరాయకొండ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాన్‌ను ఎదుర్కొనేందుకు పోలీసు యంత్రాంగం అవసరమైన చర్యలు తీసుకుందని ఎస్పీ హర్షవర్ధన్‌రాజు తెలిపారు. ప్రత్యేక బలగాలను రంగంలోకి దించామని చెప్పారు. సోమవారం ఆయన పాకల తీరంలో పర్యటించారు. బేవాచ్ టవర్ ద్వారా సముద్ర స్థితిని పరిశీలించారు. అక్కడ విధులు నిర్వహిస్తున్న పోలీస్, మెరైన్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుఫాన్ దృష్ట్యా ప్రభుత్వం అన్ని రకాల ముందస్తు చర్యలు చేపట్టిందని తెలిపారు. జిల్లాలో తుఫాన్ ప్రభావం ఎక్కువగా ఉండే 20 గ్రామాలను గుర్తించామని చెప్పారు. అక్కడ స్థానిక పోలీసులను, అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశామన్నారు. తుఫాన్ సమయంలో చెట్లు విరిగిపోయినా, నీరు నిల్వ ఉన్నా వెంటనే తొలగించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎక్స్‌కవేటర్లు, ట్రాక్టర్లు, క్రేన్‌లు, డోజర్లు, రోపులు, కట్టర్లు, డ్రాగన్ లైట్స్ సిద్ధంగా ఉంచామని పేర్కొన్నారు. తుఫాన్ ప్రభావం తగ్గే వరకు మత్స్యకారులు వేటకు వెళ్లవద్దని సూచించారు. లోతట్టు ప్రాంతాలు, శిథిలావస్థలో ఉన్న ఇళ్లలో ఉండే వారిని గుర్తించి వెంటనే పునరావాస శిబిరాలకు తరలించాలని సిబ్బందిని ఆదేశించారు. ప్రజలు అత్యవసర పరిస్థితుల్లో స్థానిక పోలీసులకు 112, వాట్సప్ నెంబర్ 91211 02266కు సమాచారం ఇవ్వాలని ఎస్పీ వెంట ఒంగోలు డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర, సింగరాయకొండ, కనిగిరి సీఐలు చావా హజరత్తయ్య, ఖాజావలి, ఎస్సైలు బి.మహేంద్ర, నాగమల్లేశ్వరరావు, మెరైన్ ఎస్సై ఈశ్వరయ్య, పాకల సర్పంచ్ సైకం చంద్రశేఖర్ ఉన్నారు.


పాకలతీరాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

తుఫాన్‌ను సమర్థవంతంగా ఎదుర్కోవాలి

- ఆస్తి, ప్రాణ నష్టం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి
- పునరావాస కేంద్రాల్లో ఇబ్బందులు లేకుండా చూడాలి
- మంత్రి డోలా శ్రీ బాలవీరాంజేయ స్వామి ఆదేశం
- విశాఖ, ప్రకాశం కలెక్టర్‌లతో టెలికాన్ఫరెన్స్



టంగుటూరు (కొండపి), అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : తుఫాన్‌ను సమర్థంగా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి సూచించారు. అధికారులంతా సమన్వయంతో పని చేయాలన్నారు. సోమవారం సాయంత్రం ఆయన తూర్పునాయుడుపాలెంలోని తన క్యాంపు కార్యాలయం నుంచి ప్రకాశం, విశాఖ కలెక్టర్‌లతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ముందస్తు జాగ్రత్తలపై సమీక్షించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబు తుఫాన్‌పై ఎప్పటికప్పుడు సమీక్ష చేస్తున్నారని అందుకు అనుగుణంగా అధికారులు ఆస్తి, ప్రాణ నష్టం వాటిల్లకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాలన్నారు. అక్కడ ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ఆహారం, తాగునీరు, మందులు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలు కూడా అత్యవసమైతే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావద్దని మంత్రి విజ్ఞప్తి చేశారు.

'రైతు వారధి'కి పొంచి ఉన్న ముప్పు

- తెగిన అప్రోచ్ రోడ్డు
- రెండు మండలాల మధ్య రాకపోకలు బంద్

కురిచేడు, అక్టోబరు 27(ఆంధ్ర జ్యోతి): రైతులు శ్రమకోర్చి స్వంత నిధులు సమకూర్చుకుని గుండ్లకమ్మ నదిపై నిర్మించుకున్న రైతు వారధికి ముప్పు ఏర్పడే సూచనలు కనబడుతు న్నాయి. అధిక వర్షాలతో గుండ్లకమ్మ నది పైభాగంలో కురిసిన వర్షాలతో ఉధృతంగా నీరు ప్రవహిస్తున్నది. వారధి గుండా నీరు వెళ్ళే తూములకు తూటుకాడ అడ్డుపడటంతో అధికా రులు ఎక్స్‌కవేటర్ సాయంతో వాటిని తొలగించి నీరు సక్రమంగా ప్రవహించేలా చూశారు. అయితే, అప్రోచ్ రోడ్డు తెగిపోవంతో కురిచేడు, త్రిపురాంతకం మండలా ల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి.

రైతుల కష్టం నీటి పాలయ్యే పరిస్థితి దాపురించింది. మొంథా తుఫాన్ ప్రభావంతో వర్షాలు కురుస్తుం డటంతో గుండ్లకమ్మ నదిలో నీరు ఉధృతంగా ప్రవహిస్తున్నది.


రైతు వారధి అప్రోచ్ రోడ్డు తెగి ప్రవహిస్తున్న నీరు

నీటితో పాటు పెద్ద మొత్తంలో తూటు కాడ, ముళ్ల కంప కొట్టుకు వస్తుంది. వారధి తూము లకు తూటుకాడ అడ్డుపడటంతో వారధి పైనుంచి నీరు ప్రవహిస్తున్నది. తహసీల్దార్ రజనీకుమారి అప్రమ త్తమై ఎక్స్‌కవేటర్‌ల సాయంతో తూములకు అడ్డుపడ్డ తూటుకాడను తొలగించారు. దీంతో నీరు యథావిధిగా తూములగుండా ప్రవహిస్తున్నా ఎక్కువ మొత్తంలో నీరు పైనుంచి రావంతో అప్రోచ్ రోడ్డు తెగిపోయింది. మొంథా తుఫాన్ ప్రభావంతో వ ర్షాలు ఎక్కువగా కురిస్తే పైనుంచి వర్షపు నీటితో రైతు వారధి దెబ్బతింటుందోమోనని అనుమానా లు వ్యక్తం అవుతున్నాయి. అయితే, నిర్మాణ దశలోనే వారధి బేస్‌మెంట్ గట్టిగా వేయడంతో నష్టం జరగదని ముప్పగంగవరం గ్రామస్థులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. గతంలో కూడా గుండ్లకమ్మ నదికి నీరు పెద్దమొత్తంలో వచ్చినా ఏమికాలేదని వారు గుర్తు చేస్తున్నారు.

అయితే, అప్రోచ్ రోడ్డు తెగిపోవడంతో గత రెండు రోజులుగా కురిచేడు, త్రిపురాంతకం మండలాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. ఒంగోలు నుంచి కురిచేడు, త్రిపురాంతకం మీదుగా యర్రగొండపాలెం వెళ్లే ఆర్టీసీ సర్వీసును నిలిపివేశారు. ద్విచక్రవాహనాలు సైతం తిరగడం లేదు. తహసీల్దార్ రజనీకుమారి సోమవారం వారధిని పరిశీలించి ఎవరూ రాకపోకలు సాగించవద్దని సూచించారు. గ్రామస్థులు సైతం పగటిపూట గుండ్లకమ్మ నది వద్దనే ఉండి ఎవరూ రాకుండా కాపలా కాస్తున్నారు.

పొగాకు రైతులు బోర్డు నిర్ణయాలను పాటించాలి

- వేలం నిర్వహణాధికారి తులసి

ఒంగోలు (రూరల్) అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : 2025-2026 సంవత్సరానికి పొగాకు పంట సాగు చేసే రైతులు బోర్డు నిర్ణయాలను పాటించాలని, అతిక్రమిస్తే రైతుల ఇబ్బందిపడతారని, బోర్డు అనుమతి ఇచ్చిన మేరకు మాత్రమే పంట సాగు చేయాలని ఒంగోలు పొగాకు బోర్డు-2 వేలం నిర్వహణాధికారి తులసి స్పష్టం చేశారు. ఒంగోలు పొగాకు వేలం కేంద్రం-2లో సోమవారం పొగాకు రైతులతో ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వేలం నిర్వహణాధికారి తులసి మాట్లాడుతూ పొగాకు పంట అంతర్జాతీయ మార్కెట్‌ను బట్టి ధరలుంటాయని, పొగాకు నిల్వలు భారీగా ఉన్నాయని రైతులు తెలుసుకోవాలని అన్నారు. రైతు నాయకులు వడ్డెళ్ల ప్రసాద్, పెనుబోతు సునిల్, వై.వెంకట శేషయ్య, దొడ్డా శీతారామయ్య పాల్గొన్నారు.

పొగాకు సమాఖ్య చైర్మన్‌గా జయంత్‌బాబు బాధ్యతలు స్వీకరణ


బాధ్యతలు స్వీకరిస్తున్న జయంత్‌బాబు

ఒంగోలు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ పొగాకు ఉత్పత్తిదారుల సహకార సంస్థ చైర్మన్‌గా మండవ జయంత్‌బాబు బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు అధికారుల పాలనలో ఉన్న ఆ సమాఖ్యకు ముగ్గురు సభ్యులతో కూడిన పర్సన్ ఇన్‌చార్జి కమిటీని వారం క్రితం ప్రభుత్వం నియమించింది. ఆ కమిటీకి చైర్మన్‌గా మద్దిపాడు మండలం బసవన్నపాలేనికి చెందిన టీడీపీ నేత మండవ జయంత్‌బాబును నియమించగా సోమవారం ఆయన ఆ బాధ్యతలు స్వీకరించారు. స్థానిక భాగ్యనగర్ రెండవ లైన్‌లో ఉన్న సమాఖ్య కార్యాలయంలో ఉదయం 11 గంటల సమయంలో నిడారంబరంగా కార్యక్రమం సాగగా సహకారశాఖ అధికారి సురేంద్ర ప్రమాణస్వీకారం చేయించారు. పొగాకు సమాఖ్య మాజీ చైర్మన్ రంగా కిసాన్ సంస్థ కార్యదర్శి చుంచు శేషయ్య తొలుత జయంత్‌బాబును అభినందించి రైతుల శ్రేయస్సు లక్ష్యంగా పనిచేయాని ఆకాంక్షించారు. జయంత్‌బాబుతో పాటు త్రిసభ్యకమిటీ సభ్యులుగా నియమితులైన త్రోవగుంటకు చెందిన టీడీపీ నాయకులు కోమటినేని వీరభద్రరావు, మాచావరపు జాన్ కూడా ప్రమాణస్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో మద్దిపాడు మండలానికి చెందిన వివిధ గ్రామాలతో పాటు సంతనూతలపాడు నియోజకవర్గానికి చెందిన పలువురు టీడీపీ నాయకులు పాల్గొని జయంత్‌బాబుకు శుభాకాంక్షలు తెలిపారు.


పూజలో పాల్గొన్న మంత్రి స్వామి దంపతులు

బాలాత్రిపురసుందరీదేవి పూజలో మంత్రి దంపతులు

త్రిపురాంతకం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): త్రిపురాంతకంలోని బాలా త్రిపురసుందరీదేవి అమ్మవారిని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి దంపతులు దర్శించుకున్నారు. కార్తీక మాసం మొదటి సోమవారం రోజు కుటుంబ సమేతంగా విచ్చేసిన మంత్రి స్వామికి ఈవో అనిల్‌కుమార్, చైర్మన్ సుబ్బారావు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు, నియోజకవర్గ నాయకులు మంత్రికి ఘనంగా స్వాగతం పలికారు. కుంకుమార్చన కార్యక్రమంలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు దామచర్ల పూర్ణచంద్రరావు, కొండెపి ఏఎంసీ మాజీ చైర్మన్ రామయ్య చౌదరి, కొండెపి మండల పార్టీ కన్వీనర్ వసంతరాయుడు, త్రిపురాంతకం, ఎర్రగొండపాలెం కన్వీనర్‌లు మేకల వలరాజుయాదవ్ పాల్గొన్నారు.

కరాటేలో విద్యార్థుల ప్రతిభ

పొదిలి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : మంగళగిరిలో జరిగిన కరాటే పోటీల్లో పాల్గొన్న పొదిలి, దర్శి విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఆదివారం మాస్టర్ ప్రభాకర్ ఆర్గనైజ్ చేసిన 16వ ఇంటర్నల్ జపాన్ శితోరయూ చాంపియన్స్-2025 పోటీల్లో పొదిలికి చెందిన కరాటే మాస్టర్ వేణు వద్ద శిక్షణ పొందుతున్న విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శించి పతకాలను సాధించారు. పతకాలు సాధించిన వారిలో ప్రథిక్ బ్లూబెల్ట్ అండర్-15 విభాగంలో వెండి పతకం, కుమితే విభాగంలో బ్రౌంజ్ పతకాలు సాధించాడు. ఎస్.కీర్తిక బ్లూబెల్ట్ అండర్-12 విభాగంలో వెండి, కుమితె విభాగంలో బ్రౌంజ్ పతకం, వంశీ అండర్-12 విభాగంలో బంగారు పతకం, ప్రజుల్ యెల్లో బెల్ట్ అండర్-12 విభాగంలో సిల్వర్ పతకం, అంచుల్ యెల్లో బెల్ట్ అండర్-14 కట విభాగంలో బ్రౌంజ్, కుమితే విభాగంలో సిల్వర్ పతకాలను సాధించారు. ఎస్‌కె.హరీజ్ అండర్-15 కేటగిరీలో కట, కుమితే విభాగాల్లో బంగారు పతకాలు, ఎస్కే. రఫిక్ యెల్లో బెల్ట్ అండర్-18 కేటగిరీలో కట విభాగంలో సిల్వర్, కుమితే విభాగంలో బ్రౌంజ్ పతకాలను సాధించారు. షేక్ సమీర్ ఓపెన్ కేటగిరీలో సిల్వర్ పతకం, కుమితే విభాగంలో బ్రౌంజ్ పతకాలు సాధించారు.


పతకాలతో విద్యార్థులు

170మంది ఎయిడెడ్ ఉపాధ్యాయులకు కౌన్సెలింగ్ నిర్వహించాలి

ఒంగోలు విద్య, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లాలో సర్ ప్లస్‌గా ఉన్న 170 మంది ఎయిడెడ్ ఉపాధ్యాయులకు కౌన్సెలింగ్ నిర్వహించాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ గిల్డ్ జిల్లా శాఖ అధ్యక్ష, కార్యదర్శులు కే వెంకట్రావు, సీహెచ్ ప్రభాకర్‌రెడ్డి ఒక సంయుక్త ప్రకటనలో కోరారు. సైపాలెం మండలంలో 8 మంది, మార్కాపురంలో 9, అర్థవీడు ఇద్దరు, కొమరోలు 12, రాచర్ల 7, గిద్దలూరు 16, కంభం 14, పుల్లలచెరువు ఇద్దరు, వెలిగండ్ల 4, హనుమంతునిపాడు 4, కనిగిరి 15, దర్శి రెండు, దొనకొండ 5, ఒంగోలు 15, కొత్తపట్నం మూడు, నాగులుప్పలపాడు 17, వేటపాలెం ఇద్దరు, చీరాల 14, పర్చూరు ఒకటి, ఇంకొల్లు ఆరు, యద్దనపూడి ముగ్గురు కోరిశపాడు మూడు, జే పంగులూరు మూడు, అద్దంకి మండలంలో ముగ్గురు ఎయిడెడ్ ఉపాధ్యాయులు సర్‌ప్లస్‌లో ఉన్నారన్నారు. వారందరికీ కౌన్సెలింగ్ నిర్వహించాలని వారు కోరారు.


లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జనార్దన్

సీఎంఆర్ఎఫ్‌తో ఆరోగ్య భరోసా

● ఎమ్మెల్యే దామచర్ల

ఒంగోలు కార్పొరేషన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆరోగ్య భరోసా లభిస్తుందని ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్దన్ తెలిపారు. సోమవారం ఒంగోలులోని పార్టీ కార్యాలయంలో 52 మంది లబ్ధిదారులకు రూ. 60. 99 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా దామచర్ల మాట్లాడుతూ నిరుపేదల ఆరోగ్యానికి ముఖ్యమంత్రి సహాయనిధి అండగా ఉంటుందన్నారు. పేద, మధ్య తరగతివారు ఆరోగ్య సమస్యలతో ఇబ్బందులు పడకుండా వారి వైద్య ఖర్చుల నిమిత్తం ప్రభుత్వం అందజేస్తున్న నగదు లబ్ధిదారులకు సహాయపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో నగర అధ్యక్షుడు బండారు మదన్, మహిళ అధ్యక్షురాలు పెట్టిశెట్టి వరలక్ష్మి, పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.


స్టూడెంట్ సింపోజియంలో మాట్లాడుతున్న సాత్విక్

క్విస్‌లో నైపుణ్యాభివృద్ధిపై వర్క్‌షాపు

ఒంగోలు విద్య, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : స్థానిక క్విస్ ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థుల నైపుణ్యాభివృద్ధి కోసం పలు కార్యక్రమాలను నిర్వహించారు. విద్యార్థుల్లో ఎంటర్‌ప్రెన్యూర్ షిప్‌పై ఆసక్తికలిగేలా, ఎంటర్ ప్రెన్యూర్‌లుగా ఎదిగేందుకు దోహదపడే విధంగా ఈ వర్క్‌షాపును నిర్వహించారు. ఐతిఐతి స్టూడెంట్ సెల్ ఆధ్వర్యంలో స్పార్క్-25 నేషనల్ లెవల్ స్టూడెంట్ సింపోజియం నిర్వహించారు. వివిధ అంశాల్లో రిసెర్చ్ చేసిన విద్యార్థులు పేపర్స్‌ను ప్రజంట్ చేశారు. ఐబీఎ బాంబేలోని ఈసెల్, క్విస్ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. యువ పారిశ్రామికవేత్త, ఫౌండర్ అండ్ సీఈవో ప్రగడ సాత్విక్ ముఖ్యఅతిథిగా పాల్గొని విద్యార్థులకు ఎంటర్ ప్రెన్యూర్ షిప్‌పై ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. క్విస్ కళాశాలలో ప్రత్యేకంగా శిక్షణ అందిస్తున్నామని, వ్యాపారులుగా ఎదగాలనే విద్యార్థులకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడుతాయని క్విస్ విద్యా సంస్థల అధినేత డాక్టర్ నిడమానూరి సూర్య కల్యాణ్ చక్రవర్తి, ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ డాక్టర్ నిడమానూరి శ్రీలాఖ్యత్రివేదీలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ వైవీ హనుమంతరావు, హెచ్‌ఓడీ డాక్టర్ లక్ష్మీవరప్రసాద్, డాక్టర్ ధరణి, ఎంటర్ ప్రెన్యూర్ షిప్ డెవలప్‌మెంట్ హెడ్ నరసింహారావు తదితరులు ఉన్నారు.


ఒడా చైర్మన్ రియాజ్‌ను సత్కరిస్తున్న సీవీఎన్ క్లబ్ ప్రతినిధులు

ఒడా చైర్మన్‌కు సత్కారం

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ఒడా) చైర్మన్ షేక్ రియాజ్‌ను సీవీఎన్ క్లబ్ ప్రతినిధులు సత్కరించారు. స్థానిక క్లబ్ కార్యాలయంలో సోమవారం క్లబ్ అధ్యక్షుడు ఈదుపల్లి గురునాథం ఆధ్వర్యంలో చైర్మన్‌ను కలిశారు. ఈ సందర్భంగా క్లబ్ అభివృద్ధిపై చర్చించారు. క్లబ్ అభివృద్ధికి తనవంతు సహకారాన్ని అందిస్తానని చైర్మన్ రియాజ్ హామీ ఇచ్చారు. అనంతరం చైర్మన్ రియాజ్‌ను సత్కరించారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యక్షుడు నిరంజన్‌రెడ్డి, కార్యదర్శి రాధా, బాలకృష్ణ తదితరులు ఉన్నారు.


విద్యార్థులతో మాట్లాడుతున్న ఏఎస్‌డబ్ల్యూ రజియాబేగం

ఎస్సీ వసతి గృహం తనిఖీ

సంతనూతలపాడు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): స్థానిక కర్నూలురోడ్డు పక్కన ఉన్న ఎస్సీ వసతి గృహాన్ని సోమవారం ఏఎస్‌డబ్ల్యూ రజియాబేగం, ఎంఈవో వెంకారెడ్డి తనిఖీచేశారు. వసతిగృహంలోని పలువురు విద్యార్థులు ఇళ్లకు వెళ్లడంతో వారి తల్లిదండ్రులతో వారు ఫోన్‌లో మాట్లాడి తిరిగి విద్యార్థులను వసతిగృహానికి పంపించాలన్నారు. తుఫాన్ ప్రభావం ఉన్నందున విద్యార్థుల విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని వార్డెన్ రమకుమార్‌కు తెలిపారు. వసతిగృహ ప్రాంగణం పరిశుభ్రంగా ఉంచుకోవాలని, బ్లీచింగ్, దోమల ప్రభావం లేకుండా ఫాగింగ్ చేయించుకోవాలని వార్డెన్‌కు సూచించారు. అనంతరం విద్యార్థులతో కొంతసేపు ఏఎస్‌డబ్ల్యూ రజియాబేగం మాట్లాడారు.

రాయితీలు విడుదల చేయాలి

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ,ఎస్టీ పారిశ్రామికవేత్తలకు సూరుకాయం రాయితీలను విడుదల చేయాలని ఏపీ ఎస్సీ,ఎస్టీ ఇన్నోవేషన్ జేఏసీ నాయకులు కోరారు. సోమవారం కలెక్టరేట్ ఏవో రవికుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఎస్సీ,ఎస్టీ పారిశ్రామికవేత్తలు రాయితీలు సకాలంలో రాకపోవడంతో అనేక ఇబ్బందులు పడాల్సి వస్తోందన్నారు. ఏవో ను కలిసిన వారిలో జేఏసీ ఆర్గనైజింగ్ కార్యదర్శి బత్తవత్తులం, రాజేష్, జాన్ వెస్లీ, ప్రశాంత్, సంపత్, క్రాంతికుమార్, అనిల్ తదితరులు ఉన్నారు

అమరవీరుల సంస్మరణ దినోత్సవం

మద్దిపాడు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి):మద్దిపాడు పోలీస్ స్టేషన్‌లో సోమవారం అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని ఎస్సై శైలజ ఆధ్వర్యంలో నిర్వహించారు. విద్యార్థులకు ఓపెన్ హౌస్ ప్రోగ్రాం నిర్వహించి డ్రోన్ కెమెరా లాంటి ఆయుధాల గురించి వివరించారు. ఈసందర్భంగా అమరవీరులకు శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో స్థానిక పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

తీరం అల్లకల్లోలం

ఎగసిపడుతున్న అలలు
తుఫాన్ నేపథ్యంలో
ముందస్తు ఏర్పాట్లు

కొత్తపట్నం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): జిల్లాలో సముద్ర తీరం అల్లకల్లోలంగా మారింది. మత్స్యకారులు సైతం భయపడే విధంగా సాగరుడు ఉగ్రరూపం దాల్చాడు. అలలు ఎగిసిపడుతూ తీరాన్ని తాకుతున్నాయి. సాధారణంగా మత్స్యకారులు వేట ముగిసిన తర్వాత పడవలను నిలుపుకునే ప్రాంతం వరకు అలల ఉధృతి కొనసాగుతోంది. జిల్లాలోని తీరం అంతా దాదాపు పోలీసులు, రెవెన్యూ, మెరైన్ పోలీసుల నిఘాలోనే ఉంది. తీరంలో కూడా పర్యాటకులు, స్థానికులు సముద్రంలోకి వెళ్లకుండా అధికారులు నిషేధం విధించారు. బారికేడ్లు, తాళ్లతో కట్టి తీరంలోకి రాకపోకలను అడ్డుకున్నారు. కన్నీతీరంలో మత్స్యకారులు దారులకు అడ్డంగా తమ పడవలను చేర్చి సురక్షితంగా ఉంచుకున్నారు. కొత్తపట్నం తీరంలో ఉన్న ఆర్‌అండ్‌బీరోడ్డు అంతా పడవలను నిలిపివేశారు. దీంతో తీరం వరకు రాకపోకలు నిలిచిపోయాయి. సోమవారం తుఫాన్ ప్రభావం జిల్లాలోని తీరం అంతటా చెదురుమదురు వానలే కురిశాయి. తీరంలో కెరటాలు ఎగిసి పడుతున్నాయి. గాలి ప్రభావం పెద్దగా లేకపోవటంతో మత్స్యకారులు అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. తీర ప్రాంత మండలాల్లోప్రత్యేక అధికారులు మకాం వేసి ఎప్పటికప్పుడు పరిస్థితిని అంచనా వేస్తూనే ఉన్నారు. తుఫాన్ తీరం దాటిన తర్వాత మంగళవారం నుంచి భారీ వర్షాలు పడే అవకాశం ఉండటంతో తీర ప్రాంత గ్రామాల్లో సర్వత్రా ఆందోళన వ్యక్తం అవుతోంది. ఇప్పటికే వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు తీర ప్రాంతంలోని పలు గ్రామాల్లోకి నీరు చేరి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కొత్తపట్నం పల్లిపాలెంలోని సునామీ కాలనీ మూడు రోజులుగా జల దిగ్బంధంలోనే ఉంది. కొత్తపట్నంలోని బీచ్ రోడ్డు అంతా నీటితో నిండిపోయి కుంగిపోయింది. ఇదే విధంగా జిల్లాలోని తీర ప్రాంత గ్రామాలకు వెళ్లేదారుల్లో , గ్రామాల్లో నీరు చేరి ఇబ్బందులు పడుతున్నారు. పరిస్థితి ఇప్పటికే ఈ విధంగా ఉంటే మంగళవారం కురిసే భారీ వర్షాలకు ఎలా ఉంటుందోననే ఆందోళన సర్వత్రా వ్యక్తం అవుతోంది. మొంథా తుఫాన్ కారణంగా వేట సాగే అ వకాశం లేకపోవటంతో ఆకలితో అవస్థలు పడాల్సి వస్తోందని ఆందోళనను మత్స్యకారులు వ్యక్తం చేస్తున్నారు. ఇదే విషయాన్ని సోమవారం కొత్తపట్నం తీరంలో పర్యటించిన ఒంగోలు శాసన సభ్యుడు దామచర్ల జనార్దనరావు ముందు మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేశారు. బియ్యం పంపిణీ చేయించి ఆదుకోవాలని ఆయన్ను మత్స్యకారులు కోరారు.


మేకలసోమయ్య పట్టపుపాలెం గ్రామస్తులకు కొవ్వొత్తులు అందజేస్తున్న ప్రత్యేకాధికారి జోసఫ్‌కుమార్


కొత్తపట్నం తీరంలో ఉధృతంగా ఎగసిపడుతున్న అలలు

అప్రమత్తమైన వైద్య ఆరోగ్య శాఖ..

వారం రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా పారిశుధ్యం పూర్తిగా పడకేసింది. ఎక్కడ చూసినా దుర్గంధం వెదజల్లుతోంది. తీర ప్రాంత గ్రామాల్లో అయితే రోజుల తరబడి నీరు నిలిచిపోయి వ్యర్థాలు కుళ్లిపోయి దుర్గంధం వెదజల్లుతోంది. దీంతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో వైద్యఆరోగ్యశాఖ ప్రభుత్వ ఏర్పాటు చేస్తున్న పునరావాస కేంద్రాలతో పాటు మత్స్యకార గ్రామాల్లో కూడా ప్రత్యేక వైద్యశిబిరాలు ఏర్పాటు చేస్తోంది. వైద్యులు,వైద్యసిబ్బంది 24 గంటలూ అందుబాటులో ఉండి సేవలు అందించేలా ఆదేశాలు జారీ చేశారు. మరో రెండు రోజుల పాటు భారీ వర్షాల నేపథ్యంలో పరిస్థితులు ఎలా ఉన్నా ఎదుర్కొనేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధమయ్యింది.

పోలీస్ యంత్రాంగం అప్రమత్తం

ఒంగోలు క్రైం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ముందస్తు చర్యలలో భాగంగా పోలీసు యంత్రాంగం అప్రమత్తం అయినట్లు ఎస్పీ వి.హర్షవర్ధనరాజు తెలిపారు. సోమవారం పోలీసు కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ కార్యాలయాన్ని సందర్శించి పోలీసు అధికారులకు పలు సూచనలు ఇచ్చారు. లోతట్టు ప్రాంతాలలో నివాసం ఉండే వారిని సురక్షితమైన ప్రాంతాలకు తరలించాలని కోరారు. ఆయన వెంట ఎస్పీ ఇన్‌స్పెక్టర్ రామచంద్ర, సీఐదుర్గాప్రసాద్, ఎస్సైలు పాల్గొన్నారు.

తీరప్రాంతంలో డ్రోన్‌లతో పోలీసుల పర్యవేక్షణ


కనపర్తిలో సిబ్బందికి సూచనలిస్తున్న సీఐ

● కొత్తకోట వాగుకు చేరిన వర్షపు నీరు

నాగులుప్పలపాడు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి):మొంథా తుఫాన్‌ను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు పోలీసు శాఖ సిద్ధంగా ఉందని తుఫాన్ ప్రత్యేకాధికారి డీఎస్పీ బిలక్ష్మీనారాయణ పేర్కొన్నారు. కనపర్తి తీర ప్రాంత గ్రామాలలో ఆయనతోపాటు సీఐ శ్రీకాంత్‌బాబు, ఎస్ఐ రజియాసుల్తానా సోమవారం పర్యటించారు. సముద్రతీరంలో పరిస్థితిని ఎప్పటికప్పుడు డ్రోన్‌తో పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. అలాగే తీరప్రాంత గ్రామాల్లో విధులు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బందికి పలు సూచనలు చేశారు. అలాగే నాగులుప్పలపాడు - తిమ్మసముద్రం గ్రామాల మధ్యనున్న కొత్తకోట వాగుకు వర్షపు నీరు చేరడంతో పోలీసులురెవెన్యూ సిబ్బందిని నియమించి ఇరువైపులా భారీ కేడ్లను ఏర్పాటు చేసి రాకపోకలను నిలిపివేశారు.

వాగులు, చెరువులను పరిశీలించిన అధికారులు

నాగులుప్పలపాడు,అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్‌ను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అధికారులు ముందస్తు చర్యల్లో భాగంగా ప్రజలను అప్రమత్తం చేశారు. మండల ప్రత్యేకాధికారి జె.జోసఫ్‌కుమార్ స్థానిక తహసీల్దార్ కె.ప్రవీణ్‌కుమార్, ఎంపీడీవో తేళ్ల రవికుమార్ ఇతర అధికారులతో కలిసి చదలవాడ రామన్న చెరువు కట్టను సోమవారం పరిశీలించారు. ఎప్పటికప్పుడు చెరువులోకి చేరిన వర్షపు నీటిని మోటార్ల ద్వారా బయటకు తరలించాలని నిరంతరం వర్షపాతం క్షణ చేయాలని, అక్కడ విధులు నిర్వహిస్తున్న ఎన్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బందికి సూచించారు. సచివాలయాల్లో సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉండేలా ప్రత్యేకాధికారి జోసఫ్‌కుమార్ విధులు కేటాయించారు. కొత్తకోట, హనుమాపురం,ఉప్పుగుండూరు వాగులను పరిశీలించారు. కనపర్తి తీర ప్రాంతంలో సముద్రాన్ని పరిశీలించారు. తీరప్రాంత గ్రామాల మత్స్యకారులతో సమావేశం నిర్వహించారు.సముద్రంలోకి చేపల వేటకు వెళ్లరాదని సూచించారు.తుఫాన్ తీవ్రతను వివరించి ప్రజలను అప్రమత్తం చేశారు. ఎస్సీ కాలనీలో పర్యటించి బాధితులను తరలించాలని సూచించారు. వీరపనేని శ్రీనివాసరావు పొలాల్లో ఎప్పటికప్పుడు వీఆర్వోలు జాగ్రత్తగా పర్యవేక్షించాలన్నారు. నాగులుప్పలపాడులోని జడ్పీ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన పునరావాసకేంద్రాలను పరిశీలించారు. అక్కడ సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఎస్పీ హర్షవర్ధనరాజు ఆదేశాల మేరకు తుఫాన్ పోలీసు ప్రత్యేకాధికారి దర్శి డీఎస్పీ బిలక్ష్మీనారాయణ స్థానిక ఎస్ఐ రజియాసుల్తానాతో కలిసి కొత్తకోట, హనుమాపురం వాగులు, చదలవాడ రామన్న చెరువును పరిశీలించారు. కనపర్తి తీరప్రాంత గ్రామాలలో పర్యటించి అక్కడి ప్రజలను అప్రమత్తం చేశారు. మొంథా తుఫాన్ దూసుకొస్తున్నందున ముందస్తు చర్యల్లో భాగంగా సముద్రస్నానాలు,చేపలవేట నిషేధించామని చెప్పారు. కనపర్తి పునరావాసకేంద్రంలో ఏర్పాటు చేసిన పోలీసు కంట్రోల్ రూంను డీఎస్పీ పరిశీలించారు.అత్యవసర పరిస్థితుల్లో పోలీసులను సంప్రదించాలని సూచించారు.

తీర గ్రామాల్లో సిబ్బంది అప్రమత్తం

ఒంగోలు(రూరల్): తుఫాన్ నేపథ్యంలో వివిధ శాఖల ఉద్యోగులు, విపత్తు నిర్వహణ సిబ్బంది అప్రమత్తమయ్యారు. సోమవారం రాత్రి ఆయా గ్రామాలలో బాధ్యతలు నిర్వహిస్తున్న పంచాయతీ కార్యదర్శులు, వీఆర్‌వోలు, పోలీసులు, సచివాలయ ఉద్యోగులు ప్రజలను అప్రమత్తం చేశారు. వర్షాల నేపథ్యంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు సూచించారు. ఆయా గ్రామాల్లో విధుల్లో ఉన్న ఉద్యోగులు మొబైల్ ఫోన్ ఆన్‌లో ఉంచుకోవాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఎప్పటికప్పుడు గ్రామాలలో సమాచారం తెలపాలన్నారు.


పునరావాస కేంద్రానికి ఎస్సీ కుటుంబాలను తరలించిన అనంతరం ఫోన్‌లో అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బీఎన్ శ్రీహరి

నీరు బయటకు పెట్టేందుకు రైతులు సహకరించాలి

ఒంగోలు(రూరల్),అక్టోబరు27(ఆంధ్రజ్యోతి): భారీవర్షాలకు నీరు బయటకు పోయేందుకు రైతులు సహకరించాలని , తుఫాన్‌కు ప్రాణ,ఆస్తి నష్టంలేకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఒంగోలు ఎంఎల్ఏ దామచర్ల జనార్దనరావు అన్నారు. కొప్పోలురోడ్డులోని ఎన్‌టీఆర్ కాలనీ వద్ద నాలుగు వరసల రోడ్డు కల్వర్టు ద్వారా భారీ వర్షాలకు నీరు బయటకు పోవటానికి సోమవారం ఎంఎల్ఏ దామచర్ల రైతులతో మాట్లాడారు. విపత్తుల సమయంలో వరద నీరు భారీగా చేరటంతో కొప్పోలు రోడ్డులో వది కాలనీలలో వర్షపు నీరు చేరటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, కల్వర్టు ద్వారా వర్షపు నీరు బయటకు పోవటానికి రైతులు పూర్తిగా సహకరించాలన్నారు. ఈ సందర్భంగా వర్షపు నీరు బయటకుపోయేందుకు రైతులు సహకరిస్తామన్నారు. అనంతరం రెండు ఎక్స్‌కవేటర్లతో కాలువ తవ్వకాలు చేశారు. ఈకార్యక్రమంలో ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత, నగర కమిషనర్ కోదూరి వెంకటేశ్వరరావు ,ఎంఆ ఏనయ్య అర్బన్ తహసీల్దార్ మధుసూదన రావు,సర్వేయర్ నాశం వెంకటేశ్వర్లు, టీడీపీనగర నాయకులు కటారి నాగేశ్వరరావు, బండారు మదన్, స్థానిక నాయకులు కట్టాగడ్డ రమణబాబు, నడిపినేని భాస్కర్, పాలూరి వెంకటేశ్వర్‌రెడ్డి, వల్లమల మునీంద్ర, ఈదర వంశీకృష్ణ పాల్గొన్నారు.


మెయిన్ డ్రెయిన్‌లలో పూడికతీత పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, మేయర్, కమిషనర్

పలు కాలనీల్లో ఎమ్మెల్యే దామచర్ల పర్యటన

● కార్పొరేషన్ ఆధ్వర్యంలో ముందస్తు చర్యలు

ఒంగోలు కార్పొరేషన్, : మొంథా తుఫాన్ ముప్పుపై అధికారులు అప్రమత్తం అయ్యారు. మూడు రోజులపాటు భారీ వర్షాలు కురవడంతో పాటు భారీగా ఈదురు గాలులు వీయనుండటంతో కార్పొరేషన్ అధికారులు అప్రమత్తమయ్యారు. ఈ మేరకు నగరంలోని మెయిన్ డ్రైన్‌లలో పూడిక తీత పనులు చేపట్టడంతోపాటు, నీరు పారుదల కోసం అవసరమైన చర్యలు తీసుకున్నామని కమిషనర్ కె. వెంకటేశ్వరరావు తెలిపారు. సోమవారం నగరంలో పలు కాలనీలలో పర్యటించిన ఆయన శానిటేషన్, ఇంజనీరింగ్, అధికారులను సిబ్బందిని అప్రమత్తం చేశారు. ప్రధానంగా కొప్పోలు రోడ్, గుర్రం జాషువా కాలనీ, అగ్రహారం వెళ్లే రైల్వే గేటు వద్ద కాలువ బ్లాక్ కావడంతో హుటాహుటిన పూడిక తీత పనులు చేపట్టారు.

అప్రమత్తంగా ఉండాలి

● కమిషనరు వెంకటేశ్వరరావు

మొంథా ముప్పు దృష్టిలో సచివాలయ సెక్రటరీలు అందరు అప్రమత్తంగా ఉండాలని కమిషనరు కె. వెంకటేశ్వరరావు, తహసీల్దారు మధు ఆదేశించారు. సోమవారం సాయంత్రం కార్పొరేషన్ కార్యాలయంలో సచివాలయ సెక్రటరీలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తుఫాన్ ముప్పు తీవ్రంగా ఉండే అవకాశం ఉందన్నారు. ప్రతి డివిజన్‌లోనూ సెక్రటరీలు అప్రమత్తంగా ఉండి, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలని ఆదేశించారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

ప్రత్యేకాధికారి లక్ష్మానాయక్


మండల అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ప్రత్యేకాధికారి లక్ష్మానాయక్

కొండపి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని మండల ప్రత్యేకాధికారి లక్ష్మానాయక్ సూచించారు. ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టం వాటిల్లకుండా సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. సోమవారం ఆయన స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. సమావేశంలో ఎంపీడీవో రామాంజనేయులు, తహసీల్దార్ శ్రీనివాసరావు, మండల స్థాయి ఆయాశాఖల అధికారులు పాల్గొన్నారు. జడ్పీ స్కూల్‌లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రానికి తరలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మెహరాజ్ బేగం, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

వర్షం ప్రారంభం

మొంథా తుఫాన్ ప్రభావంతో కొండపి ప్రాంతంలో సోమవారం మధ్యాహ్నం నుంచి ఓ మోస్తరు వర్షం కురుస్తోంది. ఉదయం నుంచి చలిగాలులు వీచాయి. కొండపిలో మెయిన్ లైన్ విద్యుత్ తీగ ఆదివారం రాత్రి తెగిపోవడంతో సరఫరాకు అంతరాయం ఏర్పడింది. విద్యుత్‌శాఖ సిబ్బంది మరమ్మతులు చేసి పునరుద్ధరించారు.

ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి

టంగుటూరు (కొండపి) : తుఫాన్‌ను సమర్థంగా ఎదుర్కొనేందుకు అవసరమైన ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని మండల ప్రత్యేకాధికారి, డీపీవో వెంకటేశ్వరరావు సూచించారు. మండల అధికారులతో ఆయన సోమవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ప్రజల రక్షణకు తీసుకుంటున్న చర్యలను పర్యవేక్షించారు. టంగుటూరు గ్రామ పంచాయతీలోని శివారు ప్రాంతాల్లో ఉన్న లోతట్టు నివాసితులతో ఆయన మాట్లాడారు. వర్షప్రభావానికి లోనయ్యే ఆలకూరపాడు గ్రామానికి చెందిన 9 ఎస్సీ కుటుంబాలను ఆలకూరపాడు

9 కుటుంబాలు సురక్షిత ప్రాంతాలకు తరలింపు

పొన్నలూరు : మొంథా తుఫాన్ నేపథ్యంలో మండలంలోని ఉప్పలదిన్నె గ్రామ పరిధి పాలేరు వాగు సమీపంలో ఉన్న ఎస్సీ కాలనీలో నివాసం ఉంటున్న తొమ్మిది కుటుంబాలను అధికారులు సురక్షిత ప్రాంతానికి తరలించారు. వారి కోసం స్థానిక పాఠశాలలో పునరావాస శిబిరం ఏర్పాటు చేశారు.

పులకొండలో పునరావాసకేంద్రం

చీమకుర్తి : మొంథా తుఫాన్ పట్ల అందరూ అప్రమత్తంగా వ్యవహరించాలని మండల ప్రత్యేక అధికారి,మైన్స్ డీడీ రాజశేఖర్ కోరారు.సోమవారం ఆయన మండలపరిధిలో పలుగ్రామాల్లో విస్తృతంగా పర్యటించారు. వాగులు, చెరువులు, ప్రమాదకర పరిస్థితులు ఉన్న ప్రదేశాలను పరిశీలించారు. పులికొండ గ్రామంలో ముంపు ప్రాంతంలో ఉన్న కుటుంబాలను ప్రభుత్వ పాఠశాలలో పునరావాస కేంద్రాన్ని ఏర్పాటుచేశారు. మండల పరిధిలో సోమవారం స్వల్ప వర్షపాతం నమోదయింది.

తుఫాన్ ముందస్తు ఏర్పాట్ల పరిశీలన

కొత్తపట్నం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): తుఫాన్ నేపథ్యంలో వైద్యశాఖ చేస్తున్న ఏర్పాట్లను జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారుల బృందం సోమవారం పరిశీలించారు. జిల్లా క్షయనివారణ అధికారి డాక్టర్ బాలాజీ, జిల్లా మలేరియా అధికారి మధుసూదనరావు, డాక్టర్ శ్రీ వాణి, ఎన్‌టీఆర్ వైద్యసేవ జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ హేమంత్, సాసా కో ఆర్డినేటర్ డాక్టర్ సునీల్ తదితరులు కొత్తపట్నం మండలంలో పర్యటించారు. కొత్తపట్నం, ఈతముక్కల పీహెచ్‌సీల పరిధిలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాల్లో వైద్యసేవలను వారు పరిశీలించారు. రెండు బెడ్లు, మందులు, వైద్య సిబ్బంది, సెలైన్లు సిద్ధం చేశారు.


త్రిపురాంతకస్వామి ఆలయంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు

కార్తీక సోమవారం పూజలు

సంతనూతలపాడు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): సంతనూతలపాడు త్రిపురాంతకస్వామి ఆలయంలో మొదటి కార్తీక సోమవారం పూజలు సోమవారం ఘనంగా జరిగాయి. తెల్లవారుజామునుండే మహిళలు భక్తిశ్రద్ధలతో ప్రమిదలతో దీపాలు వెలిగించి అభిషేకాలు, పూజలు చేశారు. పుణ్యస్నానాలు ఆచరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివనామస్మరణతో ఆలయప్రాంగణం మార్మోగింది.

శివాలయంలో పూజలు

మద్దిపాడు :కార్తీకమాసం తొలిసోమవారాన్ని పురస్కరించుకొని స్థానిక శివాలయంలో మహిళలు పూజలు నిర్వహించారు. ఉదయాన్నే ఉసిరి చెట్టుకింద దీపాలను వెలిగించారు. అయ్యప్ప శివస్వాములు స్వామివారిని దర్శించుకున్నారు.

అధికారులతో అత్యవసర సమావేశం

●30 మంది ఎస్సీ కుటుంబాలు పునరావాసకేంద్రానికి తరలింపు

సంతనూతలపాడు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావం తీవ్రత పెరుగుతుండటంతో మండలప్రత్యేక అధికారి మెప్మా పీడీ శ్రీహరి మండల స్థాయి అధికారులతో సోమవారం రాత్రి అత్యవసర సమావేశం నిర్వహించారు. వాగుల వద్దకు ప్రజలెవ్వరు వెళ్లకుండా చూడాలని, ప్రాణనష్టం జరగకుండా అప్రమత్తంగా ఉండాలని సంబంధిత అధికారులకు సూచించారు. అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉంటూ ఎప్పటికప్పుడు సమాచారం అందజేయాలన్నారు. మండలంలోని పేరిపరిపాడు పరిధిలోని గుడిసెల్లో నివాసముంటున్న 30 మంది ఎస్సీ కుటుంబాలను పునరావాసకేంద్రానికి తరలించారు.

అప్రమత్తంగా ఉండండి

మద్దిపాడు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి):మొంథా తుఫాన్ కారణంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మద్దిపాడు తహసీల్దార్ వేమూరి ఆదిలక్ష్మి అన్నారు. సోమవారం స్థానిక వీఆర్వోలతో సమావేశంలో ఆమె మాట్లాడుతూ వాగులు, వంకలు వద్ద ప్రజలను ఎవరిని ఆ ప్రాంతానికి రాకుండా చూడాలని, విద్యుత్ స్తంభాలకు ప్రజలు దూరంగా ఉండాలని, రైతులు తమ పశువులను జాగ్రత్తగా చూసుకోవాలని అన్నారు.

ముందస్తు చర్యలు తీసుకోవాలి

మొంథా తుఫాన్ నేపథ్యంలో ఎక్కడా ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా మండల స్థాయి సచివాలయ యూనిట్ సిబ్బంది పటిష్ఠ చర్యలు తీసుకోవాలని తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు ఉప్పుగుండూరి నాగేశ్వర రావు అన్నారు. సోమవారం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వాగులు వంకలు నీటి ప్రవాహం ఉన్న ప్రదేశాల వైపు ప్రజలు వెళ్లకుండా చూడాలని, పశువులను చెట్లకింద స్తంభాలకు కట్టకుండా చూడాలని అన్నారు. కార్యక్రమంలో గట్టినేని అయ్యప్ప, వడ్లమూడి శ్రీనివాసరావు, దుగ్గినేని నరసింహ రావు, మల్లవరం వెంకటేశ్వర స్వామి ట్రస్ట్ బోర్డు చైర్మన్ మర్రెడ్డి రామనారావు, నల్లూరి శ్రీనివాస రావు, నవులూరి శివకుమార్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.


స్వాధీనం చేసుకున్న గంజాయి ప్యాకెట్లను చూపుతున్న పోలీసులు

ఎర్నాకులం ఎక్స్‌ప్రెస్‌లో 14 కిలోల గంజాయి స్వాధీనం

● ఇరువురు నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు

ఒంగోలు క్రైం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): ఎర్నాకులం ఎక్స్‌ప్రెస్‌లో 14 కిలోల గంజాయి స్వాధీనం చేసుకొని ఇరువురు నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు ఈగల్ టీమ్ సీఐ సుధాకర్ తెలిపారు. సోమవారం ఈగల్ టీమ్ ఒంగోలు రైల్వే స్టేషన్‌నుంచి కావలి వరకు ఎర్నాకులం ఎక్స్‌ప్రెస్ రైలులో తనిఖీలు నిర్వహించారు. అక్రమంగా రవాణా చేస్తున్న గంజాయిని స్వాధీనం చేసుకొని ఒడిశాకు చెందిన ఆనంద్‌రాణా, మిలు మాతాలిలను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు తెలిపారు. గంజాయి, మాదకద్రవ్యాల సమాచారం ఉంటే టోల్‌ఫ్రీ నంబరు 1972, 112,పోలీసు వాట్సప్ నంబరు 9121102266 కు ఇవ్వాలని అన్నారు. ఈ తనిఖీలలో ఈగల్ టీమ్ ఎస్సై శివరామయ్య, చెంచయ్య, జీఆర్పీ ఎస్సై మధుసూదనరావు సిబ్బంది ఉన్నారు.

కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశం వాయిదా

ఒంగోలు కార్పొరేషన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 28వ తేదీ మధ్యాహ్నం 3గంటల వరకు జరగాల్సిన కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశం మొంథా తుఫాన్ కారణంగా వాయిదా వేశారు. సమావేశ తేదీని తిరిగి ఎప్పుడు నిర్వహించేది మరోసారి తెలియజేస్తామని, కౌన్సిల్ సభ్యులు గమనించాలని నగర మేయర్ గంగాడ సుజాత తెలిపారు.

వర్షం నీరు నిలిచిపోకుండా చర్యలు

సంతనూతలపాడు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): సంతనూతలపాడులోని తుమ్మగుంట ఎస్సీ కాలనీలో వర్షపునీరు కాలువల్లో ఆగిపోకుండా సోమవారం ఎంపీడీవో డి.సురేష్‌బాబు ఎక్స్‌కవేటర్‌తో వర్షపునీరు పారుదల అయ్యేలా పనులను నిర్వహించారు. సంతనూతలపాడులో మురుగుకాలువల్లో పారుదల ఆగకుండా అన్నిచోట్లా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ప్రజలు కూడా తుఫాన్ నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలన్నారు. కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా తొలి సోమవారం పూజలు

మార్కాపురం వన్‌టౌన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం సందర్భంగా తొలి సోమవారం పట్టణంలో వైభవంగా నిర్వహించారు. జగదాంబ సమేత మార్కండేశ్వరస్వామి, జగదాంబకు ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. శివాలయంలో నాగదేవతలు, నవగ్రహాలకు పూజలు చేశారు. పట్టణంలోని అయ్యప్ప స్వామి ఆలయం, చెన్నకేశవస్వామి ఆలయం, జవహర్ నగర్‌లోని లక్ష్మీనారాయణ స్వామి ఆలయం తదితర ఆలయాల్లో పూజలు నిర్వహించారు. మార్కండేశ్వర స్వామి ఆలయంలో ఈవో ఈదుల చెన్నకేశవ రెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు ఏర్పాట్లు చేశారు.

తర్లుపాడు : నీలకంఠేశ్వర స్వామి ఆలయంలో, సహస్ర లింగేశ్వర స్వామి, కేతగుడిపి కేధారనాథ్ తదితర ఆలయాల్లో కార్తీక తొలి సోమవారం పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

గిద్దలూరు : పట్టణంలోని శ్రీకుసుమ హరనాథ క్షేత్రంలో కార్తీక తొలి సోమవారం పూజలు వైభవంగా జరిగాయి. సామూహిక అభిషేకాలు నిర్వహించగా ఆర్యవైశ్య దంపతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. శ్రీకుసుమ హరనాథులకు ప్రత్యేక పూజలు అనంతరం గణపతిపూజ, పార్వతీ పరమేశ్వరులకు పంచామృతాభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమంలో కుసుమ హరనాథ భక్త సమా జం అధ్యక్షుడు నటుకుల శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి తుమ్మలపెంట శ్రీనివాసులు, కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

కంభం : కంభం, అర్ధవీడు మండలాలలో మొదటి సోమవారం సందర్భంగా శైవక్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. కంభం మండలంలోని చిన్న కంభం వీరభద్రస్వామి దేవాలయం, గుండికా నది ఒడ్డున వెలసిన కోటేశ్వర స్వామి దేవాలయం, రావిపాడు వీరభద్ర స్వామి దేవాలయం, తురిమెళ్లలోని కనక సురభేశ్వర స్వామి, శ్రీ కోట సత్యమాంబ, అర్ధవీడు మండలం మొహిద్దీన్ పురంలో కల్పనేశ్వర స్వామి, నాగులవరం కొండపై యాచవరం శివాలయాల్లో భక్తులు పూజలు చేశారు.


మార్కాపురంలో పూజలు చేస్తున్న భక్తులు


సిద్ధిభైరవేశ్వర ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

ఎర్రగొండపాలెం రూరల్ : కార్తీక తొలి సోమవారం సందర్భంగా శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారు జాము నుంచే ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. రామలింగేశ్వరస్వామి, శ్రీచక్రంలో ఉన్న సుబ్రహ్మన్య స్వామికి, కాశీవిశ్వేశ్వరస్వామిని దర్శించుకున్నారు.

కొమరోలు : కార్తీక తొలి సోమవారం కావడంతో శివాలయాల్లో భక్తులు పెద్ద ఎత్తున పూజలు చేశారు. గోపానిపల్లి త్రిపురాంతకేశ్వరాలయం, దామోర్ల చెరువు శ్రీ భైరవేశ్వరాలయం, పామూరుపల్లిలోని సాంబశివాలయం, మోట్టుపల్లిలోని స్పటిక లింగాలకు భక్తులు అభిషేకాలు చేశారు.

రాచర్ల : మండలంలోని రామాపురం గ్రామ సమీపంలోగల శ్రీ సిద్ధి భైరవేశ్వర ఆలయం సోమవారం భక్తులతో కిటకిటలాడింది. కార్తీక మాసం ప్రారంభం మొదటి సోమవారం కావడంతో భక్తులు ఆలయానికి చేరుకొని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. రామాపురం, సోమిదేవి గ్రామాల ప్రజలతోపాటు పరిసర గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయాలన్నీ శివ నామస్మరణలతో మార్మోగాయి. సత్యవోలు గ్రామంలోగల శ్రీ రామ లింగేశ్వర ఆలయం, అక్కపల్లి గ్రామ సమీపంలోగల శ్రీ కనక సురభేశ్వర ఎల్లమ్మ కోన, రాచర్ల గ్రామంలోని శ్రీ రామభీమ లింగేశ్వర ఆలయాల్లో వైభవంగా పూజలు చేశారు.


బాలచెన్నయ్యకు పార్టీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

వైసీపీని వీడి టీడీపీలో చేరిన బాలచెన్నయ్య

పార్టీ కండువా కప్పి ఆహ్వానించిన ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

గిద్దలూరు టౌన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): గిద్దలూరు పట్టణం 20వ వార్డు మాజీ కౌన్సిలర్ కుమారుడు పాలకవీటి బాలచెన్నయ్య వైసీపీని వీడి టీడీపీలో చేరారు. ఆయనతోపాటు అతని అనుచరులకు ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. సోమవారం టీడీపీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో 20వ వార్డు మాజీ కౌన్సిలర్ కుమారుడు బాలచెన్నయ్య, అనుచరులు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. తెలుగుదేశం పార్టీ అభివృద్ధి, సంక్షేమంతో రాష్ట్రం ముందుకు సాగుతుందని, అశోక్‌రెడ్డి చేస్తున్న కార్యక్రమాలకు ఆకర్షితులమై టీడీపీలో చేరినట్లు బాలచెన్నయ్య తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాలుగుళ్ల చిన్నశ్రీనివాసరెడ్డి, లొక్కు రమేష్, వెంకటయ్య, ఓబయ్య పాల్గొన్నారు.

మహిళకు ఎమ్మెల్యే సాయం

ప్రతినెలా సొంతంగా రూ.4వేల పింఛన్

గిద్దలూరు టౌన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): పక్షవాతంతో బాధపడుతున్న మహిళకు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి రూ.10వేల ఆర్థిక సాయాన్ని అందించారు. పాములపల్లె రోడ్డులో ఉంటున్న షేక్ బేగమున్నీసా పక్షవాతంతో బాధపడుతుండగా ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి తన కార్యాలయంలో సోమవారం సాయం అందించారు. నవంబరు 1 నుంచి రూ.4వేలు పింఛన్‌గా తన సొంత డబ్బులు ఇస్తానని ఆయన హామీ ఇచ్చారు. ప్రభుత్వ పింఛన్ మంజూరుకు కృషి చేస్తానని తెలిపారు.

రాయితీ విత్తనాలను వినియోగించుకోవాలి


కొమరోలులో శనగలను పంపిణీ చేస్తున్న సంజీవరెడ్డి

కొమరోలు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం రాయితీపై అందిస్తున్న విత్తనాలను రైతులు వినియోగించుకోవాలని సొసైటీ అధ్యక్షుడు ముత్తుముల సంజీవరెడ్డి అన్నారు. రైతు సేవా కేంద్రంలో సోమవారం రాయితీపై పప్పుశనగ విత్తనాలను రైతులకు పంపిణీ కార్యక్రమాన్ని సంజీవరెడ్డి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సేంద్రియ ఎరువుల వాడకంతోపాటు నూతన సాగు పద్ధతులను పాటిస్తే ఖర్చులు తగ్గుతాయని తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ మాజీ అధ్యక్షుడు పులకుర్తి వెంకటేశ్వర్లు,టీడీపీ నాయకులు వీరంరెడ్డి శంకర్‌రెడ్డి, సుబ్బరాయుడు, రమణ, రైతులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రచారం

గిద్దలూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆదిమూర్తి పల్లి గ్రామంలో ప్రధాని మోదీ 11 ఏళ్ల పాలనలో చేపట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి గురించి బీజేపీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఇల్లులేని వారికి పీఎం ఆవాస్‌యోజన పథకం ద్వారా పొందే అవకాశం ఉందని, ప్రస్తుతం దరఖాస్తు చేసుకునే వెసులుబాటు కూడా ఉందని నాయకులు ప్రజలకు వివరించారు. సూర్యఘర్ పథకాన్ని ప్రతి కుటుంబం వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ జె.వి.నారాయణ, నాయకులు బి.వి. రామాంజనేయులు, మునగనూరి రామకృష్ణ, కొప్పరపు నాగేశ్వరరావు, ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

మహిళా రిజర్వేషన్ చట్టాన్ని సవరించాలి

గిద్దలూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఓబీసీ మహిళలకు సబ్ కోటా ఇస్తూ చేసిన మహిళా రిజర్వేషన్ చట్టాన్ని సవరించాలని రాష్ట్ర బీసీ మహిళ ప్రధాన కార్యదర్శి జాడి శ్వేత డిమాండ్ చేశారు. ఈ డిమాండ్ సాధన కోసం ఈనెల 29న తిరుపతి ఆర్డీవో కార్యాలయం ఎదుట ఉదయం నుంచి సాయంత్రం వరకు నిరాహార దీక్ష చేయనున్నట్లు పేర్కొన్నారు. ఓబీసీ మహిళలు అన్ని రంగాలలో వెనుకబడి ఉన్నారని, దేశంలోని అన్ని వర్గాల మహిళలతో కలిపి 33శాతం రిజర్వేషన్ ఇవ్వడం వలన బలహీన వర్గాలకు చెందిన వారికి అన్యాయం జరుగుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. తిరుపతిలో జరిగే నిరసన కార్యక్రమానికి బీసీలు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు.


మంత్రి స్వామిని సన్మానిస్తున్న నాయకులు

మంత్రి స్వామిని కలిసిన నాయకులు

పెద్ద దోర్నాల, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీవీరాంజనేయ స్వామిని మండల నాయకులు సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. శ్రీశైలం వెళ్లి దైవదర్శనానంతరం తిరిగి ఒంగోలు వెళ్తుండగా దోర్నాలలో మండల టీడీపీ అధ్యక్షుడు షేక్ మాబు అధ్యక్షతన నియోజకవర్గం తెలుగు యువత అధ్యక్షుడు దొడ్డా శేషాద్రి, ఒంగోలు పార్లమెంట్ ఒంగోలు పార్లమెంట్ టీఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి ఈదర మల్లయ్య, డీలర్ల అసోషియేషన్ అధ్యక్షుడు దేసు నాగేంద్రబాబు, మైనార్టీ సెల్ ఉపాధ్యక్షులు షేక్ సమ్మద్‌బాషా తదితరులు మంత్రి స్వామికి శాలువా కప్పి పూలమాలలతో సత్కరించారు.

విద్యార్థుల ఇంటిబాట


హాస్టల్స్ నుంచి ఇళ్లకు వెళ్తున్న విద్యార్థినులు

ఎర్రగొండపాలెం రూరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాన్ నేపథ్యంలో పాఠశాలలకు సెలవులు ప్రకటించడంతో వసతిగృహాల్లో ఉన్న విద్యార్థినీవిద్యార్థులు సోమవారం ఇంటిబాట పట్టారు. తుఫాన్ కారణంగా జోరు వానలు కురిసే అవకాశమున్న క్రమంలో విద్యార్థులకు బయటకు వెళ్లకుండా ఇంటివద్ద సురక్షితంగా ఉండేలా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు కోరారు.

రైతులను ఆదుకోవాలి


ఏవో రవీంద్రారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘం నాయకులు

మార్కాపురం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : వర్షాల ప్రభావంతో పంటలను నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం నాయకులు డిమాండ్ కోరారు. ఈ మేరకు సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఏవో రవీంద్రారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ముఖ్యంగా పత్తి పూర్తిగా దెబ్బతిన్నదన్నారు. మిరప, మొక్కజొన్న, పొగాకు, కంది 60 శాతానికిపైగా దెబ్బతిన్నాయని తెలిపారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు గాలి వెంకటరామిరెడ్డి, ఏరువ పాపిరెడ్డి, పొట్లపాటి కాశయ్య, ఏనుగుల సురేష్ పాల్గొన్నారు.

మొంథాపై అప్రమత్తం


సగిలేరువాగును పరిశీలిస్తున్న జిల్లా సైనిక సంక్షేమ అధికారి అబ్దుల్‌రహీం, తహసీల్దార్ ఆంజనేయరెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న మార్కాపురం మున్సిపల్ కమిషనర్ నారాయణరావు

సగిలేరును పరిశీలించిన అధికారులు

గిద్దలూరు టౌన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ నేపథ్యంలో గిద్దలూరు ప్రాంతం మీదుగా వెళ్లే సగిలేరువాగు పరిస్థితిని అధికారులు సోమవారం పరిశీలించారు. మొంథా తుఫాన్ ప్రత్యేక అధికారి అబ్దుల్ రహీం, తహసీల్దార్ ఆంజనేయరెడ్డి, ఎంపీడీవో సీతారామయ్య, పంచాయతీరాజ్ ఏఈ సూరె సుబ్బారావు, వీఆర్‌వో వై.పి.రంగయ్య, పంచాయతీ కార్యదర్శి భాస్కర్, వీఆర్ఏలు, పోలీసులు దిగువమెట్ట తాండా వద్ద గల సగిలేరువాగును పరిశీలించారు. అలాగే కొండపేట వద్ద గల కతువ, భీమలింగేశ్వరస్వామి దేవాలయం వద్ద సగిలేరువాగును వారు పరిశీలించారు. వాగులోకి ఎవరూ వెళ్లకుండా జాగ్రత్తగా ఉండాలని, అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

పెద్ద దోర్నాల : మొంథా తుఫాన్ పట్ల అధికారులు అప్రమత్తంగా ఉండాలని మండల ప్రత్యేక అధికార శ్రీనివాస ప్రసాద్ అన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం మండల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస ప్రసాద్ మాట్లాడుతూ ఆయా శాఖల అధికారులు రానున్న విపత్ నుంచి ఎలాంటి నష్టం వాటిల్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రజలతో మమేకమై వారికి తగిన సూచనలు, సలహాలు ఇవ్వాలని అన్నారు. ప్రధానంగా చెరువులు, కాలువలు ఉధృతంగా ప్రవహించి రాకపోకలకు అంతరాయం ఏర్పడకుండా తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ అశోక్‌కుమార్‌రెడ్డి, ఎంపీడీవో నాసర్‌రెడ్డి, ఎస్సై మహేశ్, విద్యుత్ శాఖ ఏఈ భీమానాయక్, ఏవో జవహర్ లాల్ నాయక్, ఎంఈవో మస్తాన్ నాయక్, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

రాచర్ల : అధికారులందరం అప్రమత్తంగా ఉండి మొంథా తుఫాన్ ముప్పును ఎదుర్కొందామని ప్రత్యేకాధికారి (డీటీడబ్ల్యూవో) వరలక్ష్మి అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం ఆమె అన్ని శాఖల అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. తుఫాన్‌పై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎవరికీ ఎలాంటి నష్టం జరుగకుండా జాగ్రత్త వహించాలన్నారు. అధికారులు గ్రామాల్లో అందుబాటులో ఉండాలన్నారు. సమావేశంలో తహసీల్దార్ ఎల్.వెంకటేశ్వర్లు, ఎంపీడీవో వెంకట రామిరెడ్డి, డిప్యూటీ ఎంపీడీవో వెంకటేష్, ఎంఈవోలు షేక్ మొయినుద్దీన్, గిరిధర్‌శర్మ, ఏవో షేక్ మహబూబ్ బాషా, అధికారులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

ముందస్తు చర్యలు తీసుకోవాలి

మార్కాపురం : మొంథా తుఫాన్‌ను సమర్థంగా ఎదుర్కొనేందుకు అవసరమైన అన్ని రకాల ముందస్తు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ బీవీఎస్ నారాయణరావు సూచించారు. మున్సిపాలిటీ కమిషనర్ చాంబర్‌లో సోమవారం పలు విభాగాలకు చెందిన అధికారులు, సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ నారాయణరావు మాట్లాడుతూ శిథిలావస్థలో ఉన్న భవనాలను గుర్తించాలన్నారు. ఆయా గృహాలకు ఎలాంటి ప్రమాదం జరిగినా అక్కడి ప్రజలకు పునరావాసం కల్పించేందుకు సమీపాల్లోని పాఠశాలలకు చెందిన తరగతి గదులు గుర్తించాలన్నారు. మంచి నీటి సరఫరాపై ఇంజనీరింగ్ విభాగం ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. మంచినీటి ట్యాంకులను క్లోరినేషన్ చేయాలన్నారు. వర్షాల అనంతరం పలు రకాల వ్యాధులు ప్రబ లే ప్రమాదం ఉన్నందున వాటిపై జాగ్రత్తవహించాలన్నారు. మురుగు నీరు ఎక్కడ నిల్వ ఉండకుండా శానిటరీ విభాగం పనిచేయాలన్నారు. మున్సిపాలిటీలో ఏర్పాటు చేసిన కాల్ సెంటర్‌కు వచ్చే సమాచారాన్నిబట్టి సిబ్బంది వెంటనే స్పందించాలన్నారు. ఎలాంటి చిన్నపాటి సమస్యవున్నా ఉదయం 6.00 గంటల నుంచి మధ్యాహ్నం 2.00 గంటల వరకు 9966339599, మధ్యాహ్నం 2.00 గంటల నుంచి రాత్రి 10.00 వరకు 8474009441, రాత్రి 10 నుంచి ఉదయం 6.00 గంటల వరకు 9966622515 నెంబర్లకు ఫోన్ చేసి తెలియజేయాలన్నారు. సమావేశంలో ఇంజనీరింగ్, రెవిన్యూ, శానిటరీ, పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కొమరోలు : ప్రమాదకరంగా ఉన్న మిద్దెలు, గుడిసెల్లో ఉన్న ప్రజలను తక్షణమే ఖాళీ చేయించి సురక్షిత ప్రదేశాలకు తరలించాలని తహసీల్దార్ దేవరశెట్టి భాగ్యలక్ష్మి సిబ్బందికి ఆదేశించారు. మండలంలోని బాదినేనిపల్లి, సూరవారిపల్లి, ద్వారకచర్ల గ్రామాలను తహసీల్దార్ సోమవారం పరిశీలించారు. వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు.

కమాండ్ కంట్రోల్ ఏర్పాటు

గిద్దలూరు టౌన్ : మొంథా తుఫాన్ విపత్కర పరిస్థితులను ఎదుర్కోవడా నికి పురపాలక సంఘం కార్యాలయంలో కమాండ్ కంట్రోల్ రూంను ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ ఈవీ రమణబాబు అన్నారు. తుఫా న్ పరిస్థితులను ఎదుర్కోవడాకిఇ సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. కార్యాలయంలో 9154387208 నెంబర్‌ను ఏర్పా టు చేశామని, 24 గంటలు సిబ్బంది అందుబాటులో ఉంటారని అన్నారు.

వర్గీకరణ వెనక్కి తీసుకోవాలి

సంఘ రాష్ట్ర అధ్యక్షుడు అశోక్‌బాబు

మార్కాపురం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణను వెనక్కి తీసుకునే వరకు మాలల పోరాటం ఆగదని మాల ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తుల్లిబిల్లి అశోక్‌బాబు అన్నారు. ప్రెస్‌క్లబ్‌లో సోమవారం మాల సంఘాలు, ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అశోక్‌బాబు మాట్లాడుతూ దళితులపై దాడి జరిగితే ఏ ఒక్కరూ వచ్చి పరామర్శించన దాఖలాలు లేవన్నారు. ఎస్సీ జనాభాకు అనుగుణంగా రిజర్వేషన్ శాతం కూడా పెంచాలన్నారు. ప్రైవేటు రంగాల్లో కూడా రిజర్వేషన్ అమలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. నవంబర్ 8వ తేదీన అన్ని జిల్లాల మాల సంఘాల నాయకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి కార్యాచరణ రూపొందిస్తామన్నారు. సమావేశంలో బహుజన సైన్యం వ్యవస్థాపక అధ్యక్షులు జనుమాల నాగయ్య, మాల మహానాడు జిల్లా ప్రధాన కార్యదర్శి కలవకూరి అబ్రహం, మంచా సాయి, గొట్టిముక్కల యోహాను, మాలపోలు శాంతకుమార్, దాసరి సునీల్, దార్ల సురేష్, జనుమాల సురేష్, దమ్ము బాబీ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న అశోక్‌బాబు

పొంచి ఉన్న ప్రమాదం


విరిగిపోయిన విద్యుత్‌స్తంభం

పీసీపల్లి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దన్నపల్లి గ్రామంలో విద్యుత్ స్తంభం విరిగి ప్రమాదకరంగా ఉంది. గ్రామంలో ఆర్డీఎస్ఎస్ పనుల్లో భాగంగా నూతన విద్యుత్‌లైన్ ఏర్పాటుచేశారు. రామాలయం దగ్గర నుంచి ప్రధాన మార్గంలో ఏర్పాటుచేసిన విద్యుత్‌లైన్‌కు అధికారులు కనెక్షన్ ఇచ్చారు.

అయితే, రెండు నెలల క్రితం ట్రాక్టర్ అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని బలంగా ఢీకొట్టింది.ఈ ఘ టనలో స్తంభం విరిగిపోయింది. ప్రస్తుతం సపోర్ట్ పోల్స్‌తో నిలబడి ఉంది. మొంథా తుఫాన్ నేపథ్యంలో గాలులతో కూడిన భారీ వర్షం ప డుతుందని వాతావరణ శాఖ ప్రకటిం చింది. దీంతో స్తంభం కూలిపోతుందేనని స్థానికు లు భయాందోళనకు గురవుతున్నారు. విద్యు త్ స్తంభాన్ని తొలగించి కొత్తది వేయాలని పలుమార్లు సంబంధిత శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి కొత్తది ఏర్పాటుచేయాలని కోరుతున్నారు.

కురిచేడులో వర్షం

కురిచేడు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాను ప్రభావంతో మండలంలో వర్షాలు కురుస్తున్నాయి. సోమవారం మధ్యాహ్నం నుంచి వర్షం పడుతుంది. సాయంత్రం సమయంలో పెద్ద వర్షమే కురిసింది. మెట్ట పంటలు దెబ్బతింటాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.

టీడీపీ పటిష్టతకు కృషిచేయాలి

దొనకొండ, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): టీడీపీ పటిష్టతకు కృషిచేయాలని ఆపార్టీ మండల నాయకుడు వీరపనేని వెంకన్నచౌదరి అన్నారు. ఐటీడీపీ మండల అధ్యక్షుడిగా రెండోసారి ఎంపికైన వైకే చౌదరి, మండల టీడీపీ ప్రధాన కార్యదర్శిగా ఎంపికైన పురుషోత్తం సత్యానందం, మండల తెలుగు యువత అధ్యక్షుడిగా ఎంపికైన విప్పర్ల శేషు, మండల రైతు సంఘం అధ్యక్షుడిగా ఎంపికైన యాగంటి చిన్నపోలయ్యలను స్థానిక పార్టీ కార్యాలయంలో సోమవారం ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా వెంకన్న చౌదరి మాట్లాడుతూ పదవులు పొందిన వారు బాధ్యతగా పనిచేసి అటు పార్టీకి, ఇటు ప్రభుత్వానికి మంచిపేరు తేవాలన్నారు. అనంతరం టీడీపీ నాయకుడు సింగమనేని హనుమంతు జన్మదిన వేడుకల సందర్భంగా కేకు కట్ చేశారు. కార్యక్రమంలో నాయకులు కామేపల్లి చెంచయ్య, వల్లపునే ని వెంకటస్వామి, మోడి వెంకటేశ్వర్లు, తాంద్ర వెంకటేశ్వర్లు, తోటా కోటేశ్వర రావు, దుగ్గెంపూడి కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

» మండల ప్రత్యేకాధికారి భాస్కర్‌బాబు ఆదేశం


పీసీపల్లి: వెలుతుర్లవారిపల్లిలో ప్రజలకు సూచనలుచేస్తున్న అధికారుల బృందం

పీసీపల్లి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో వచ్చే రెండు మూడు రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని మండల ప్రత్యేక అధికారి పి.భాస్కర్‌బాబు అన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. లోతట్టు ప్రాంతాల్లో నీరు చేరే అవకాశం ఉన్నందున ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామ సచివాలయాల్లో జనరేటర్‌ను ఏర్పాటుచేసుకోవాలని సూచించారు. ఎటువంటి సంఘటన జరిగినా వెంటనే మండలకేంద్రంలో ఏర్పాటుచేసిన కంట్రోల్ రూంకు సమాచారం ఇవ్వాలన్నారు. సమావేశంలో ఎంపీడీవో జీవీ కృష్ణారావు, తహసీల్దార్ ఉష, ఏవో ఎన్.రంగాకృష్ణ, తదితరులు పాల్గొన్నారు. అనంతరం పెదయిర్లపాడు, లక్ష్మక్కపల్లి, వెలుతుర్లవారిపల్లి గ్రామాలను సందర్శించిన అధికారుల బృందం తుఫాన్ నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

లోతట్టు ప్రాంతాల పరిశీలన

పామూరు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ తుఫాన్ ప్రభా వంతో మండలంలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో ఎటు వంటి విపత్కర పరిస్థితులైనా ఎదుర్కొనేందుకు అధికార యంత్రాంగం సిద్ధంగా ఉందని మండల ప్రత్యేకాధికారి రవితేజ తెలిపారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం పట్టణంలోని లోతట్టు ప్రాంతాలైన అంకామ్మవీధి, విరాట్‌నగర్, గోపాలపురం తదితర ప్రాంతాలను పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఆర్.వాసుదేవరావు, ఎంపీడీవో ఎల్.బ్రహ్మయ్య, సీఐ ఎం.భీమానాయక్, ఎస్ఐ టి.కిశోర్‌బాబు, పంచాయతీ కార్యదర్శి జీవీ అరవిందారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అలాగే, సీఎస్‌పురం మండలంలో తుఫాన్ సహాయక చర్యలు చేపట్టేందుకు 108 స్కూల్ బస్సులు, ఎక్స్‌కవేటర్లు సిద్ధంగా ఉంచినట్లు మండల ప్రత్యేక అధికారి టి.శ్రీనివాసరెడ్డి, తహసీల్దార్ షేక్ హుసేన్, ఎంపీడీవో ప్రతాప్‌రెడ్డి తెలిపారు.

తుఫాన్ ఎదుర్కొనేందుకు అన్నిచర్యలు

దర్శి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు అన్నిచర్యలను ప్రభుత్వం తీసుకున్నట్లు మండల ప్రత్యేకాధికారి గాయత్రీదేవి తెలిపారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ఎప్పటికప్పుడు సమాచారం సేకరించి ఉన్నతాధికారులకు అందించాలన్నారు. ఎక్కడైనా ప్రజలకు ఇబ్బంది కల్గే పరిస్థితి నెలకొంటే తక్షణ చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ముందస్తుగా వాగులు, చెరువుల వద్ద భద్రతను ఏర్పాటుచేసినట్టు చెప్పారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు ముంపునకు గురయ్యే పరిస్థితి ఎదురైతే పునరావాస కేంద్రాలను సిద్ధం చేసినట్టు చెప్పారు. ప్రత్యేక కంట్రోల్ రూమ్ అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎం.శ్రావణ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ వై.మహేశ్వరరావు, ఎంపీడీవో పి.కల్పన, డిప్యూటీ ఎంపీడీవో ఆవుల సుధాకర్, వివిధశాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


దర్శిలో మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి గాయత్రీదేవి

కురిచేడు: మొంథా తుఫాన్ ప్రభావంతో మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ రజనీకుమారి సూచించారు. సోమవారం మధ్యాహ్నం కురిచేడులో ర్యాలీ నిర్వహించి ప్రజలను అప్రమత్తం చేశారు. ప్రధాన కూడలిలో మానవహారం ఏర్పాటు చేసి ప్రజలకు సూచనలు చేశారు. భారీ వర్షాలు కురుస్తాయనే వాతావరణ శాఖ సూచనలతో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

ముండ్లమూరు: ముంథా తుఫాన్ నేపథ్యంలో ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టాలు సంభవించకుండా ప్రజలను అప్రమత్తం చేయాల్సిన బాధ్యత మండలస్థాయి అధికారులపై ఉందని మండల ప్రత్యేకాధికారి సీహెచ్ శ్రీనివాసులు అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సోమవారం రాత్రి నుంచి తుఫాన్ ప్రభావం అధికంగా ఉండే అవకాశాలు ఉన్నట్లు వాతావరణ శాఖ అధికారులు ప్రకటించటంతో ఆయా గ్రామాలకు కేటాయించిన అధికారులు అక్కడే ఉండాలన్నారు.

ప్రధానంగా మండలంలో చిలకలేరు, ఈదర వాగు, వేముల వాగులతో పాటు చెరువుల వద్ద అప్రమత్తంగా ఉండాలన్నారు. సమావేశంలో ఎంపీడీవో ఎం.శ్రీదేవి, తహసీల్దార్ ఎల్.లక్ష్మీనారాయణ, విద్యుత్ ఏఈ అంకబాబు, తదితరులు పాల్గొన్నారు.

తాళ్లూరు: మొంథా తుఫాన్‌పై జిల్లా కలెక్టర్ రాజాబాబు ఆదేశాలతో అన్నీశాఖల అధికారులు అప్రమత్తమయ్యారు. మండల ప్రత్యేకాధికారి కుమార్, తహసీల్దార్ రమణారావు, ఎంపీడీవో అజిత, ఎస్ఐ మల్లికార్జునరావు, మండల విద్యాధికారి జి.సుబ్బయ్య, తదితరులు తాళ్లూరులో ర్యాలీ నిర్వహించారు. అనంతరం వెల్లంపల్లి సెంటర్లో మానవహారం ఏర్పాటుచేసి ప్రజలకు పలు సూచనలు చేశారు. దోర్నపువాగు ప్రవాహం అధికంగా ఉండే తాళ్లూరు- విఠలాపురం మధ్య బ్రిడ్జిని అధికారులు పరిశీలించారు.

రైతుబజార్ పునర్నిర్మాణానికి శ్రీకారం

» గత వైసీపీ పాలనలో మధ్యలోనే నిలిచిపోయిన పనులు

» ప్రజాప్రభుత్వంలో కదలిక


గత వైసీపీ పాలకుల అసమర్థతతో మధ్యలో నిలిచిపోయిన రైతుబజార్

దర్శి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): దర్శి పట్టణంలో అర్ధంతరంగా నిలిచిపోయిన రైతుబజార్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో రూ.80 లక్షల వ్యయంతో చేపట్టిన రైతుబజార్‌ను గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రారంభించారు. కొంత నిర్మాణం జరిగిన తర్వాత సంబంధిత అధికారులు బిల్లు పంపించారు. ఆ బిల్లు మంజూరు కాకపోవటంతో సంబంధిత కాంట్రాక్టర్ పనులను మధ్యలో నిలిపివేశాడు. 2019లో ఎన్నికలు రావటంతో అప్పటినుంచి పనులు నిలిచిపోయాయి.

టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి చొరవ తీసుకొని సీఎం చంద్రబాబు, సంబంధిత శాఖల మంత్రులతో పలుసార్లు రైతుబజార్ పునర్నిర్మాణానికి అనుమతలు ఇవ్వాలని కోరారు. ఎట్టకేలకు మార్కెటింగ్ శాఖ నుంచి గ్రీన్‌సిగ్నల్ లభించటంతో రైతుబజార్ పునర్నిర్మాణ పనులు ప్రారంభించారు. దర్శి-కురిచేడు రోడ్డులో ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం ప్రక్కన ఖాళీ స్థలంలో నిర్మిస్తున్న రైతుబజార్‌లో 40 షాపులు ఏర్పాటుచేస్తున్నారు. కూరగాయలు, పండ్లతోటలు, పూలు తదితర పంటలు పండించే రైతులు ఇక్కడకు తెచ్చుకొని విక్రయించుకోవచ్చు.

ఈ పంటలను పండించే రైతులు ఎలాంటి అద్దె చెల్లించకుండానే వ్యాపారాలు చేసుకునే వెసులుబాటు కల్పించారు. రైతుబజార్ పునర్నిర్మాణానికి శ్రీకారం చుట్టడంతో దర్శి ప్రాంత రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


పునుగోడు రిజర్వాయర్‌ను పరిశీలిస్తున్న అధికారులు

'మొంథా'తో నష్టం కల్గకుండా చూడాలి

కనిగిరి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్‌తో ఎలాంటి నష్టం వాటిల్లకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని మండల ప్రత్యేకాధికారి శ్రీనివాసరావు అన్నారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలోని చిన్నపాటి జలాశయాలు, వాగులు, అలుగులు ప్రవహించే ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కనిగిరి మండలంలోని పునుగోడు, గొల్లపల్లి రిజర్వాయర్‌ల పరిస్థితిని బేరీజు వేసుకుని ప్రస్తుత నీటి మట్టం, తుఫాన్ ప్రభావంతో పెరిగే నీటి మట్టంపై ప్రత్యేకంగా దృష్టి సారించాలన్నారు. సమావేశంలో తహసీల్దార్ జయలక్ష్మి, ఎంపీపీ ప్రకాశం, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. అనంతరం ప్రత్యేకాధికారి శ్రీనివాసరావు నేతృత్వంలో మండలంలోని పునుగోడు, గొల్లపల్లి రిజర్వాయర్‌లను అధికారులు పరిశీలించారు. సమీప లోతట్టు ప్రాంతాలను పరిశీలించారు.

ప్రభుత్వ ఆదేశాలతో ముందస్తు చర్యలు

కనిగిరి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆదేశాలతో ముందస్తు చర్యలకు ఉపక్రమించినట్లు మున్సిపల్ కమిషనర్ కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలో పారిశుధ్య చర్యలు చేపట్టారు. కాల్వల వెంట ఉన్న నివాసాల యజమానులకు పలు సూచనలు చేశారు. తుఫాన్ ప్రభావంతో ఎలాంటి ఇబ్బందులు ఎదురైన ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన కంట్రోల్‌రూంకు సమాచారం అందించాలన్నారు. పట్టణంలోని ప్రభుత్వ బాలికల హైస్కూల్‌ను సందర్శించి తుఫాన్ నేపథ్యంలో ముందస్తుగా చేపడుతున్న చర్యలపై హెచ్‌ఎం కలవ విజయలక్ష్మితో చర్చించారు. ఒకవేళ తుఫాను ఉధృతి పెరిగి ప్రజలకు ఇబ్బందులు ఏర్పడితే పాఠశాలలో తగిన సౌకర్యాలపై దృష్టి సారించాలని సూచించారు.

నిజాలు నిగ్గుతేల్చాలి

కనిగిరి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): తమ భూమికి సంబంధించిన రికార్డులను పరిశీలించి నిజాలు తేల్చాలని చల్లగిరగల గ్రామానికి చెందిన గుడే సునీత, పచ్చవ వెంకటేశ్వర్లు బృందం సోమవారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. అబద్ధపు ప్రచారాలు చేస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్న మక్కెన సుజాతపై చర్యలు తీసుకోవాలని కోరారు. తమకు చెందిన భూమిని మక్కెన పెద్దన్న భార్య సుజాత, అంకయ్య అనే వ్యక్తులు కలసి అక్రమంగా నకిలీ పాస్ పుస్తకాలు పుట్టించారని ఆరోపించారు. వాటిని పరిశీలించి వాస్తవాలు తేల్చాలని కోరారు. వాస్తవాలు తేలితే తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. మక్కెన సుజాత అనే మహిళ కూడా తమకు చెందిన భూమిని తప్పుడు మార్గంలో వెబ్‌ల్యాండ్‌లో చేర్చారని ఫిర్యాదు చేసింది. వీటిపై తహశీల్దారను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా భూ రికార్డులు పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

శివాలయంలో మున్సిపల్ చైర్మన్ ప్రత్యేక పూజలు

కనిగిరి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): కనిగిరి కొండపై ఉన్న విజయమార్తేండేశ్వర స్వామికి మున్సిపల్ చైర్మన్ గఫార్ ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కోరిన కోర్కెలు తీర్చే స్వామి విజయమార్తేండేశ్వరస్వామి అని అన్నారు. ఆయన వెంట ఆలయ కమిటీ నాయకులు వాగిచర్ల వెంకటేశ్వర్లు, రామనబోయిన శ్రీను, తులసి తదితరులు పాల్గొన్నారు.

ఎంఈవో వైఖరి తగదు!

దొనకొండ, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): ఎంఈవో-1 సాంబశివరావు ఉపాధ్యాయుల పట్ల నిరంకుశంగా వ్యవహరిస్తున్నారని యూటీఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఓవీ వీరారెడ్డి ఆరోపించారు. సోమవారం స్థానిక సంఘ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయుల రిలీవింగ్ విషయంలో డీఈవో ఆదేశాల మేరకు కాకుండా ఇష్టమెచ్చినట్లుగా వ్యవహరిస్తున్నారని అన్నారు. సమావేశంలో ఆసంఘం మం డల అధ్యక్షుడు బి.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. ఈవిషయమై ఎంఈవో-1 సాంబశివరావును వివరణ కోరగా ఉన్నతాధికారులు నిర్దేశించిన నిబంధనల మేరకు తాను బాధ్యతగా విధులు నిర్వర్తిస్తున్నానని చెప్పారు. మండలంలో కొందరు యూటీఎఫ్ ప్రతినిధులు చెప్పిన పనులు చేయలేదనే కారణంగా ఇటువంటి ఆరోపణలు చేస్తున్నారని అన్నారు.

తుఫాన్ నేపథ్యంలో మూడు రైళ్లు రద్దు

దొనకొండ, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ కారణంగా గుంటూరు -గుంతకల్లు ప్రధాన రైలు మార్గంలో ఈనెల 28, 29 తేదీల్లో మూడు రెళ్ల రాకపోకలు నిలిపివేసినట్లు రైల్వే అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం దొనకొండ మీదుగా ప్రయాణించే 18463 నెంబరు గల భువనేశ్వర్ నుంచి బెంగుళూరు వెళ్లే ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌ను రద్దు చేసినట్టు తెలిపారు. 29న దొనకొండ మీదుగా ప్రయాణించే 67238 నెంబరు గల రేపల్లె-మార్కాపురం, 67239 నెంబరు గల మార్కాపురం-రేపల్లె డెమో పాసింజర్ రైళ్ల తాత్కాలికంగా రద్దు చేసినట్లు రైల్వే అధికారులు వెల్లడించారు.

భక్తిశ్రద్ధలతో కార్తీక సోమవారం పూజలు

కిటకిటలాడిన శివాలయాలు


దర్శి: అన్నపూర్ణ సమేతా కాశీవిశ్వేరస్వామి ఆలయం వద్ద బారులుతీరిన భక్తులు


ముండ్లమూరు శివాలయంలో పూజలు చేస్తున్న భక్తులు

దర్శి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): కార్తీక సోమవారం పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈసందర్భంగా శివాలయాలు కిటకిటలాడాయి. తెల్లవారు జామున ఐదు గంటల నుంచి భక్తులు ఆలయాలకు వెళ్లి పూజ లు చేశారు. మహిళలు వత్తులు వెలిగించి హారతులు ఇచ్చారు. స్థానిక అన్నపూర్ణ సమేతా కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో భక్తులు రోడ్డుపైకి బారులు తీరారు. మండలంలోని కొర్లమడుగు, పోతవరం, పోతకమూరు శివాలయాల్లో అధికసంఖ్యలో భక్తులు పాల్గొని పూజలు చేశారు.

దొనకొండ: కార్తీకమాసం మొదటి సోమవారంను పురస్కరించుకొని స్థానిక ఆనంద ఆశ్రమంలో వేంచేసిన శ్రీకాశీ అన్నపూర్ణ విశ్వేశ్వరస్వామి దేవాలయం శివనామ స్మరణ తో మారుమోగింది. తెల్లవారుజాము 4గంటల నుంచే మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు నిర్వహించారు. భక్తులు, దీక్షాదారులైన స్వాములు కార్తీకదీపాలు వెలిగించి హరహర మహదేవ శంభోశంకర అంటూ ప్రదక్షిణలు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

ముండ్లమూరు: కార్తీకమాసంలో తొలి సోమవారం సందర్భంగా మండలంలోని శివాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారు జామునే మహిళా భక్తులు ఆయా గ్రామాల్లోని శివాలయాలకు వెళ్లి కార్తీక దీపాలు వెలిగించారు. అనంతరం శివుడికి ప్రత్యేక పూజలు చేశారు. మండ లంలోని పసుపుగల్లులోని కాశీవిశ్వేశ్వర అన్నపూర్ణదేవి, ముండ్లమూరులోని బ్రమరాంబ మల్లికార్జునస్వామి, మారెళ్లలోని చర్ల మల్లేశ్వరస్వామి, పులిపాడులోని శ్రీ గంగా పార్వతీ సమేతీ ఊర్నేశ్వర్వస్వామి, ఈదరలోని శ్రీరాజమల్లేశ్వర స్వామి ఆలయాలు భక్తులతో పోటెత్తాయి. శివనామస్మరణతో ఆలయాలు మార్మోగాయి. ఈ సందర్భంగా శివపార్వతులను ప్రత్యేకంగా అలంకరించారు.

అన్నదాన సత్రం నిర్మాణానికి విరాళం

తాళ్లూరు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): గుంటి గంగాభవానీ సన్నిధిలో నిర్మిస్తున్న జైభీమ్ మాలల అన్నదాన సత్రం నిర్మాణానికి కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఈతముక్కల గ్రామస్థుడు, బెంగుళూరు వ్యాపారస్తుడు బత్తుల ఐ బాబును సహకరించాని కోరారు. దీంతో స్పందించిన ఆయన సోమవారం భార్య విజయలక్ష్మి, కుమారులు జీవన్‌కుమార్, జశ్వంత్‌లతో కలిసి అన్నదాన సత్ర నిర్మాణాన్ని పరిశీలించి తల్లిదండ్రులు బత్తుల అంకయ్య, అంకమ్మ పేర్లపై రూ.8లక్షల వ్యయంతో ఒక రూం నిర్మిస్తామని చెప్పి చెక్కును కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు దార అంజయ్య, ఎల్లమంద, పులి వికాస్, రమణయ్య, శ్రీను, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

బాపట్ల జిల్లా వార్తలు
5
మంగళవారం 28 అక్టోబరు 2025


నిజాంపట్నం వద్ద ఆరు మీటర్లు ముందుకు వచ్చిన సముద్రం

బాపట్ల జిల్లా కంట్రోల్ రూం నంబర్లు
- ఎస్పీ కార్యాలయం: 8333813228
- బాపట్ల డివిజన్: 9440853213
- చీరాల డివిజన్: 8712655910
- రేపల్లె డివిజన్: 08648--213795

రానున్న 24 గంటల్లో..

20 మండలాలకు ముప్పు..

జిల్లాకు విపత్తుల నివారణ సంస్థ రెడ్ అలర్ట్ నేపథ్యంలో 673 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశామని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ తెలిపారు. 1,073 గదులు ప్రజలకు అందుబాటులో ఉన్నాయన్నారు. మంగళవారం 80 నుంచి 100 ఎంఎల్ వర్షపాతం నమోదు, 20 మండలాలు నీట మునిగే అవకాశం ఉన్నట్లు ఇస్రో నుంచి అధికారికంగా సమాచారం అందిందన్నారు. 24 గంటలపాటు యంత్రాంగం అందుబాటులో ఉండి పనిచేస్తున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 340 ఎక్సకవేటర్లు, 42 క్రేన్‌లు, 315 చెట్లు కోసే యంత్రాలు, 885 ట్రాక్టర్లు, 241 వాటర్ ట్యాంక్‌లు, 434 మోటర్లు, 329 జనరేటర్లు, 2,283 బోట్లు సిద్ధంగా ఉంచామన్నారు. అలాగే 446 టెలీకాం టవర్స్ నిరంతరం పనిచేసేలా చర్యలు తీసుకున్నామన్నారు. ప్రజలను తరలించేందుకు మండలానికి మూడు ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేశామన్నారు. 9 చెరువులకు ప్రమాదం పొంచి ఉందని కలెక్టర్ వివరించారు. తుపాను ప్రకటనతో బీచ్ దారులన్నీ మూసివేసినట్లు వెల్లడించారు. వర్షపునీరు ప్రవహించే ప్రాంతాలను గుర్తించి ట్రాఫిక్ మళ్లింపు ఏర్పాట్లు చేశామని ఎస్పీ బి.ఉమామహేశ్వర్ తెలిపారు.

నిత్యావరాల సమస్య తలెత్తకుండా..

చౌక దుకాణాల వద్ద నిత్యావసర సరుకులు కొరతలేకుండా ముందస్తు చర్యలు తీసుకున్నామని జాయింట్ కలెక్టర్ భావన వశిష్ఠ తెలిపారు. అలాగే పెట్రోల్, డీజిల్ కొరత లేకుండా అన్ని చర్యలు తీసుకున్నామని చెప్పారు. కూరగాయలు, ఆకుకూరల సమస్య రాకుండా నిరంతరం పర్యవేక్షిస్తున్నామన్నారు. నిరాశ్రయులకు బాధితులకు బియ్యం, పంచదార, పప్పు పంపిణీకి సిద్ధంగా ఉంచామన్నారు.

డీపీఆర్వో మోహనరాజుకు షోకాజ్ నోటీసులు

విధి నిర్వహణలో అలసత్వం వహించినందుకు గాను డీపీఆర్వో మోహనరాజుకుకు సోమవారం షోకాజ్ నోటీసులు జారీ అయ్యాయి. విపత్తులు వంటి ప్రత్యేక పరిస్థితుల్లో ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండా రెండు రోజుల పాటు సెలవు తీసుకోవడాన్ని కలెక్టర్ వినోద్ కుమార్ సీరియస్‌గా పరిగణించారు. 24 గంటల్లోగా నోటీసులపై లిఖిత పూర్వక వివరణ ఇవ్వాలని ఉత్తర్వులలో పేర్కొన్నారు.

ముంచుకొస్తున్న మొంథా

- నేటి రాత్రి తీరం దాటనున్న తుపాను
- ఉమ్మడి గుంటూరు జిల్లాల్లో మొదలైన వర్షాలు
- సహాయ చర్యలకు యంత్రాంగం సన్నద్ధం
- నిజాంపట్నంలో 6 మీటర్లు ముందుకొచ్చిన సముద్రం
- హార్బర్‌లో 3వ ప్రమాద హెచ్చరిక

బాపట్ల, రేపల్లె అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మొంథా తుపాను ప్రభావం మొదలైంది. సోమవారం ఉదయం నుంచే గుంటూరు, బాపట్ల, పల్నాడు జిలాల్లో వర్షాలు ప్రారంభమయ్యాయి. మధ్యాహ్నం నుంచి ఆకాశం చీకట్లు కమ్మేసింది. బాపట్ల, గుంటూరు జిల్లాలకు రెడ్ అలెర్ట్, పల్నాడు జిల్లాకు ఆరెంజ్ అలర్ట్ హెచ్చరికలను ఇప్పటికే విపత్తుల శాఖ జారీ చేసింది. మొంథా కాకినాడ తీరానికి దగ్గరవుతున్న కొద్దీ ఉమ్మడి జిల్లాల్లో వాతావరణం పూర్తిగా మారుతూ వస్తోంది. రాత్రి గాలులు లేకుండా తుపాన్ ముందు ప్రశాంతత కనిపించింది. తీర గ్రామాల్లో మాత్రం 20 నుంచి 30 కిలోమీటర్ల వేగంతో మోస్తరు గాలులు మినహా పెద్దగా అలజడి కనిపించ లేదు. వర్షం మాత్రం విరామం లేకుండా పడుతూనే ఉంది. ముందు జాగ్రత్తలు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడంతో శని, ఆదివారాల్లోనే మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లో ప్రధాన డ్రెయిన్ల పూడిక తొలగించారు. తెనాలి, మంగళగిరి, తాడేపల్లి, పొన్నూరు, రేపల్లె, బాపట్ల మున్సిపాలిటీల్లో వర్షంలోనూ పూడికతీత పనులు చేస్తూనే ఉన్నారు. గ్రామాల్లోని లోతట్టు ప్రాంతాల్లో అదనపు సిబ్బందిని కూడా ఏర్పాటు చేశారు. ముంపు సమస్య లేకుండా చూస్తున్నారు. మంగళవారం రాత్రికి కాకినాడ తీరం వద్ద తుపాను తీరం దాటనుంది. ఈ నేపథ్యంలో తుపాను ప్రభావం మూడు రోజులు ఉంటుందని ప్రభుత్వం హెచ్చరికలు చేయడంతో జనం అన్ని రోజులకు సరిపడా సరకులు, కూరగాయలు సమకూర్చుకునేందుకు దుకాణాలకు బారులు తీరారు. దీంతో కూరగాయల దరలను పట్టణ ప్రాంతాల్లో పెంచేశారు. రాత్రి వరకు వర్షం మాత్రమే పడుతుండటం, గాలుల తీవ్రత లేకపోవడంతో ప్రస్తుతానికి ఈ జిల్లాల వాసులు ఊపిరి పీల్చుకున్నారు. తుపాన్ ప్రభావిత ప్రాంతాల్లో గుంటూరు, బాపట్ల జిల్లాల కలెక్టర్లు, ప్రత్యేక అధికారులు పర్యటించి పరిస్థితిని పరిశీలించారు. లోతట్టు ప్రాంతాలు, తీర ప్రాంత ప్రజలను పునరావ కేంద్రాలు, షెల్టర్లు, సురక్షిత భవనాల్లోకి తరలించాలని అధికారులను ఆదేశించారు. ఈ జిల్లాల్లో అంచనా వేసినంత వర్షపాతం నమోదయితే, సమస్యలు లేకుండా చూసేందుకు యంత్రాంగం సమాయత్తం అయింది.

తీవ్ర ఆందోళనలో రైతాంగం

వాతావరణ శాఖ హెచ్చరికలు అన్నదాతలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ముఖ్యంగా వరి, పత్తి రైతుల వేదన వర్ణనాతీతం. ఇప్పటికే పొలాల్లో నిలిచిన నీళ్లను బయటకు పంపించడానికి అన్నదాతలు తీవ్రంగా శ్రమిస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు ప్రాథమిక నివేదికల ప్రకారం 6,800 ఎకరాల్లో పంటకు నష్టం వాటిల్లింది. నివేదికల్లో ఈ సంఖ్య 12,000 ఎకరాలకు చేరినట్లు సమాచారం.



మూడో నంబరు ప్రమాద హెచ్చరిక

మొంథా తుపాను ధాటికి నిజాంపట్నం వద్ద సముద్ర తీరం అల్ల కల్లోలంగా మారింది. హార్బర్‌లో 3వ నంబరు ప్రమాద హెచ్చరికను ఎగురవేశారు. ఆదివారం వరకు ఒకటవ ప్రమాద హెచ్చరికను ఎగురవేస్తే.. ఉదయం నుంచి 3వ హెచ్చరికకు మార్చారు. సముద్రంలో వేటకు వెళ్లిన పడవలన్నీ తుపాన్‌కు ముందే ఒడ్డుకు చేరాయి. బాపట్ల జిలాల్లోని నిజాంపట్నం, సూర్యలంక తీరంలో సముద్రం అలలు 7 నుంచి 8 అడుగుల మేర ఎగసిపడుతున్నాయి. సముద్రం 6 మీటర్ల వరకు ముందుకు వచ్చింది. ఐదురోజులుగా జెట్టీలకే పరిమితమైన బోట్లలోనే మత్స్యకారులు జీవనం సాగిస్తున్నారు. అలల ఉధృతి విపరీతంగా ఉండడంతో కాకినాడకు చెందిన మెరైన్‌బోటు నిజాంపట్నం హార్బర్‌కు చేరుకుంది. పునరావస కేంద్రాలు, తుపాను షెల్టర్ల వద్ద అధికారులు ఎవరూ కనిపించడం లేదు.

- బాపట్ల ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రంలో ప్రజలతో మాట్లాడుతున్నకమిషనర్ జి.రఘునాథరెడ్డి




నిజాంపట్నం హార్బర్‌లో నిలిచిన బోట్లు


నిజాంపట్నం సముద్రం వద్దకు ఎవరూ వెళ్లొద్దని హెచ్చరిక బోర్డు


సూర్యలంక తీరం ఒడ్డున ఉన్న ఎన్డీఆర్‌ఎఫ్ బృందం


సూర్యలంక సముద్రంలోకి వెళ్లకుండా మూసేసిన గేట్లు



నిజాంపట్నం హార్బర్‌లో బోట్లు, వలలను శుభ్రం చేసుకుంటున్న మత్స్యకారులు

సహాయక చర్యలకు రూ.19 కోట్లు మంజూరు



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కొలుసుపార్థసారధి, కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్, ఎస్పీ ఉమామహేశ్వర్, ఎమ్మెల్యే వేగేశన

ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కోవడానికి సిద్ధం

• జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొలుసు పార్థసారధి

బాపట్ల, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మొంథా తపాను నేపథ్యంలో ఎలాంటి పరిస్థితులనైన ఎదుర్కొనేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని జిల్లా ఇన్‌చార్జి, సమాచార పౌర సంబంధాలు, గృహ నిర్మాణ శాఖల మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. తుపాను ప్రభావంపై జిల్లా అధికారులతో కమాండ్ కంట్రోల్ రూంలో ఆయన అత్యవసర సమావేశం నిర్వహించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధికార యంత్రాంగానికి ఆదేశాలిచ్చారన్నారు. రెండు గంటలకోసారి సీఎం వీక్షణ సమావేశం ద్వారా పరిస్థితులను సమీక్షిస్తారని చెప్పారు. తుపాన్ కాకినాడకు 580, విశాఖపట్టణానికి 590 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉందన్నారు. సహాయక చర్యల కోసం ప్రభుత్వం రూ.19 కోట్లు విడుదల చేసినట్లు మంత్రి తెలిపారు. ఎన్‌డీఆర్‌ఎఫ్ బలగాలను, క్విక్ రెస్పాన్స్ బృందాలను ఇప్పటికే తీరప్రాంత మండలాలకు పంపించినట్లు మంత్రి చెప్పారు. పాఠశాలలకు, విద్యా సంస్థలకు మూడురోజుల సెలవులు ప్రభుత్వం ప్రకటించిందన్నారు. గ్రామీణులకు మూడు గంటలకోసారి వాతావరణ పరిస్థితులను తెలిపేందుకు ఆయన అధికారులకు సూచనలు చేశారు. ప్రజలు కూడా ప్రభుత్వానికి సహకరించాలని కోరారు. తుపాను ప్రభావంతో మంగళవారం విస్తారంగా వర్షాలు కురుస్తాయని, తీరం వెంబడి 100 నుంచి 120 కిలో మీటర్ల వేగంతో ఈదురు గాలులు వీస్తాయని, తుపాను తగ్గే వరకు మత్స్యకారులను సముద్రంలోకి అనుమతించవద్దని మంత్రి పార్థసారథి అధికారులకు ఆదేశాలిచ్చారు. సమావేశంలో కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్, ఎస్పీ బి.ఉమామహేశ్వర్, పర్యవేక్షణ ప్రత్యేకాధికారి వేణుగోపాలరెడ్డి, ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ పాల్గొన్నారు.

ఆందోళనలో మునిగిపోతున్నారు

పర్చూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మొంథా తుపాను బర్లీ రైతుల గుండెల్లో అలజడి సృష్టిస్తోంది. కొనే దిక్కు లేక.. గిట్టుబాటు ధర లేక గతేడాది నల్ల బర్లీ పొగాకును అధిక శాతం రైతులు అమ్ముకోలేక పోయారు. ఆరు బయట పొలాలు, ఖాళీ స్థలాల్లో మండెలుగా వేసి నిల్వ చేశారు. తాత్కాలికంగా ప్లాస్టిక్ పట్టలు కప్పారు. ప్రస్తుతం ఈదురు గాలులు వీస్తుండడంతో.. పట్టలు గాలికి లేచి పోయే ప్రమాదం ఉంది. భారీ వర్షాల హెచ్చరికల నేపథ్యంలో.. ఎగువ నుంచి వచ్చే వరద నీటితో పొగాకు మండెలు ముంపునకు గురవుతాయని అన్నదాతలు ఆందోళనలో మునిగిపోయారు. ఇప్పటికే అక్కడక్కడ సాగు చేసిన మిర్చి, పత్తి, కూరగాయల పైర్లు నీట మునుగుతాయని భయపడుతున్నారు.


పర్చూరు: ఉప్పుటూరు పంట పొలాల్లో నల్లబర్లీ పొగాకుకు కప్పిన పట్టలు

భక్తిశ్రద్ధలతో కార్తీక సోమవారం

కిక్కిరిసిన దేవాలయాలు

బాపట్ల/కర్లపాలెం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : కార్తీక సోమవారం నాడు దేవాలయాలు కిక్కిరిసిపోయాయి. భక్తుల శివనామ స్మరణతో మారు మోగాయి. పట్టణంలోని ఎస్ఎన్‌పీ అగ్రహారంలోని శ్రీగంగా పర్వతవర్ధిని సమేత శ్రీరామలింగేశ్వరస్వామి దేవాలయంలో శుద్ధషష్టి సందర్భంగా స్వామిని సోమనాథుడిగా ప్రత్యేకంగా అలంకరించారు. సోమేశ్వరస్వామి ఆలయంలో భక్తులు తెల్లవారుజామున కార్తీక దీపాలు వెలిగించి, పూజలు చేశారు. కర్లపాలెం పంచాయతీ అగ్రహారంలోని గంగా గౌరి సమేత బదరికేదారేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు. వందలాది మంది భక్తులు పుణ్యస్నానాలను ఆచరించి.. ఆలయంలో దీపాలు వెలిగించారు.


శివాలయంలో కార్తీకమాస పూజలు చేస్తున్న భక్తులు

క్రమబద్ధీకరణకు మరో అవకాశం

- ఎల్ఆర్‌ఎస్ గడువు మూడు నెలలు పెంపు
- బావుడా పరిధిలో ఇప్పటికే 158 దరఖాస్తులు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

నిబంధనలకు విరుద్ధంగా వేసిన లే అవుట్లలో ప్లాట్లు కొనుక్కొని అల్లాడుతున్న సామాన్య ప్రజలకు ఊరటనిచ్చేలా ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ (లే అవుట్ రెగ్యులరైజేషన్ స్కీం)కు అవకాశం ఇచ్చిన సంగతి తెలిసిందే. జూలై 26న మార్గదర్శకాలు జారీ చేసిన ప్రభుత్వం.. అక్టోబరు, సెప్టెంబరు చివరి వరకు ఎల్ఆర్ఎస్‌కు తొలుత అవకాశం ఇచ్చింది. వినియోదారుల నుంచి ఆశించిన స్థాయిలో స్పందన లేకపోవడంతో వ్యవధిని అక్టోబరు 24 వరకు పొడిగించింది. ఈ గుడువు కూడా ముగియడంతో మరో మూడు నెలల పాటు లే అవుట్ రెగ్యులరైజేషన్‌కు ప్రభుత్వం వీలు కల్పించింది. జనవరి 24 వరకు ఈ స్కీం అందుబాటులో ఉంటుందని, ప్లాట్ల యజమానులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసు కోవాలని అధికారులు కోరుతున్నారు.

గత ప్రభుత్వ హయాంలో ఇబ్బడి ముబ్బడిగా...

నిబంధనలను అడ్డగోలుగా తుంగలో తొక్కి కేవలం రాజకీయ సిఫారసులే ప్రామాణికంగా ఇబ్బడిముబ్బడిగా అనధికార లే అవుట్లు గత ప్రభుత్వంలో వెలిశాయి. ఇంటి ప్లాన్ మొదలుకుని బ్యాంకు లోన్ తీసుకునే వరకు అనేక అగచాట్లను ప్లాట్లను కొనుక్కున్న మధ్య తరగతి ప్రజలు ఎదుర్కొంటున్నారు. వీరందరికి ఊరట నిచ్చేలా చెల్లించాల్సిన ఫీజు విషయంలో 50 శాతం రాయితీ ఇచ్చి మరీ ప్రభుత్వం ఎల్ఆర్ఎస్‌కు వెసులుబాటు ఇచ్చింది. 2025 జూన్ 30కు ముందు కొనుగోలు చేసిన లే అవుట్లన్నింటికీ ఈ ఎల్ఆర్ఎస్ స్కీం వర్తించేలా మార్గదర్శకాల్లో పేర్కొంది. అయితే దీనిపై ప్లాట్ల కొనుగోలు దారుల్లో అవగాహన కల్పించడంపై వ్యవస్థల వైఫల్యం స్పష్టం కనిపిస్తోంది.

బావుడా పరిధిలో 158 దరఖాస్తులు..

బావుడా (బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ)కింద 93 అనధికార లే అవుట్లను సంబంధిత విభాగాలు గుర్తించాయి. ఉడా(ఒంగోలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ)లో భాగమై ఉన్న చీరాల, అద్దంకి, పర్చూరు ప్రాంతాలతో పాటు చీరాల, బాపట్ల, రేపల్లె, మున్సిపాలిటీ పరిధిలో ఉన్న అనధికార లే అవుట్లను కూడా కలుపుకుంటే ఈ సంఖ్య దాదాపు 270 వరకు ఉంది. ప్రభుత్వ అంచనాల ప్రకారం వీటిలో కనీసం 70 శాతం ఎల్ఆర్ఎస్ గొడుగు కిందకు తేవాలనేది లక్ష్యంగా పెట్టుకుంది. బావుడా పరిధిలో క్రమబద్ధీకరణ కోసం ఇప్పటికే 158 దరఖాస్తులు రాగా వాటి ప్రక్రియ మొదలైంది.

కడలిలోకి .. కృష్ణమ్మ పరుగులు

- 'జల ఆశయాలు' దాటి.. వరద ప్రవాహం
- సంద్రంలో కలిసిన 1,466.7 టీఎంసీలు
- 18 ఏళ్లలో రికార్డు స్థాయిలో నదికి వరద
- నిండు కుండలా ప్రాజెక్ట్‌లు కళకళ

కృష్ణమ్మ సాగర్ ఆయకట్టులో పరుగులిడుతోంది. పంటల సాగుకు పుష్కలంగా నీటిని అందిస్తోంది. దీంతో లక్షలాది ఎకరాల్లో పంటలు సాగయ్యాయి. అన్నదాతల మోముల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. నాగార్జున సాగర్, పులిచింతల, ప్రకాశం బ్యారేజీకు కృష్ణమ్మ పోటెత్తింది. 18 ఏళ్లలో రికార్డు స్థాయిలో కృష్ణా నదికి వరద వచ్చింది. ఇప్పటి వరకు 1,466.7 టీఎంసీల వరద నీరు కడలిలో కలిసిపోయింది. జూలైలో ప్రారంభమైన వరద ప్రవాహం కొనసాగుతూనే ఉంది.

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

అక్టోబరులో రికార్డు స్థాయిలో సాగర్ ప్రాజెక్టు నీటి నిల్వ ఉండటం విశేషం. దిగు వున ఉన్న జలాశయాలు నిండుకుండలా కళ కళాడుతున్నాయి. సాగర్ కుడి కాలువకు నీటిని పూర్తిస్థాయిలో సరఫరా చేస్తున్నారు. పల్నాడు, గుంటూరు, బాపట్ల, ప్రకాశం జిల్లా ల్లోని కుడి కాలువ ఆయకట్టులోని 11.11 లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తున్నారు. వచ్చే ఏడాదికి కూడా సాగు నీరుకు ఢోకా ఉండదని, వరద ప్రవాహం ఇంకొన్ని రోజులు కొనసాగవ చ్చని జలవనరుల శాఖ అధికారుల అంచనా.

నిండు కుండలా సాగర్..

సాగర్ (మిగతా 8వ పేజీలో)

సముద్రంలో కలసిన కృష్ణా జలాలు (ఈ నెల 27వరకు)

నెల	నీరు టీఎంసీలలో
ఆగస్టు	639.47
సెప్టెంబరు	573.87
అక్టోబరు	253.36

ఏఎన్‌యూ క్యాంపస్ కళాశాలలకు సెలవులు

- వసతి గృహాల విద్యార్థుల భద్రతకు ప్రత్యేక చర్యలు

ఏఎన్‌యూ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మొంథా తుపాను తీవ్రంగా మారుతుందనే హెచ్చరికలతో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం యంత్రాంగం అప్రమత్తమైంది. క్యాంపస్ కళాశాలలకు సోమవారం నుంచి ఈ నెల 29 వరకు సెలవులు ప్రకటిస్తూ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆదేశాలతో కూడిన ఉత్తర్వులను రిజిస్ట్రార్ ఆచార్య సింహాచలం జారీ చేశారు. తరగతులకు హాజరైన విద్యార్థులను, అధ్యాపకులను మధ్యాహ్నం ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసి గమ్యస్థానాలకు చేర్చారు. పరిపాలన విభాగాలు యథావిధిగా పనిచేస్తాయని రిజిస్ట్రార్ ఉత్తర్వుల్లో సూచించారు. వర్సిటీలోని అశోక, గౌతమి వసతి గృహాల్లోకి నీరు రావడంతో విద్యార్థులను వేరే చోటుకు తరలించి, ప్రత్యేక వసతి, వైద్య సదుపాయం కల్పించారు. ఇంజనీరింగ్ వసతి గృహాల విద్యార్థులు బయటకు వెళ్లకుండా వార్డెన్లు, అధ్యాపకులతో కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు.

దూరవిద్య పీజీ పరీక్ష ఫలితాల విడుదల

ఏఎన్‌యూ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం దూర విద్యా కేంద్రం ఎంఏ హిందీ, చరిత్ర కోర్సుల నాలుగో సెమిస్టర్, ఎమ్మెస్సీ ఫుడ్ అండ్ న్యూట్రిషన్ కోర్సు ప్రథమ సెమిస్టర్ (రెగ్యులర్, సప్లమెంటరీ) పరీక్ష ఫలితాలను దూరవిద్య సంచాలకుడు ఆచార్య వి.వెంకటేశ్వర్లు సోమవారం విడుదల చేశారు. విద్యార్థులు రీ-వాల్యుయేషన్‌కు వచ్చే నెల 10లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పేపర్‌కు రూ.960 ఫీజు చెల్లించాలని చెప్పారు. పూర్తి చేసిన దరఖాస్తులను వచ్చే నెల 14లోపు వర్సిటీ దూరవిద్య పరీక్షల సమన్వయకర్తకు పంపాలని.. దూరవిద్య పరీక్షల విభాగం డిప్యూటీ రిజిస్ట్రార్ జైనులాబ్దీన్ తెలిపారు. ఏఆర్ కృష్ణవేణి, ఉద్యోగులు కోదండపాణి, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.


ఫలితాలు విడుదల చేస్తున్న దూరవిద్య సంచాలకులు ఆచార్య వెంకటేశ్వర్లు

పదవీకాలం పెంపు... కమిటీలకు పూర్వవైభవం

ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని ఏఎంసీ చైర్మన్ల సమావేశంలో తీర్మానం

సమన్వయం కోసం రాచగర్ల అధ్యక్షుడుగా త్రిసభ్య కమిటీ ఎన్నిక

సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే జనార్దన్

రైతు పక్షపాతులుగా పేరు తెచ్చుకోవాలని సూచన



ఎమ్మెల్యే జనార్దన్‌ను సత్కరిస్తున్న ఏఎంసీ చైర్మన్లు

ఒంగోలు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : మార్కెట్ కమిటీల పాలకవర్గాల పదవీ కాలం ఏడాది కాకుండా కనీసం రెండేళ్లకు పెంపు, గత ప్రభుత్వ కాలంలో నిర్లక్ష్యంగా మారిన కమిటీల రోజువారీ కార్యకలాపాలను విస్తృతపరిచి పూర్వవైభవం తెచ్చేలా చర్యలు తీసుకోవాలని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్లు ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం స్థానిక ఏఎంసీ కార్యాలయంలో సమావేశమై ఈమేరకు తీర్మానం చేశారు. ఒంగోలు ఏఎంసీ చైర్మన్ రాచగర్ల వెంకట్రావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జిల్లాలోని ఇతర ఏఎంసీ చైర్మన్లు అందరూ పాల్గొన్నారు. ఏఎంసీ చైర్మన్లుగా ఉన్న కొందరు మహిళల బదులు వారి భర్తలు హాజరయ్యారు. కాగా రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లోనూ ఏఎంసీ చైర్మన్లు సమావేశాలు నిర్వహించుకొని ఈ అంశాలపై చర్చించి త్వరలో రాష్ట్రస్థాయిలో అన్ని జిల్లాల ప్రతినిధులతో ప్రత్యేక సదస్సు నిర్వహణకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో జిల్లా స్థాయిలో సోమవారం ఈ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఏడాది కాలం మాత్రమే పదవి ఉంటే ఏ ఒక్క పని సజావుగా చేసే అవకాశం ఉండదని, కనీసం ఆ రెండేళ్లు అయినా ప్రస్తుత పాలకవర్గాలను కొనసాగించాలని పలువురు అభిప్రాయపడ్డారు. అలాగే గతంలో టీడీపీ పాలనలో ఏఎంసీల ద్వారా గ్రామాల్లో లింకు రోడ్లు, గోడౌన్ల నిర్మాణం, పశు వైద్యశిబిరాలు, ఇతర పలు కార్యక్రమాలు జరిగేవన్నారు. వైసీపీ ప్రభుత్వ కాలంలో వాటన్నింటినీ మూలన పడేసి పాలకవర్గాలను నిర్వీర్యం చేసిందని ఆరోపించారు. ప్రస్తుత ప్రజా ప్రభుత్వం తిరిగి మార్కెట్ కమిటీలకు పూర్వవైభవం తెచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. త్వరలో రాష్ట్రస్థాయిలో జరిగే సదస్సుకు జిల్లా నుంచి చైర్మన్‌లందరూ హాజరుకావాలని నిర్ణయించారు. జిల్లాలో సమన్వయం కోసం ఒంగోలు ఏఎంసీ చైర్మన్ రాచగొర్ల వెంకట్రావు అధ్యక్షుడిగా కంభం, కనిగిరి చైర్మన్లతో కూడిన త్రిసభ్య కమిటీని ఎన్నుకున్నారు. ఇదిలా ఉండగా సమావేశంలో ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ కొద్దిసేపు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అలాగే ఎన్నికల సమయంలోనూ క్రియాశీలకంగా పనిచేసిన వారిని గుర్తించి ప్రోత్సహించేందుకు అన్ని నియోజకవర్గాల్లోనూ ముఖ్య నేతలనే ఏఎంసీ చైర్మన్లుగా ఎంపిక చేశారన్నారు. రైతు ప్రయోజనాలు ప్రధానంగా పనిచేసి రైతు పక్షపాతులుగా పేరు తెచ్చుకోవాలని సూచించారు. సమావేశంలో ఒంగోలు మేయర్ గంగాడ సుజాత కూడా పాల్గొన్నారు.

భగ్గుమంటున్న కూరగాయల ధరలు

టమాటా బాక్స్ రూ.1000

కిలో మునగ కాయలు వందరూపాయలు

మార్కెట్‌కు తగ్గిన దిగుమతులు

మార్టూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : కూరగాయల ధరలు భగ్గుమంటున్నాయి. మొన్నటివరకూ అందుబాటులో ఉన్నా ఇప్పుడు ఒక్కసారిగా పెరిగాయి. ప్రతి కూరలోనూ రుచి కోసం వినియోగించే టమాటా 25 కిలోలు బాక్స్ రూ.1000 ధర పలుకుతోంది. అంటే హోల్‌సేల్‌గా కిలో రూ.40 కాగా, చిల్లరగా కిలో ధర రూ.50 పలుకుతోంది. ఇక మార్కెట్ నుంచి టమాటా బహిరంగ మార్కెట్‌లోకి, గ్రామాలలో వీధులలోకి వచ్చిన తర్వాత కిలో రూ.50 నుంచి రూ.60లకు పైగానే ధర ఉంది. మార్టూరులోని పచ్చిమిర్చి కూరగాయల మార్కెట్‌లో సోమవారం కూరగాయల ధరలు భగ్గుమంటున్నాయి. ఈ ప్రాంతంలో టమాటా సాగు చాలా తక్కువ కావడంతో, మార్కెట్‌లోని వ్యాపారులు అనంతపురం, చిత్తూరు, మదనపల్లి, కర్నూలు, డోన్, కర్నాటకలోని చంతామణి, కోలారు తదితర ప్రాంతాలు నుంచి దిగుమతి చేసుకుంటారు. ఇటీవల దిగుబడి పూర్తిగా తగ్గిపోవడం, కేవలం అనంతపురం, మదనపల్లి, చిత్తూరు జిల్లాల నుంచి టమాటాను దిగుమతి చేసుకోవడంతో డిమాండు పెరిగింది. గతంలో రోజుకు 1200 బాక్స్‌లు మార్కెట్‌కు రాగా, వారం రోజుల నుండి కేవలం 800 బాక్స్‌లు మాత్రమే వస్తున్నాయి. వారం రోజుల క్రితం బాక్స్ ధర రూ.500 ఉండగా, ప్రస్తుతం ధర రెట్టింపు పలుకుతోంది. అదేవిధంగా మునగ కాయలు స్థానికంగా దిగుబడి లేకపోవడంతో, చెన్నై నుంచి వస్తున్నాయి. అవి కూడా సక్రమంగా రావడంలేదు. ప్రస్తుతానికి కిలో మునగ వంద రూపాయలు ధర పలుకుతోంది. అవి కూడా మార్కెట్‌లో లభించడం లేదు. నాలుగురోజుల క్రితం ఈ ప్రాంతంలో కురిసిన వర్షాలకు కూరగాయలు పంటలు దెబ్బతినడంతో, ప్రస్తుతం మార్కెట్‌కు కూరగాయలు చాలా తక్కువగా వస్తున్నాయి. అయ్యప్ప, వెంకన్న, అంజనేయ స్వామి మాలధారులకు వివిధ దేవాలయాల్లో అన్నదాన కార్యక్రమాలు పెరగడంతో కూరగాయలకు మరింత డిమాండు పెరిగింది. ఇటీవల కురిసిన వర్షాలకు మిరప కాయలు కోతలు జరగకపోవడంతో, ప్రస్తుతం రైతులందరూ మిరప కోస్తుండటంతో, దిగుబడి పెరిగి, మిరప ధర కిలో రూ.20 పలకడం విశేషం.

మార్టూరు మార్కెట్‌లో ధరలు	
టమాటాలు	రూ.40
బంగాళదుంపలు	రూ.40
బెండ	రూ.40
దొండ	రూ.50
వంకాయ	రూ.40
బీర	రూ.40
కాకర	రూ.50
క్యాప్సికం	రూ.80
క్యారెట్	రూ.70
కీరదోస	రూ.40



చప్టా టెర్రర్..!

కొమ్మినేనివారిపాలెం-వైదన గ్రామాల మధ్య పొంచి ఉన్న ప్రమాదం

దిమ్మెలు పగుళ్లిచ్చి శిథిలావస్థకు చేరిన వైనం

ఏ సమయంలోనైనా కూలితే రాకపోకలు నిలిచిపోయే ప్రమాదం

వినుకొండ-చిలకలూరిపేటకు కీలక మార్గం

బల్లికురవ, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొమ్మినేనివారిపాలెం-వైదన గ్రామాల మధ్య ఉన్న ఆర్ అండ్‌బీ రోడ్డులో శిథిలావస్థకు చేరిన చప్టాతో ప్రమాదం పొంచి ఉంది. రెండు దశాబ్దాల క్రితం నిర్మించిన చప్టాకు రెండు వైపులా కింద వైపున దిమ్మెలు నెర్రెలుబారాయి. ఏ క్షణంలోనైనా చప్టా కూలిపోతుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. కొమ్మినేనివారిపాలేనికి దగ్గరలో ఉన్న చప్టా కూలితే రాకపోకలు పూర్తిగా నిలిచిపోయే ప్రమాదం ఉందని అంటున్నారు. ఈ చప్టా లేకుంటే వినుకొండ-చిలకలూరిపేట రాకపోకలు కూడా నిలిచిపోతాయి. నిత్యం వందలాది మంది ఈ చప్టా వద్దకు వచ్చేసరికి భయంభయంతో తమ వాహనాలను దాటిస్తున్నారు. రోడ్డు కూడా కుంగిపోయిందని కింద ఉన్న ఒక దిమ్మెపై మాత్రమే చప్టా ఉంది. ఈ చప్టా కూలిపోతే అన్నీ ఇబ్బందులేనని ప్రజలు చెబుతున్నారు. ప్రమాదాలు జరగకముందే అధికారులు వెంటనే చప్టాను పరిశీలించి కొత్తదినిర్మించే వరకు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



పగుళ్లిచ్చిన చప్టా దిమ్మెలు



రెండు గ్రామాల మధ్య ఆర్‌అండ్‌బీ రోడ్డులో శిథిలావస్థకు చేరిన చప్టా

మంత్రి చొరవతో మరింత అభివృద్ధి

రూ.11.79 కోట్లతో 32 సామాజిక భవనాలు

పలు కార్పొరేట్ సంస్థల సీఎస్ఆర్ నిధులతో నిర్మాణం

అద్దంకి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి) : అంది వచ్చిన ఏ అవకాశాన్ని వదలకుండా విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అద్దంకి నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేపడుతున్నారు. ఒక వైపు పెద్ద ఎత్తున ప్రభుత్వ నిధులతో అభివృద్ధి పనులు కొనసాగిస్తూనే.. మరో వైపు కార్పొరేట్ సంస్థలు తమ సీఎస్ఆర్ నిధులతో పలుచోట్ల సామాజిక భవనాలు, ఇతర అభివృద్ధి పనులకు నిధులు కేటాయిస్తున్నారు.

అద్దంకి నియోజకవర్గంలో ప్రజాప్రభుత్వం ఏర్పడిన తరువాత 16 నెలల కాలంలో పలు కార్పొరేట్ సంస్థల ద్వారా 32 పనులకు సుమారు 11.79 కోట్ల రూపాయల నిధులు కేటాయింపజేశారు. ఇప్పటికే పలు సామాజిక భవనాలు పూర్తి కాగా, మరి కొన్ని నిర్మాణ దశలో ఉన్నాయి. మిగిలిన పనులకు నిధుల కేటాయించారు. ఎన్‌ఈఆర్‌డీసీఏపీ నుంచి రూ.69.5 లక్షల సీఎస్ఆర్ నిధులతో కొండమూరులో ఎస్సీ కమ్యూనిటీహాలు, కొండమంజులూరులో కమ్యూనిటీ హాలు నిర్మాణం జరుగుతుండగా, ఏల్చూరులో ఎస్సీ కమ్యూనిటీ భవనాల నిర్మాణం పూర్తయ్యింది.

- ఏపీ సోలార్ పవర్ కార్పొరేషన్ లిమిటెడ్ ద్వారా రూ.1.90 కోట్లతో రావినూతల, వైదన, పంగులూరు, తూర్పు తక్కెళ్లపాడు, నాగులపాడు, తూర్పుకొప్పెరపాడులో పలు సామాజిక వర్గాల సామాజిక భవనాలు, అద్దంకి పట్టణంలోని ప్రకాశం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో విద్యార్థుల కోసం డైనింగ్ హాల్, నూజెళ్లపల్లిలో బస్ షెల్టర్ నిర్మాణం చేస్తున్నారు.
- ఏపీ ట్రాన్స్‌కో ద్వారా రూ. 4.05 కోట్లతో మోదేపల్లి, కుంకుపాడు, కొమ్మినేనివారిపాలెం, బూదవాడ, ప్రాసంగులపాడు, పమిడిపాడు, కొమ్మాలపాడు,కామేపల్లి, కుందుర్రు, పరిటాలవారిపాలెం, అలవలపాడులో పలు సామాజిక వర్గాల కమ్యూనిటీ భవనాలు, కొటికలపూడిలో దేవాలయం ప్రహరీ నిర్మాణానికి నిధులు మంజూరు కాగా, ఇప్పటికే పలు పనులు ప్రారంభమయ్యాయి.
- సింథేట్ కంపెనీ సహకారంతో మేదరమెట్ల ఎస్టీ కాలనీలో రూ.25 లక్షలతో సామాజిక భవనం నిర్మాణం పూర్తయ్యింది.
- అదానీ గ్రూపు ద్వారా అద్దంకి పట్టణంలో అద్దంకిటౌన్ హాల్ నిర్మాణానికి 3.10 కోట్ల రూపాయల నిధులు మంజూరు అయ్యాయి. మిన్నెకల్లు, కుందుర్రు, బల్లికురవలలో సామాజిక భవనాల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి.
- ఎంపీ కృష్ణప్రసాద్ నిధులు రూ.70 లక్షలతో తిమ్మనపాలెం, సూరేపల్లి, రాచపూడిలలో కమ్యూనిటీ భవనాల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి.

ఇలా ఇప్పటికే పెద్ద ఎత్తున నిధులు మంజూరై పనులు జరుగుతుండగా, మరి కొన్ని కార్పొరేట్ సంస్థల ద్వారా మరి కొన్ని గ్రామాలలో సామాజిక భవనాల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధమవుతున్నాయి. మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆయా కార్పొరేట్ సంస్థలతో మాట్లాడి పెద్ద ఎత్తున సీఎస్ఆర్ నిధులు కేటాయింపజేస్తున్నారు.



అద్దంకిలోని పసుమర్తిపాలెంలో కమ్యూనిటీ హాల్



అద్దంకిలోని ప్రకాశం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థుల కోసం నూతనంగా నిర్మించిన డైనింగ్ హాల్

8,140 హెక్టార్లలో పంటలు నష్టం

భారీ వర్షాలతో దెబ్బతిన్న పత్తి, మొక్కజొన్న, మిరప పంటలు

ప్రాథమికంగా గుర్తించిన వ్యవసాయశాఖ

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు జిల్లాలో 8,140.18 హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నట్లు వ్యవసాయశాఖ అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. జిల్లాలోని 21 మండలాల పరిధిలోని 159 గ్రామాలకు చెందిన 9,312 మంది రైతులకు చెందిన పంటలు దెబ్బతిన్నట్లు ప్రభుత్వానికి నివేదించినట్లు సమాచారం. ఇంకా వర్షం వీడకపోవడంతో పంట నష్టాలు ఇంకా పెరిగే అవకాశం ఉంది. పెద్దారవీడు మండలంలో 13 గ్రామాలకు చెందిన 1,309 మంది రైతులు, మార్కాపురం మండలంలో 15 గ్రామాలకు చెందిన 3,260 మంది, తర్లుబాడు మండలంలో 13 గ్రామాలకు చెందిన 99 మంది, కంభం మండలంలో రెండు గ్రామాలకు చెందిన 30 మందిరైతులు, అర్ధవీడు మండలంలో నాలుగు గ్రామాలకు చెందిన 55 మంది రైతులు, మర్రిపూడి మండలంలో 18 గ్రామాలకు చెందిన 420 మంది రైతులు, పొదిలి మండలంలో 27 గ్రామాలకు చెందిన 185 మంది రైతులు, దర్శి మండలంలో ఐదు గ్రామాలకు చెందిన 228 మంది రైతులు, కొనకనమిట్ల మండలంలో మూడు గ్రామాలకు చెందిన 258 మంది రైతులు, దొనకొండ మండలంలో ఐదు గ్రామాలకు చెందిన 389 మంది రైతులకు చెందిన పలు రకాల పంటలు దెబ్బతిన్నట్లు గుర్తించారు. మొత్తమ్మీద పత్తి 6,178 హెక్టార్లు, మొక్కజొన్న 124.06 హెక్టార్లు, సజ్జ 771.40 హెక్టార్లు, జొన్న 5.42 హెక్టార్లు, వేరుశనగ 9.7 హెక్టార్లలో వర్షాలకు పంటలు దెబ్బతిన్నట్లు వ్యవసాయశాఖ అధికారులు ప్రాథమికంగా అంచనా వేసి ప్రభుత్వానికి నివేదించారు.

పత్తికి నష్టం

రాచర్ల, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : వర్షాల వలన పత్తికి తీవ్ర నష్టం జరిగిందని వ్యవసాయ శాఖ అధికారి షేక్ మహబూబ్ బాషా చెప్పారు. మండలంలోని ఒద్దులవాగుపల్లి, రామాపురం, మేడంవారిపల్లిలో పత్తి పైర్లు దెబ్బతిన్నట్లు తెలిపారు. ముందుగా వేసిన పంటలు కొంతమేర రైతులకు మేలు చేకూరతాయని, ఆలస్యంగా వేసినవి కాయ దశకు రావడంతో వర్షాలకు నష్టపోయాయని చెప్పారు. మొత్తం 250హెక్టార్ల పత్తి నష్టానికి గురైందన్నారు. ప్రస్తుతం ఏయే పంటలు ఎంతమేర నష్టం జరిగింది అంచనా వేస్తున్నామని చెప్పారు.



దెబ్బతిన్న పంట



తర్లుపాడులో ఉరకెత్తిన పొగాకు

లబోదిబోమంటున్న రైతులు

తర్లుపాడు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మిరప, పొగాకు దెబ్బతిన్నాయి. పైర్లలో నీరు నిల్వ ఉండడంతో ఉరకెత్తుతున్నాయి. మండలంలో సుమారు 800 ఎకరాల్లో మిరప సాగుచేశారు. ఎకరాకు దాదాపు రూ.70వేల వరకు ఖర్చు చేశారు. ఈ వర్షాలకు మిరప తోటల్లో నీరు నిల్వ ఉండి 2 రోజులుగా ఎండలు కాస్తుండటంతో మిరప మొఖాలు వేలేస్తున్నాయి. పొగాకు కూడా నీరు నిల్వ ఉండి మొక్కలు ఉరకెత్తుతున్నాయి. ఇప్పటి వరకు దాదాపుగా 400 ఎకరాల్లో పొగాకు సాగు చేశారు. రేగడి నేలల్లో పొగాకు మొక్కలు దెబ్బతింటున్నాయి. తర్లుపాడు, సీతానాగులవరం, నాయుడపల్లె గ్రామాల్లో ఎక్కువగా మిరప, పొగాకు పంటలు సాగు చేశారు. మొంథా తుఫాన్ దెబ్బకు పైర్లు కూడా పూర్తిగా దెబ్బతిన్నాయి. ఈ ఏడాది మిర్చి, పొగాకు రైతులకు కోలుకోలేని దెబ్బతిన్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. దీంతో రైతులు లబోదిబోమంటున్నారు.

ప్రియురాలికి పురుగుల మందు ఇచ్చిన ప్రియుడు.. సహజీవనం వద్దన్నందుకు ఘాతుకం

అవీఇవీ

అద్దంకి,అక్టోబరు27(ఆంధ్రజ్యోతి): సహజీవనానికి ప్రియురాలు నిరాకరించిందన్న ఉద్దేశ్యంతో ప్రియుడు కూల్‌డ్రింక్‌లో పురుగుల మందు కలిపి ఇచ్చాడు. పోలీసుల కథనం మేరకు... అద్దంకి మండలంలోని తిమ్మాయపాలేనికి చెందిన ఓ మహిళ కొంతకాలంగా భర్తకు దూరంగా ఉంటోంది. కుమారుడు, కుమార్తె ఉన్నారు. వినుకొండ ప్రాంతానికి చెందిన రాజు అనే యువకుడితో గత ఏడాదిగా సహజీవనం చేస్తోంది. కుమారుడు, కుమార్తె ఇద్దరు 15 ఏళ్ల కంటే ఎక్కువ వయస్సు ఉన్న వారే కావడంతో ఇటీవల నుంచి సహజీవనం చేసేందుకు ఆ మహిళ నిరాకరించింది. దీంతో యువకుడు ఏదోవిధంగా ప్రియురాలిని చంపాలన్న ఉద్దేశ్యంతో ఆదివారం రాత్రి కూల్ డ్రింక్‌లో గడ్డిమందు కలిపి ఇచ్చాడు. ఆ మహిళ కూల్ డ్రింక్‌ను సగం తాగి మిగిలిన సగాన్ని మంచం వద్ద ఉంచింది. ఆమెకు సోమవారం ఉదయం వాంతులు అయ్యాయి. వేకువనే రాజు ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. ఈ విషయాన్ని సమీప గృహాల ప్రజలు రాజుకు చెప్పారు. కూల్‌డ్రింక్‌లో పురుగు మందు కలిపి ఇచ్చానని వారికి రాజు చెప్పాడు. స్థానికులు ఆ మహిళను అద్దంకి వైద్యశాలకు తరలించి మెరుగైన వైద్యం కోసం రిమ్స్‌కు తరలించారు. రిమ్స్ నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ సుబ్బరాజు తెలిపారు.

తుఫాన్ నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి



టీడీపీ నేత ఏడుకొండలను పరామర్శిస్తున్న మంత్రి గొట్టిపాటి

పంగులూరు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి):మొంథా తుపాన్ తీవ్రతను గుర్తించి అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి తగిన సహాయక చర్యలు చేపట్టాలని రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. మండలంలోని ముప్పవరం గ్రామ టీడీపీ కార్యాలయంలో సోమవారం సాయంత్రం నియోజకవర్గ పరిధిలోని 78 మంది లబ్ధిదారులకు రూ.45 లక్షల సీఎంఆర్ఎఫ్. చెక్కులను పంపిణీచేశారు. పార్టీ కార్యకర్తలకు ప్రమాదబీమా చెక్కులను అందచేశారు. దేశంలో ఏ పార్టీకి లేనిబలం టీడీపీకి ఉందని, పార్టీకి కార్యకర్తలే బలమని అన్నారు. ఇక గ్రామాల్లో పంటసాగుకు సరిపడ ఎరువులు అందుబాటులో ఉండేలా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. తుఫాన్ దృష్ట్యా గ్రామాలలో విద్యుత్ సమస్యలు తలెత్తకుండా అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఈఈ మస్తానరావు, ఏడీఈ దామోదరంలను ఆదేశించారు. తుపాన్ సమయంలో ప్రజలు ఎవరూ బయటకు రాకుండా చూడాలన్నారు. ప్రభుత్వ యంత్రాంగం నిబద్ధతతో పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేషన్ డైరెక్టర్ నాగినేని రామకృష్ణ, పంగులూరు, అద్దంకి మండలాల టీడీపీ అధ్యక్షులు రావూరి రమేష్, మురళీమోహన్‌దాస్, అల్లంనేని బ్రహ్మానందస్వామి, గొల్లపూడి అంజయ్య, బత్తుల వెంకట్రావు, చింతల సహదేవుడు, గరిమిడి జగన్, ఓబుల్‌రెడ్డి, సింగర్, నార్నె సుబ్బారావు, శ్రీనివాసరెడ్డి, మురకొండ సుబ్బారావు, రవి, వీరాంజనేయులు పాల్గొన్నారు.

ఏడుకొండలకు మంత్రి పరామర్శ

రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స తీసుకుంటున్న టీడీపీ మండల నాయకుడు కుక్కపల్లి ఏడుకొండలను మంత్రి గొట్టిపాటి రవికుమార్ సోమవారం పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరితగతిన కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆయన వెంట టీడీపీ మండల అధ్యక్షుడు రావూరి రమేష్, పీఏసీఎస్ అధ్యక్షుడు అల్లంనేని బ్రహ్మానందస్వామి, ఆదిరెడ్డి పాల్గొన్నారు.

వైద్యారోగ్యశాఖ అప్రమత్తం

అన్ని ఆస్పత్రుల్లో అత్యవసర మందుల ఏర్పాటు

గర్భిణులు వైద్యశాలల్లో చేర్పింపు

డాక్టర్లు, ఇతర సిబ్బంది సెలవుల రద్దు

ఒంగోలు కలెక్టరేట్,అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుపాన్ నేపథ్యంలో జిల్లాలో వైద్య శాఖ అప్రమత్తమైంది. ముఖ్యమంత్రి చంద్రబాబు 24 గంటలు వైద్యాధికారులు, ఇతర సిబ్బంది అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకున్నారు. డాక్టర్లు, ఇతర సిబ్బంది సెలవులను రద్దుచేయడంతోపాటు ఆయా వైద్యశాలలకు అత్యవసర మందులను సరఫరా చేశారు. జిల్లాలో 64 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 19 యుపీహెచ్‌సీలు, 538 విలేజ్ హెల్త్ క్లినిక్‌లు ఉన్నాయి. ఆయా వైద్యశాలల్లో అన్ని రకాల మందులను సిద్ధంగా ఉంచారు. అదేవిధంగా 108 వాహనాలు 40, 104 వాహనాలు 38, 102 వాహనాలు 18 కలిపి 96వాహనాలను అందుబాటులో ఉంచడంతోపాటు అత్యవసర సమయాల్లో వినియోగించేందుకు ప్రైవేటు అంబులెన్స్‌లను కూడా సిద్ధం చేశారు. జిల్లాలో వారం, పది రోజుల్లో డెలివరి అయ్యే గర్భిణీలను ముందస్తుగానే వైద్యశాలలకు తరలించి అక్కడ వారికి అవసరమైన సదుపాయాలు కల్పించాలని ప్రభుత్వం ఆదేశించడంతో తదనుగుణంగా అధికారులు చర్యలు తీసుకున్నారు. అత్యవసర సమయాల్లో వైద్యసేవలు అందించేందుకు మూడు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. అన్ని వైద్యశాలల్లో కంట్రోలు రూములను ఏర్పాటు చేశారు. పీహెచ్‌సీల వైద్యాధికారుల ఫోన్ నెంబర్లను జిల్లా అధికారులతోపాటు ఆయా ప్రాంతాల్లో అందుబాటులో ఉంచారు. ఏదైనా అత్యవసరం అయితే నర్సింగ్ విద్యార్థులను వినియోగించుకోవాలని ప్రభుత్వం ఆదేశించడంతో తదనుగుణంగా చర్యలు తీసుకున్నారు. జిల్లాలో 11 నర్సింగ్ కాలేజీలు ఉండగా 440 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. మొంథా తుపాన్ ప్రభావంతో ఈదురుగాలులతో పాటు భారీవర్షాలు కురిసే అవకాశం ఉండటంతో ప్రజలు వ్యాధుల బారిన పడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోనున్నారు.

అన్ని ఏర్పాట్లు చేశాం

-డాక్టర్ టి.వెంకటేశ్వర్లు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి

జిల్లాలో ప్రజలు, పిల్లలు, గర్భిణులకు ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేశాం. అన్నిరకాల మందులను అందుబాటులో ఉంచాం. అత్యవసర సమయంలో వైద్యసేవలను అందించేందుకు వైద్యాధికారులు సిద్ధంగా ఉంటారు. గర్భిణులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ముందస్తుగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో చేర్పించి వారికి అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం. ఏర్పాటు చేసిన బృందాల ఫోన్ నెంబర్లను కూడా అందుబాటులో ఉంచాము.

కడలిలోకి.. కృష్ణమ్మ పరుగులు

(5వ పేజీ తరువాయి)

జలాశయంలో 98.04 శాతం మేర నీటి నిల్వ ఉంది. జలాశయం పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 312.05 టీఎంసీలు. సోమవారం డ్యాంలో నీటి నిల్వ 305.92 టీఎంసీలు ఉంది. డ్యాం పూర్తి స్థాయి నీటి నిల్వ 590 అడుగులకు గాను 587.70 అడుగుల నీటి మట్టం ఉంది. జలాశయానికి 37,366 కూసెక్కుల నీటి ప్రవాహం ఉంది. కుడి, ఎడమ కాలువల ద్వారా సాగుకు, విద్యు త్ ఉత్పత్తికి వినియోగిస్తున్న నీటితో కలిసి మొత్తం 37,266 కూసెక్కుల నీటిని డ్యాం నుంచి విడుదల చేస్తున్నారు.

'చింత' లేకుండా..

సాగార్జున సాగర్ దిగువున ఉన్న కేఎల్ రావు పులిచింతల జలాశయం కూడా పూర్తి స్థాయి నీటి నిల్వతో తొణికిసలాడుతోంది. ఇది కూడా ఆగస్టులో నిండింది. అప్పటి నుంచి నేటి వరకు పూర్తిస్థాయి నీటి నిల్వ కొన సాగుతోంది. పులిచింతల నీటి నిల్వ సామర్థ్యం 45.77 టిఎంసీలు కాగా 41.63 టీఎంసీల నీటి నిల్వ ఉంది. పూర్తి స్థాయి నీటి మట్టం 175 అడుగులు కాగా 172.27 అడుగుల నీటి మట్టం ఉంది. జలాశయం ఇన్‌ఫ్లో 33,835 క్యూసెక్కులు, ఇక్కడ నుంచి 57,896 కూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్, పులిచింతల జలాశయాలు పూర్తిస్థాయి నీటితో తొణికిసలాడుతున్నాయి.

అవీ..ఇవీ..

నిస్సహాయులకు నిత్యావసరాల పంపిణీ



నిత్యావసరాలను పంపిణీ చేస్తున్న సీఐ శేషగిరిరావు, ఎస్సై జనార్దన్

వేటపాలెం(చీరాల), అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : తుఫాన్ ప్రభావంతో నిస్సహాయ గ్రామమైన వేటపాలెం మండలం కఠారిపాలెం యానాదికాలనీ వాసులకు రూరల్ సీఐ శేషగిరిరావు, ఎస్సై జనార్ధన్ నిత్యావసరాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాతావరణశాఖ హెచ్చరికలు మేరకు రెండురోజుల పాటు ప్రజలు బయటకురావద్దని సూచించారు. విపత్కర పరిస్థితుల్లో హెల్ప్‌లైన్ నంబరుకు సమాచారం అందించాలని సూచించారు. పోలీసులు ఎల్లవేళలా అందుబాటులో ఉన్నట్లు చెప్పారు.

వార్డుల్లో వసతులపై అప్రమత్తంగా ఉండండి

● మున్సిపల్ చైర్మన్ సాంబశివరావు



జలమయమైన రోడ్లను పరిశీలిస్తున్న చైర్మన్

చీరాల, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : వార్డుల్లో ప్రజలకు సమస్యలు తలెత్తకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ చైర్మన్ మించాల సాంబశివరావు అన్నారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా డ్రెయిన్లలో రహదారుల్లో నీళ్లు నిలిచాయి. దీంతో అధికారులతో కలిసి వార్డు లో పర్యటించి నీళ్లు తొలగించారు. అలాగే పారిశుధ్యం, ఇతర పరిస్థితుల గురించి చర్చించారు. చైర్మన్ వెంట కమిషనర్ అబ్దుల్ రషీద్, డీఈఈ రఘురామ్, టీపీవో శ్రీనివాసులు, ఏఈ రవికుమార్ ఇతర సిబ్బంది ఉన్నారు.

ప్రభుత్వ కళాశాలకు 50 కుర్చీల వితరణ

చీరాల, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : వైఏ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలకు అవకాశం ఉన్న మేర సహకారాలు అందిస్తామని వాకర్స్ అసోసియేషన్ సభ్యులు అన్నారు. సోమవారం కళాశాలకు 50 కుర్చీలు వితరణ చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డా.ఎన్.మురళీ అసోసియేషన్‌కు ధన్యవాదాలు చెప్పారు. కార్యక్రమంలో పోలుదాసు రామకృష్ణ, గురుప్రసాద్, డా.ఐ.బాబూరావు, సుభాషిణి, రమేష్, పుల్లయ్యనాయుడు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌పై కలెక్టర్ ఆగ్రహం

చీరాల, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : చీరాల మున్సిపల్ కమిషనర్ అబ్దుల్ రషీద్‌పై కలెక్టర్ డా.వినోద్‌కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం తుపానుకు సంబంధించి చేపట్టాల్సిన చర్యలపై చీరాల మున్సిపల్ కార్యాలయంలో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. అలాగే దండుబాట, అర్బన్ పీహెచ్‌సీ సెంటర్, ఓ రేషన్ దుకాణం వంటివి పరిశీలించారు. ఈసమయంలో విధులలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు కమిషనర్‌పై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు.

పూడికతీత పనులు ప్రారంభం



పెద్ద అండర్‌పాస్ వద్ద పూడిక తీయిస్తున్న నేతలు

మార్టూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మార్టూరు సెంటర్లో వర్షపునీరు, మురుగునీరు సక్రమంగా వెళ్లేవిధంగా సైడుకాల్వలు పూడికతీత పనులను సోమవారం ప్రారంభించారు. ఇక్కడ తరచూ వర్షం నీరు నిలుస్తుండడంతో ఇటీవల ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పార్టీనాయకులు ఆధ్వర్యంలో హైవే ప్రాజెక్ట్ డైరెక్టర్‌కు ఒక వినతి పత్రం అందజేశారు. అత్యవసరంగా మార్టూరు కూడలిలో పెద్ద అండరుపాస్ వద్ద సైడుకాల్వలు పూడిక తీయించాలని, వర్షపునీరు నిలబడకుండా ఉండేవిధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. దీంతో పెద్ద అండరుపాస్ నుండి హీరోషోరూం వరకు సైడు కాల్వల్లో పేరుకొని ఉన్న పూడికను తీయించారు. ఇక ప్రస్తుతం తుఫాను కారణంగా వర్షపు నీరు వచ్చినా, రోడ్డుపై నిలబడకుండా ఉండేవిధంగా చర్యలు చేపట్టారు. పనులను టీడీపీ నాయకులు కామినేని జనార్దన్, తొండెపు ఆదినారాయణ, కాకోలు వెంకటేశ్వర్లు, సకల ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఆటో అదుపుతప్పి యువకుడికి తీవ్ర గాయాలు

● ఇసుక దిబ్బను ఢీకొనడంతో ఘటన

ఈపూరుపాలెం(చీరాల), అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఆటో అదుపుతప్పి యువకుడు తీవ్రంగా గాయపడిన ఘటన సోమవారం ఈపూరుపాలెం ఆటోనగర్ సమీపంలో చోటుచేసుకుంది. అందిన వివరాల ప్రకారం వేటపాలెం మండలం రామన్నపేట సమైక్యనగర్‌కు చెందిన తిరుపతయ్య ఇద్దరు కుమారులను ఆటోలో ఎక్కించుకుని బాపట్లవైపు వెళుతున్నాడు. అయితే రోడ్డు ప్రక్కన ఇసుక దిబ్బ ఉండడంతో గమనించలేదు. దీంతో దిబ్బపై చక్ర ఎక్కడంతో ఆటో బోల్తా పడింది. ప్రమాదంలో పెద్ద కుమారుడు దుర్గాప్రసాద్ తీవ్రంగా గాయపడగా ఏరియా వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తున్నారు.

సీనియర్ డాక్యుమెంట్ రైటర్ మృతి

మార్టూరు, అక్టోబరు27 (ఆంధ్రజ్యోతి): మార్టూరులో సీనియర్ డాక్యుమెంట్ రైటర్ ఇమ్మడి రాములు (74) అనారోగ్యంతో ఆదివారం రాత్రి మృతి చెందారు. ఆయనకు భార్య కుమారుడు ఉన్నారు. ఆయన చిలకలూరిపేటలో నివాసం ఉంటున్నారు. మంగళవారం అంత్యక్రియలు కార్యక్రమాలు నిర్వహిస్తారని కుటుంబసభ్యులు సోమవారం తెలిపారు.

అండర్‌పాస్ వద్ద మరమ్మతులు

● 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

● కలెక్టర్, ఎమ్మెల్యే ఆదేశాలతో కదిలిన అధికారులు



అండర్‌పాస్ వద్ద కొనసాగుతున్న పనులు

ఉప్పుటూరు(పర్చూరు), అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఉప్పుటూరు గ్రామంలో 167ఏ జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా ఏర్పాటు చేసిన అండర్‌పాస్ వద్ద నీరు నిలువకుండా అధికారులు చర్యలు చేపట్టారు. ఇక్కడ వర్షపునీరు నీరు రాకపోకలకు తరచూ ఇబ్బందిగా మారుతోంది. దీనిపై ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో కథనం వెలువడింది. దీనిపై స్పందించిన స్థానిక ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు, కలెక్టర్ వినోద్‌కుమార్ స్పందించారు. నీరు నిల్వలేకుండా చూడాలని జాతీయ రహదారి అధికారులకు సూచించారు. దీంతో స్పందించిన అధికారులు, అండర్ పాస్‌లో ఉన్న నీటిని తొలగించి, నీరు నిలబడకుండా తగుచర్యలను చేపడుతున్నారు.

తుపానును సమర్థవంతంగా ఎదుర్కొందాం

● చీరాలలో అధికారులకు కలెక్టర్ వినోద్‌కుమార్, ఎమ్మెల్యే కొండయ్య మార్గనిర్దేశం ● అన్ని మండలాల్లో అప్రమత్తమైన అధికారులు ● పలుచోట్ల పునరావాస కేంద్రాల ఏర్పాటు ● లోతట్టు ప్రాంతాలను ముందే అప్రమత్తం చేసిన అధికారులు ● తహసీల్దార్ల పర్యవేక్షణలో కంట్రోలు రూంల ఏర్పాటు







చీరాలలో ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొండయ్య, మేదరమెట్లలో పునరావాస కాలనీని పరిశీలిస్తున్న జెడ్పీసీఈవో బాలమ్మ, చినగంజాంలో పునరావాస శిబిరాన్ని పరిశీలిస్తున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లవన్న

చీరాల, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : తుపానును సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ప్రభుత్వం అన్ని విధాలుగా చర్యలు చేపట్టిందని, కలెక్టర్ డా.వినోద్‌కుమార్, ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అన్నారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో అన్ని శాఖల ప్రభుత్వం అధికారులతో సమావేశం నిర్వహించారు. డివిజన్ పరిధిలో తుపాను ప్రభావిత ప్రాంతాల్లో తీసుకున్న జాగ్రత్తలపై ఆరా తీశారు. అలాగే వార్డులోని 31వ వార్డు రోశయ్య కాలనీ పునరావాస కేంద్రాన్ని పరిశీలించారు. ఇప్పటికే కేంద్రానికి తరలించిన వారి సౌకర్యాలపై మాట్లాడారు. అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి జాగ్రత్తలు సూచించారు. వారి వెంట ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు, తహసీల్దార్ గోపీకృష్ణ, మున్సిపల్ చైర్మన్ సాంబశివరావు, కమీషనర్ అబ్దుల్ రషీద్, ఎంపీడీవో విజయ తదితరులు ఉన్నారు.

వాడరేవు(చీరాల), అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : తుఫాన్ ప్రభావంతో ఎటువంటి నష్టం జరుగకుండా చర్యలు చేపట్టామని ధైర్యంగా ఉండాలని ఎమ్మెల్యే కొండయ్య చెప్పారు. మొంథా తుఫాన్ నేపథ్యంలో సోమవారం ముంపు గ్రామాలైన వాడరేవు, రామాపురం, నాయనిపల్లి, కఠారిపాలెం, అబ్దుల్ కలామ్ కాలనీల్లో పర్యటించి గ్రామస్థులతో మాట్లాడారు. వారికి ధైర్యం చెప్పి తీసుకోవాల్సిన జాగ్రత్తలు సూచించారు. అలాగే పునరావాస కేంద్రాల్లోని ఏర్పాట్లు పరిశీలించి ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు, తహసీల్దార్ గోపీకృష్ణకు పలు సూచనలు చేశారు.

అద్దంకిలో వర్షపుజల్లులు ప్రారంభం

అద్దంకి : మొంథా తుఫాన్ ప్రభావంతో అద్దంకిలో సోమవారం మధ్యాహ్నం నుంచి వర్షపు జల్లులు ప్రారంభమయ్యాయి. ఉదయం సమయంలో ఎండ ఉండగా మధ్యాహ్నం నుంచి ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. చిన్నగా మొదలైన వర్షపుజల్లులు సోమవారం రాత్రి కూడా కొనసాగాయి. మండలంలో మొక్కజొన్న సాగు చేసిన రైతులకు ముంథా తుఫాన్ ప్రభావంతో నష్టం వాటిల్లే అవకాశం ఉందని ఆందోళన చెందుతున్నారు.

ప్రయాణాలను వాయిదా వేసుకోవాలి

అద్దంకి : ప్రజలు తమ ప్రయాణాలను వాయిదా వేసుకోవాలని సీఐ సుబ్బరాజు కోరారు. మొంథా తుఫాన్ ప్రభావంతో భారీ వర్షాలు కురిసి, గాలులు వీచే అవకాశం ఉండడంతో తమ ప్రయాణాలను మూడురోజుల పాటు వాయిదా వేసుకోవాలన్నారు. ప్రధానంగా కొత్తవ్యక్తులు ఎట్టి పరిస్థితులలో వాగులు దాటే ప్రయత్నం చేయరాదన్నారు. రామాయపాలెంలో సోమవారం రాత్రి సీఐ సుబ్బరాజు పరిశీలించి గ్రామస్థులతో మాట్లాడారు. మండలంలోని భవనాశి వాగు, దోర్నపువాగు, చిలకలేరు, నల్లవాగులు పొంగి ప్రవహించే అవకాశం ఉన్నందున జాగ్రత్తగా ఉండాలన్నారు.



కారంచేడులో కాలువ కట్టవద్ద స్థానికులతో మాట్లాడుతున్న ఎస్ఐ

పుకార్లను నమ్మవద్దు : జడ్పీసీఈవో బాలమ్మ

మేదరమెట్ల : మొంథా తుపాను తీవ్రంగా ఉండే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పుకార్లను నమ్మవద్దని జడ్పీ సీఈవో బాలమ్మ చెప్పారు. సోమవారం మండలంలోని మేదరమెట్లలోని పునరాసకేంద్రాలను అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏదైనా అనుకోని విపత్తు జరిగితే అందుకు అవసరమైన అన్ని జాగ్రత్తలను తీసుకుంటున్నట్లు తెలిపారు. ఎవరైనా లోతట్టు ప్రాంతాల్లో ఉండి ఇళ్లలోని నీరు వస్తే స్థానిక పాఠశాలలో పునరావాసం కల్పించడానికి అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. ఏదైనా సహాయం అవసరమైతే మండలంలోనే అధికారులను సంప్రదించాలన్నారు. ఆమె వెంట తహసీల్దార్ జీ.వీ.సుబ్బారెడ్డి, ఎంపీడీవో రాజ్యలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

మేదరమెట్ల : జాతీయ, రాష్ట్రీయ, గ్రామీణ, రహదారుల్లో ఎక్కడైనా రహదారులకు ఆటంకం కలిగితే స్థానిక పోలీసులను సంప్రదించాలని అద్దంకి రూరల్‌సీఐ మల్లికార్జునరావు తెలిపారు. సోమవారం తుపాను తీవ్రతను దృష్టిలో ఉంచుకొని జనరేటర్లు, మొకులు, రంపాలు, గొడ్డలు, వంటి ఉపకరణాలను సమకూర్చుకొని ముందస్తు ఏర్పాట్లు చేసుకున్నట్లు మల్లికార్జునరావు తెలిపారు. పోలీసులు చేసిన ఏర్పాట్లను తహసీల్దార్ జీవీ.సుబ్బారెడ్డి పరిశీలించారు. కార్యక్రమంలో మేదరమెట్ల ఎస్సై మహ్మద్ రఫీ, కొరిశపాడు ఎస్సై సురేష్‌లు ఉన్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

చినగంజాం : తుపాన్ తీరం దాటి ప్రశాంత వాతావరణం నెలకొనే వరకు మండల స్థాయి అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని పర్చూరు నియోజకవర్గ ప్రత్యేకాధికారి లవన్న, మండల ప్రత్యేకాధికారి సీ.హెచ్.ప్రశాంత్‌లు అన్నారు. మండలంలోని మోటుపల్లి, పెదగంజాం గ్రామాల్లో పర్యటించి, గ్రామాల్లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను, తీరప్రాంతాలను సోమవారం వారు పరిశీలించారు. అత్యవసరమైతే తప్ప ఎవరు బయటకు రావద్దన్నారు. తుఫాన్ హెచ్చరికలను అనుక్షణం గమనిస్తూ నడుచుకోవాలని సూచించారు. పునరావాస కేంద్రాలకు వచ్చే వారికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా తాగునీరు, భోజన సదుపాలు, ఫ్యాన్లు ఏర్పాటు చేయాలన్నారు. ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చుడాలని అధికారులను ఆదేశించారు. పెదగంజాం జడ్పీ పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రంలోని ఏర్పాట్లు పరిశీలించారు. పునరావాస కేంద్రం వద్ద ఉంచిన ఆహారం, బ్లీచింగ్, జనరేటర్, రెండు ట్రాక్టర్లు, జెసీబి తదితర వాటిని ఆయన పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు అందజేశారు. ఈ సందర్భంగా తుపాను పర్యవేక్షణ కోసం గ్రామాలకు ప్రత్యేక అధికారులను నియమించారు. ఇక ఇంకొల్లు సీఐ వై.వీ.రమణయ్య మోటుపల్లి, రుద్రమాబపురం తదితర గ్రామాల్లో పర్యటించారు. తీరం వెంట ప్రజలను అప్రమత్తం చేశారు. మత్స్యకారులు వేటకు వెళ్లవద్దన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ జీవిగుంట ప్రభాకరరావు, ఎంపీడీవో కే.ధనలక్ష్మి, ఏపీఎం గద్దె పెదసుబ్బారావు, గ్రామ కార్యదర్శి కె.కృపారావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నాలుగు గ్రామాలలో పునరావాస కేంద్రాలు

పంగులూరు : మొంథా తుఫాన్ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని నాలుగు గ్రామాలలో పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ శ్రీచరణ్ తెలిపారు. పునరావాస కేంద్రాలలో ఉన్నవారికి ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా తగిన వసతులు కల్పించామన్నారు. మొంథా తుఫాన్‌పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందికలిగినా టోల్‌ఫ్రీ నెంబరు 9000811918 నెంబరుకు ఫోన్‌చేసి తగిన సాయం పొందాలని, సిబ్బంది అన్నివేళలా ప్రజలకు అందుబాటులో ఉంటారన్నారు.

అద్దంకి : తుఫాన్ ప్రభావంతో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ శ్రీచరణ్ అన్నారు. పట్టణంలోని పల్లపు ప్రాంతాలుగా ఉన్న ఎన్‌టీఆర్ నగర్, గుంజివారిపాలెం, పోలేరమ్మ గుడి వెనుక, పాత దర్శి రోడ్డు తదితర ప్రాంతాలలో తహసీల్దార్ శ్రీచరణ్, మున్సిపల్ కమిషనర్ రవీంద్రలు సోమవారం పరిశీలించి స్థానికులకు తగు జాగ్రత్తలు తెలిపారు. లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలిస్తే పునరావాసం కోసం 10 ప్రాంతాలను సిద్ధం చేసినట్లు తెలిపారు. మండలంలోని శింగరకొండపాలెం ఎస్టీ కాలనీని తహసీల్దార్ శ్రీచరణ్ పరిశీలించారు. మున్సిపల్ ఏఈ లోకేష్, ఆర్ఐ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

చెరువులను పరిశీలించిన ఎంపీడీవో

పంగులూరు : మండలంలోని నూజెళ్లపల్లె, చందలూరు, అలవలపాడు, కోటపాడు, జనకవరం గ్రామాలలో చెరువులను సోమవారం ఎంపీడీవో స్వరూపారాణి పరిశీలించారు. తుపాను వేళ తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. తుఫాన్ తీవ్రతను గుర్తించాలని, తీరంతాకే వరకు ప్రజలెవరూ ఇళ్ల నుంచి బయటకు రావద్దని సూచించారు. చెట్ల కింద, విద్యుత్ తీగలకింద నిలువరాదన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో సుమంత్, కార్యదర్శులు, వీఆర్వోలు పాల్గొన్నారు.

తుపానును ఎదుర్కోవడానికి అధికారుల ఏర్పాట్లు

మార్టూరు : మొంథా తుపాను నేపథ్యంలో అధికారులు అప్రమత్తమయ్యారు. మార్టూరు మండలంలో 18 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాలలో విద్యుత్, తాగునీరు, పారిశుధ్యం, భోజనం తదితర వసతులు ఉండే విధంగా చర్యలు చేపట్టారు. అత్యవసర సమయంలో వినియోగించడానికి ఎక్స్‌కవేటర్, తాళ్లు,బ్యాటరీ లైట్లను సిద్ధం చేశారు. మార్టూరులోని ప్రభు త్వ ఆస్పత్రిలో విద్యుత్ సమస్య ఏర్పడకుండా ముందు జాగ్రత్త చర్యగా జనరేటర్లును ఏర్పాటుచేశారు. యద్దనపూడి మండలంలో 8 పునరావాసకేంద్రాలను ఏర్పాటుచేశారు

పర్చూరు : తుపాను హెచ్చరికల నేపథ్యంలో అధికారులు అప్రమత్తమయ్యారు. బాపట్ల జిల్లా కలెక్టర్ వి.వినోద్ కుమార్ ఎప్పటికప్పుడు అధికారులను అప్రమత్తం చేస్తున్నారు. 24 గంటలు సిబ్బంది విధుల్లో ఉండేలా షిఫ్ట్‌ల వారీగా విధులు నిర్వహించేలా కార్యాచరణ రూపొందించుకుంటున్నారు. పర్చూరు, కారంచేడు మండలాల పరిధిలో అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేస్తున్నారు. కారంచేడులో తహశీల్దార్ నాగరాజు, ఎస్సై ఖాదర్ బాషా, ఇతర శాఖల అధికారులతో కలసి కొమ్మమూరు కాలువతో పాటు, ఇతర కాలువలను పరిశీలించారు. ఆయా లోతట్టు గ్రామాల్లోని ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించే విధంగా చర్యలు చేపట్టారు. అదేవిధంగా పర్చూరులో తహశీల్దార్ బ్రహ్మయ్య, ఎస్సై .జి.వి.చౌదరి నేతృత్వంలో అధికారులు ప్రత్యేక పునరాస కేంద్రాలను ఏర్పాటు చేసి పర్యవేక్షిస్తున్నారు. తుపాను ప్రభావంతో ఎలాంటి ప్రాణహాని జరగకుండా పటిష్టమైన చర్యలు చేపడుతున్నట్లు తహసీల్దార్ తెలిపారు.

మొంథా తుపానుతో గనులలో నిలిచిన పనులు





గ్రానైట్ క్వారీలను పరిశీలిస్తున్న తహసీల్దార్, ఎస్సై, గ్రానైట్ క్వారీ

బల్లికురవ, అక్టోబరు27 (ఆంధ్రజ్యోతి): మొంథా తుపాను ప్రభావం నేపథ్యంలో గనులలో క్వారీలలో రెవెన్యూ అధికారులు పనులు నిలిపివేశారు. గతంలో కూడా ఒక క్వారీలలో వర్షాలు పడిన తదుపరి రాయి ఊడి పడి నలుగురు కార్మికులు మృతి చెందిన విషయం విదితమే. దీంతో ప్రస్తుత వర్షాల నేపథ్యంలో అధికారులు పనులను నిలిపివేశారు. ఎక్కడైన పనులు చేపడితే చర్యలు తప్పవు అని హెచ్చరించారు. అలానే తుపానుతో ఎలాంటి ప్రమాదాలు లేకుండా వాగులు వచ్చే చోట నీరు ముందుకు వెళ్లేలా యంత్రాలతో కాలువల్లో పూడికలను తీయించారు. మండల ప్రత్యేకాధికారి వెంకటేశ్వర్లు, ఎంపీడీవో కుసుమకుమారి పలు శాఖల అధికారులు కూడా మండల కేంద్రంలో రాత్రి కూడా ఉండేలా ఏర్పాట్లు చేసుకున్నారు. తహసీల్దార్ కార్యాలయం, పోలీసు స్టేషన్, కేజీబీవీ విద్యాలయం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో విద్యుత్ సరఫరా పోతే ప్రత్యామ్నాయంగా జనరేటర్లను ఏర్పాటు చేయించారు.

తుపానుతో రైతులకు తీవ్రనష్టం

● పత్తి చెట్ల నుంచి రాలుతున్న పూత, కాయలు



కొణిదెనలో పత్తి పంటలో వర్షాలతో రాలిన పూత, కాయలు

బల్లికురవ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మొంథా తుపాను ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాలతో పంటలకు తీవ్ర నష్టం వచ్చింది. పంట చేతికి అదే సమయంలో కురుస్తున్న వర్షాలతో పొలాల్లో నీరు నిలవడంతో కొన్ని చొట్ల మొక్కలు కుళ్లి పోతున్నాయి. అని రైతులు అంటున్నారు. బల్లికురవ మండలంలోని పలు గ్రామాలలో రైతులు పత్తి, మిర్చి, పొగాకు, వరిచ మొక్కజొన్న పంటలను సాగు చేశారు. భారీ వర్షాలు గాలుల ప్రభావంతో పంటలకు తీవ్ర ఇబ్బంది తలెత్తింది. పత్తిపంటలో కాయలు పూత రాలి పోతున్నాయి. పొగాకు మొక్కలు నీరు నిలవడంతో కుళ్లి పోతున్నాయి. మొక్కజొన్న పంట కోత దశలోనే పడిపోయింది. సజ్జ కంకులు వర్షాల వలన బూజు వచ్చాయని రైతులు తెలిపారు. మిర్చి మొక్కలు వర్షాలతో ఎర్రగా వచ్చి ఎదుగుదల లేకుండా పోయాయని రైతులు తెలిపారు. ఆరటి, బొప్పాయి పంటలకు గాలులు బాగా పెరిగితే తీవ్ర నష్టం జరుగుతుందని రైతులు వాపోతున్నారు. మరో మూడు రోజుల పాటు వర్షాలు పడితే పంటలు చేతికి రావని రైతులు వాపోతున్నారు. ఇప్పటికే కొణిదెన, రాజుపాలెం, వేమవరం, ఉప్పుమాగులూరు, సోమవరప్పాడు, కొప్పెరపాలెం గ్రామాలలో సాగులో ఉన్న పత్తి పంటకు ఈ వర్షం తీవ్రనష్టం తెచ్చి పెట్టిందని రైతులు తెలిపారు.



ఊరకెత్తిన పొగాకు

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



సాయం అందజేస్తున్న వీరయ్య

చినగంజాం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొత్తపాలెం గ్రామ పంచాయతీ పరిధిలోని మూలగానివారిపాలెం గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు మారుబోయిన శ్రీనివాసరెడ్డి ఇటీవల ఆకస్మాత్తుగా మృతి చెందాడు. టీడీపీ క్రియాశీలకంగా ఉండే కార్యకర్త మృతిచెందడంతో బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే రూ.50,000లు ఆర్థిక సాయం అందించారు. ఎమ్మెల్యే ఏలూరి అందజేసిన రూ.50 వేల రూపాయిల నగదును టీడీపీ మండల అధ్యక్షులు పొద వీరయ్య సోమవారం శ్రీనివాసరెడ్డి కుటుంబ సభ్యులకు అందజేశారు. శ్రీనివాసరెడ్డి దశదినకర్మకు వీరయ్య, మండల పరిధిలోని టీడీపీ నాయకులు హాజరై చిత్రపటానికి నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రాజు వెంకటేశ్వరరెడ్డి, సందు శ్రీనివాసరావు, ఆర్.ఉదయ్‌భాస్కర్‌రెడ్డి, చేజర్ల రమణ, గ్రామ పంచాయతీ పరిధిలోని టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

శివాలయాల్లో కార్తీక సోమవార పూజలు







చినగంజాంలోని చిదంబరేశ్వరస్వామి, అద్దంకిలో కమతేశ్వరస్వామి, కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు

అద్దంకి, అక్టోబరు27(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం మొదటి సోమవారం కావడంతో శివాలయాలలో భక్తులు పెద్దసంఖ్యలో కార్తీకదీపాలు వెలిగించి పూజలు నిర్వహించారు. పట్టణంలోని పాతశివాలయం, కమతేశ్వ రాలయం, వేయిస్తంభాల గుడిలతో పాటు పలు దేవాలయాలలో మహిళా భక్తులు వేకువజాము నుండే కార్తీక దీపాలు వెలిగించారు. ఆయా దేవాలయాలలో స్వామి వారికి అభిషేకాలు నిర్వహించారు. మండలంలోని మణికేశ్వరంలో మల్లేశ్వరస్వామికి ప్రత్యేకంగా అభిషేకాలు నిర్వహించారు. మహిళా భక్తులు, దీక్షా భక్తులు పెద్ద సంఖ్యలో గుండ్లకమ్మ నదిలో స్నానాలు చేసి స్వామి వారిని దర్శించుకున్నారు. భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

గన్నవరంలో శివాలయం వద్ద స్నానఘట్టం ఏర్పాటు

యద్దనపూడి,(మార్టూరు) : యద్దనపూడి మండలంలోని గన్నవరం గ్రామంలో శివాలయం వద్ద రొటేరియన్ చెన్నుపాటి బసవరాములు, డెక్కన్ క్లబ్ హైదరాబాదు వారు కలిసి ఏర్పాటు చేసిన స్నానఘట్టాన్ని సోమవారం రోటరీక్లబ్ ప్రతినిధులు ప్రారంభించారు. కార్యక్రమానికి ఆర్ఐ డిస్ట్రిక్ గవర్నర్ డాక్టర్ ఎస్‌వీ రాంప్రసాద్ దంపతులు,డెక్కన్ క్లబ్ ప్రతినిధి తిరుపతినేని మురళి, జి కిరణ్, జి శరత్‌చౌదరిలు ముఖ్య అతిథులుగా విచ్చేశారు. కార్యక్రమంలో స్థానిక రొటేరియన్లు జాష్టి వెంకటమోహనరావు, మాదాల సాంబశివరావు, రావి అంకమ్మచౌదరి, కొర్రపాటి కాజారావు తదితరులు పాల్గొన్నారు.

18న శింగరకొండలో కోటి దీపోత్సవం


అద్దంకి : శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో కార్తీక మాసం సందర్భంగా నవంబరు 18వ తేదీ కోటి దీపోత్సవం నిర్వహించనున్నట్లు చైర్మన్ చుండూరి మురళీసుధాకరరావు, అసిస్టెంట్ కమిషనర్ తిమ్మానాయుడు తెలిపారు. కార్తీక బహుళ చతుర్ధశి స్వాతి నక్షత్రం సందర్భంగా నవంబరు 18న మంగళవారం సాయంత్రం 5 గంటలకు కోటి దీపోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ఉత్సవంలో పాల్గొనే మహిళలు 12వ తేదీ లోపు పేర్లు కార్యాలయంలో నమోదు చేసుకోవాలన్నారు. పూజా సామగ్రి దేవస్థానం ఆధ్వర్యంలో సమకూరుస్తారన్నారు. కోటి దీపోత్సవము జ్యోతి ప్రజ్వలన లక్కవరం ఆశ్రమం కృష్ణస్వామి చేస్తారని తెలిపారు. భక్తులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. కోటీ దీపోత్సవానికి మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొనే అవకాశం ఉండటంతో దేవస్థానం ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు.

శైవక్షేత్రాలలో మార్మోగిన శివనామస్మరణ

చినగంజాం : కార్తీక మాస సోమవారాన్ని పురస్కరించుకుని మండల పరిధిలోని శైవక్షేత్రాలు శివనామస్మరణతో మార్మోగాయి. ఆలయాలకు భక్తులు పోటెత్తారు. కార్తీక మాసం మొదటి సోమవారాన్ని పురస్కరించుకొని పరమశివుని దర్శించుకుని భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించేదుకు భక్తులు బారులుతీరారు. భక్తులు తెల్లవారుజామునే పుణ్యస్నానాలు ఆచరించి ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మహిళా భక్తులు కార్తీక దీపాలు వెలిగించి పరమశివుని మదినిండా కొలిచారు. ఆలయాల్లోని స్వామివార్లకు రుద్రాభిషేకాలు, వివిధ ద్రవ్యాలతో అభిషేకాలతో పాటు విశేష అలంకరణలు చేశారు. స్థానిక గంగా పార్వతీ సమేత చిదంబరేశ్వర స్వామి ఆలయం, కడవకుదురు గోకర్ణేశ్వరస్వామి ఆలయం, సోపిరాల లలితా పరమేశ్వరి సమేత రామకోటేశ్వరస్వామి ఆలయం, కొత్తపాలెం బాలకోటేశ్వర స్వామి ఆలయం, సంతరావూరు, గొనసపూడి, పెదగంజాం, నీలాయపాలెం తదితర గ్రామాల్లోని ఆలయాల్లోని త్రినేత్రుడుని భక్తులు దర్శించుకుని అభిషేకాలు, పూజలు చేశారు. ఈ సందర్భంగా క్షేత్రాలు, ఆలయాలు భక్తి పారవశ్యంతో ఉప్పొంగింది. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని కార్తీక దీపారాధనలు చేశారు. పూజలు అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను వినియోగం చేశారు.

ప్రసన్నాంజనేయస్వామి దేవాలయానికి గ్రైండర్ అందజేత

అద్దంకి, అక్టోబరు27(ఆంధ్రజ్యోతి): శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో అన్నదాన సత్రంలో వినియోగించుకునేందుకు గ్రైండర్ ను అద్దంకి పట్టణం కు చెందిన వసుంధర సిల్క్స్ అధినేత పబ్బిశెట్టి శేషారావు సోమవారం చైర్మన్ చుండూరి మురళీసుధాకరరావుకు అందజేశారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు.



నేడు కూడా విద్యాసంస్థలకు సెలవు

నెల్లూరు (విద్య) : తుఫాన్ ప్రభావంతో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున మంగళవారం కూడా అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు, జూనియర్ కళాశాలలకు సెలవు ప్రకటించినట్లు కలెక్టర్ హిమాన్షు శుక్లా ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఉత్తర్వులను ప్రధానోపాధ్యాయులు, ఎంఈఓలు విధిగా అమలు చేయాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ విద్యాసంస్థలను తెరవకూడదని డీఈఓ బాలాజీరావు తెలిపారు. ఎంఈఓలు హెడ్ క్వార్టర్స్‌లో ఉండి కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేసుకోవాలని, ప్రధానోపాధ్యాయులు ఆయా పాఠశాలల్లో అందుబాటులో ఉండాలని ఆదేశించారు. అదేవిధంగా జూనియర్ కళాశాలలు కూడా ఆదేశాలను విధిగా పాటించాలని ఆర్ఐఓ వరప్రసాద్‌రావు తెలిపారు.



ఇందుకూరుపేట మండలం మైపాడులో కసురుమీదున్న కడలి

మొంథా.. ముసురు

- జిల్లాపై ప్రభావం చూపని తుఫాన్
- రోజంతా జడివాన, చలిగాలులు
- సరాసరి 4.6 మి.మీ వర్షపాతం నమోదు
- ఊపిరిపీల్చుకున్న అధికారులు, ప్రజలు
- పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు
- నిండు కుండల్లా నీటివనరులు
- పర్యవేక్షిస్తున్న ప్రత్యేకాధికారి, కలెక్టర్

కంట్రోల్ రూము ఫోన్ నెంబర్లు : 0861-2331261, 7995576699

నెల్లూరు (హరనాథపురం), అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : 'మొంథా' తుఫాన్ ప్రభావంతో జిల్లావ్యాప్తంగా మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. సోమవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు తేలిక పాటి వర్షం పడినా సాయంత్రానికి ఈదురు గాలులలో కూడిన వర్షం పడింది. జిల్లా యంత్రాంగం తుఫాన్‌ను దృష్టిలో ఉంచుకుని ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంది. నెల్లూరు, ఆత్మకూరు, కావలి, కందుకూరు డివిజన్ కేంద్రాలలో కంట్రోల్ రూములను ఏర్పాటు చేసింది. తీర ప్రాంతాలలో అధికారులు తుఫాన్ ప్రభావాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. సోమవారం ఉదయం 8.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జిల్లాలో సగటు వర్షపాతం 4.6 మి.మీగా నమోదైంది. అత్యధికంగా పొదలకూరులో 18.8 మి.మీ వర్షం కురిసింది. మంగళ, బుధవారాలలోనూ భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

● చెరువుల్లో జలకళ

గడిచిన పది రోజులుగా కురుస్తున్న వర్షాలకు జిల్లాలోని చాలా వరకూ చెరువులు నిండు కుండలను తలపిస్తున్నాయి. ఇప్పుడు కురు స్తున్న వర్షాలకు పలు ప్రాంతాల్లో వాగులు పొంగిపొర్లుతున్నాయి. బొగ్గేరు పొంగడంతో సంగం మండలం వీర్లగుడిపాడుకు రాకపోకలు నిలిచిపోయాయి. వరికుంటపాడు మండలం కనియంపాడు సమీపంలో వాగు రోడ్డుపై ప్రవహిస్తుండడంతో పలు గ్రామాలకు రాకపోకలకు ఆగిపోయాయి. ఇక ఎగువ ప్రాంతాల్లో వర్షాలు తగ్గుముఖం పట్టడంతో సోమశిల జలాశయానికి వరద ప్రవాహం తగ్గింది.

ఏ పరిస్థితినైనా ఎదుర్కొందాం!

ముందస్తు నివారణ చర్యలతోనే తుఫాన్ నష్టాన్ని నివారించగలమని, ఎటువంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉండాలని జిల్లా ప్రత్యేకాధికారి యువరాజ్ అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్ తిక్కన భవన్‌లో తుఫాన్‌కు సంబంధించి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులతో ఆయన సమీక్షించారు. రెవెన్యూ, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, మెడికల్ హెల్త్, ఐసీడీఎస్ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు ఇబ్బంది కలగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. కలెక్టర్ హిమాన్షు శుక్లా మాట్లాడుతూ తుఫాన్ నుంచి ప్రజలను రక్షించేందుకు ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలను సిద్ధంగా ఉంచినట్లు చెప్పారు. జిల్లాలో 9 తీర మండలాలు, వీటిలో 42 సున్నిత గ్రామాలను, 166 నివాసాలను గుర్తించామని తెలిపారు. 144 సహాయ కేంద్రాలను ప్రజల కోసం ఏర్పాటు చేయించినట్లు చెప్పారు. ప్రతి మండలానికి ఒక ప్రత్యేకాధికారిని నియమించినట్లు తెలిపారు. పెన్నానది పరివాహక ప్రాంతాల్లో వరదల ప్రభావం చూపే 40 సున్నిత ప్రదేశాలను గుర్తించి తాత్కాలిక మరమ్మతు పనులు చేస్తున్నారని తెలిపారు. ఈ సమావేశంలో జేసీ మొగిలి వెంకటేశ్వర్లు డీఆర్వో విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న యువరాజ్

పోర్టులో ఐదో నెంబరు ప్రమాద హెచ్చరిక

ముత్తుకూరు : బంగాళాఖాతంలో ఏర్పడిన మొంథా తుఫాను తీవ్రత పెరిగిన నేపథ్యంలో సోమవారం కృష్ణపట్నం పోర్టులో 5వ నెంబరు ప్రమాద హెచ్చరిక ఎగురవేశారు. తుఫాను తీవ్రత అధికంగా ఉండవచ్చన్న సూచనలతో అధికారులు అప్రమత్తమయ్యారు.

● ఫోన్ చేసిన వెంటనే స్పందించండి

కంట్రోల్ రూముకు ప్రజలు ఫోన్ చేసిన వెంటనే స్పందించాలని జిల్లా ప్రత్యేకాదికాధికారి యువరాజ్ కంట్రోల్ రూము సిబ్బందిని ఆదేశించారు. సోమవారం తిక్కన భవన్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమును కలెక్టర్ హిమాన్షు శుక్లాతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కలెక్టరేట్‌తో పాటు కందుకూరు సబ్ కలెక్టర్ కార్యాలయం, నెల్లూరు, కావలి, ఆత్మకూరు ఆర్డీఓ కార్యాలయాల్లో కంట్రోల్ రూములు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

మొంథా తుఫాన్ ముప్పు నుంచి జిల్లా బయటపడినట్లే కనిపి స్తోంది. తీవ్ర తుఫాన్‌గా మారి జిల్లాపై ప్రభావం చూపుతుందని అంచనా వేసినప్పటికీ అది దిశను మార్చుకొని కాకినాడ తీరం వైపు కదలడంతో జిల్లా ఊపిరిపీల్చుకుంది. ముందస్తు హెచ్చరికల ప్రకారం సోమవారం జిల్లాలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురవాలి. మంగళవారం తేలికపాటి నుంచి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ప్రకటించింది. కానీ సోమవారం తేలికపాటి చినుకులు మాత్రమే పడ్డాయి. కొన్ని మండలాల్లో అసలు ఆ చినుకులు కూడా పడలేదు.



తుఫాన్ ఉంది.. పారాహుషార్!

● మైకుల్లో విస్తృత ప్రచారం

మొంథా తుఫాన్ పట్ల జాగ్రత్తగా ఉండాలని పాలకులు, అధికారులు ప్రకటనలు చేస్తుంటే ఓ ఆరోగ్య కార్యకర్త మాత్రం వినూత్న ప్రచారం చేస్తూ ప్రజలను అప్రమత్తత చేస్తున్నారు. మండలంలోని అప్పసముద్రం పంచాయతీ ఆరోగ్య కార్యకర్త ఎండీ మన్సూర్‌అలీ సిబ్బందితో కలిసి మైక్రో మైకు ద్వారా పంచాయతీలోని అన్ని గ్రామాల్లో తిరుగుతూ తుఫాన్ ప్రభావంతో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని, బయటకు రావద్దని అరుస్తూ ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.

- ఉదయగిరి (ఆంధ్రజ్యోతి)

మండలం	వర్షపాతం (మి.మీ)
పొదలకూరు	18.8
ముత్తుకూరు	14.6
టీపీ గూడూరు	13.6
ఇందుకూరుపేట	11.2
మనుబోలు	10.2
వెంకటాచలం	10.2
నెల్లూరు రూరల్	9.6
నెల్లూరు అర్బన్	8.4
దగదర్తి	7.2
కోవూరు	6.4
విడవలూరు	6.2
అల్లూరు	5.8
బోగోలు	5.6
సైదాపురం	5.6
కొడవలూరు	5.2
సంగం	5.2
జలదంకి	5.2
బుచ్చి	5.0
రాపూరు	3.2
చేజర్ల	2.2
ఉదయగిరి	2.2
కలువాయి	2.0
వలేటివారిపాలెం	2.0
ఆత్మకూరు	1.8
కలిగిరి	1.4
గుడ్లూరు	1.2
కావలి	1.2
కొండాపురం	1.2
అనంతసాగరం	1.0
ఏఎస్‌పేట	1.0
కందుకూరు	1.0
ఉలవపాడు	1.0

1007 చెరువుల్లో 39 టీఎంసీల నీరు

సంగం : గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు జిల్లాలోని 1007 చెరువుల్లో సుమారు 39 టీఎంసీల నీరు చేరిందని ఇరిగేషన్ ఎస్ఈ దేశ్‌నాయక్ పేర్కొన్నారు. సోమవారం ఆయన సంగంలోని బీరాపేరు వాగు, పెన్నా నదిని పరిశీలించారు. మండలంలోని కాలువలు, చెరువుల పరిస్థితిపై ఏఈ వినయ్ కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎస్ఈ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా ఉన్న చెరువుల్లో 54 టీఎంసీల కెపాసిటీకిగాను 39 టీఎంసీల నీరు చేరినట్లు తెలిపారు. 311 చెరువులు వంద శాతం నిండి కలుజులు పారుతున్నట్లు తెలిపారు. భారీ వర్షాలు కురిస్తే చెరువులు తెగిపోకుండా నూరు శాతం నిండిన చెరువుల తూములను ఎత్తి 30 శాతం ఖాళీ చేయాలని ఇరిగేషన్ అధికారులకు ఆదేశాలిచ్చామన్నారు. ఆయన వెంట డీఈ పెంచలయ్య. ఇరిగేషన్ సిబ్బంది ఉన్నారు.



బీరాపేరు వాగును పరిశీలిస్తున్న ఎస్ఈ దేశ్ నాయక్



నెల్లూరులో గొడుగులకు భలే గిరాకీ

'సోమశిల'కు తగ్గిన వరద

అనంతసాగరం : సోమశిల జలాశయానికి ఎగువ నుంచి వస్తున్న వరద ప్రవాహం తగ్గుముఖం పట్టింది. ఆదివారం సాయంత్రం 51,237 క్యూసెక్కులు వస్తుండగా సోమవారానికి 35,600 క్యూసెక్కులకు పడిపోయింది. గేట్ల ద్వారా దిగువకు సరఫరా చేస్తున్న నీటి మోతాదును తగ్గించారు. 63,460 క్యూసెక్కులు విడుదల చేస్తుండగా 33,460 క్యూసెక్కులకు కుదించారు. డ్యాంలో 67.212 టీఎంసీలు నిల్వ ఉంచారు.

● నిండుకుండలా 'కండలేరు'

రాపూరు : కండలేరు జలాశయం నిండు కుండలా మారింది. జలాశయంలో 58.97 టీఎంసీల నీరు చేరడంతో ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా 1900 క్యూసెక్కుల నీటిని పిన్నేరు, సత్యసాయి గంగ కాలువ ద్వారా స్వర్ణముఖి నదికి విడుదల చేస్తున్నారు. వరుస వర్షాలతో జలాశయానికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రణాళికలు సిద్ధం చేసినట్లు డ్యాం అధికారులు తెలిపారు. ప్రస్తుతం ఇన్‌ఫ్లో 1,450, అవుట్ ఫ్లో 3450 క్యూసెక్కులు ఉన్నట్లు కండలేరు ఏఈ అనిల్ కుమార్ తెలిపారు.

● 'సంగం'లో 90 వేల క్యూసెక్కుల ప్రవాహం

సంగం : బీరాపేరు, బొగ్గేరు వరదతోపాటు సోమశిల నుంచి సోమవారం సుమారు 90 వేల క్యూసెక్కుల నీటి ప్రవాహం సంగం బ్యారేజీకి వచ్చి చేరుతోంది. దీంతో బ్యారేజ్ వద్ద నీటిమట్టం 11.5 అడుగులకు చేరింది. సోమశిల నుంచి విడుదల చేసే నీటిని 62వేల క్యూసెక్కుల నుంచి 37 వేలకు తగ్గించడంతో క్రమేణా బ్యారేజ్ వద్ద నీటి మట్టం తగ్గుతున్నట్లు ఏఈ వినయ్ కుమార్ తెలిపారు. కాగా, 79 గేట్ల ద్వారా దిగువ పెన్నానదికి నీటిని విడుదల చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

● 'గండిపాళెం' క్రస్ట్‌గేట్లు ఎలా ఉన్నాయ్!

ఉదయగిరి : మండలంలోని గండిపాళెం జలాశయ క్రస్ట్‌గేట్ల పనితీరును సోమవారం జలవనరుల శాఖ డీఈ చంద్రమౌళి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగు క్రస్ట్‌గేట్లు పని చేస్తున్నాయని, ప్రస్తుతం జలాశయం నీటిమట్టం 11 అడుగులకు చేరినట్లు చెప్పారు. పైతట్టు ప్రాంతం నుంచి వరద వస్తున్నందున నీటిమట్టం పెరిగే అవకాశం ఉందన్నారు. డీఈ వెంట ఏఈలు సురేష్, వేణు తదితరులు ఉన్నారు.

కూరగాయలండీ.. కూరగాయలో..!

● మొబైల్ వాహనాల్లో విక్రయాలు



నెల్లూరు (వ్యవసాయం) : తుఫాను ప్రభావంతో ప్రజలు ఇబ్బందులు పడకుండా జిల్లావ్యాప్తంగా మొబైల్ వాహనాల్లో కూరగాయలు అందించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా సోమవారం మార్కెటింగ్ శాఖకు ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు జిల్లావ్యాప్తంగా 15 వాహనాలను ఏర్పాటు చేసినట్లు మార్కెటింగ్ శాఖ ఏడీ అనిత తెలిపారు. నెల్లూరు, నెల్లూరు రూరల్ నియోజకవర్గాలకు 2, ఆత్మకూరుకు 2, కోవూరుకు 3, కావలికి 3, కందుకూరుకు 3, సర్వేపల్లికి 2 వాహనాలను ఏర్పాటు చేశారు. ఒక్కో వాహనానికి సుమారుగా నలుగురి నుంచి ఐదుగురు సిబ్బందిని నియమించారు. మైకుల్లో అరుస్తూ స్థానికులకు కూరగాయలు విక్రయించారు.



బిట్రగుంట : మత్స్యకారులతో మాట్లాడుతున్న తహసీల్దారు శ్రీనివాసరెడ్డి



ఆత్మకూరు : పెన్నా తీరంలోని బండారుపల్లిలో గ్రామస్థులతో మాట్లాడుతున్న ఆర్డీవో పావని



పొదలకూరు : పర్వతాపురం వద్ద పూడికతీత పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి

విద్యుత్ శాఖ అప్రమత్తం



అధికారులతో చర్చిస్తున్న రమణాదేవి

నెల్లూరు (జడ్పీ) : మొంథా తుఫాన్ ప్రభావంతో విద్యుత్ శాఖ పూర్తిగా అప్రమత్తమైంది. సీఎండీ జిల్లాకు ప్రత్యేక అధికారులను నియమించారు. తిరుపతి కార్పొరేట్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ఎస్పీడీసీఎల్ జనరల్ మేనేజర్ రమణాదేవి జిల్లాకు ప్రత్యేకాధికారిణిగా నియమించారు. ఆమెతోపాటు మరికొంతమంది అధికారులను నియమించి జిల్లాలో పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. జిల్లాకు వచ్చిన ఆమె ఎస్ఈ రాఘవేంద్రంతో కలిసి అధికారులను అప్రమత్తం చేయడంతో పాటు తుఫాన్ ప్రభావం ఉండే తీరప్రాంతాలలో పర్యటిస్తూ అధికారులను అప్రమత్తం చేస్తున్నారు.(లైన్లు దెబ్బతినే పరిస్థితులు ఏర్పడితే, వెంటనే మరమ్మతులు చేసేందుకు 1150 విద్యుత్ స్తంభాలు, 63 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లు 52, 100 కేవీ 54, నాలుగు 160 కేవీ, 47 సింగిల్ ఫేస్ ట్రాన్స్‌ఫార్మర్లతోపాటు ఇతర పరికరాలను అందుబాటులో ఉంచారు.

డీఆర్వోగా విజయకుమార్

రామాయపట్నం క్లస్టర్‌కు నలుగురు డిప్యూటీ కలెక్టర్లు

ఎల్ఆర్ఎస్ గడువు.. 3 నెలలు పొడిగింపు

మద్యం నకిలీనా.. కాదా!?

అందుబాటులోకి ఏపీ సురక్ష ఎక్సైజ్ యాప్

- పూర్తి వివరాలు 8లో..

జన సైనికుల్లో సయోధ్యకు సన్నాహాలు

- మంగళగిరిలో నేటి నుంచి ప్రత్యేక సమావేశం
- నేడు, రేపు 8 మంది చొప్పున హాజరు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట), అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : జనసేన పార్టీలో ఉమ్మడి నెల్లూరు జిల్లా నాయకుల మధ్య సయోధ్యను కుదిరించేందుకు ఏపీ ఎంఎస్ఎంఈడీసీ చైర్మన్ శివశంకర్ సన్నాహాలు ప్రారంభించారు. జనసేనాని, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆదేశాల మేరకు ఆయన మంగళ, బుధవారాల్లో జిల్లా నాయకులతో ప్రత్యేకంగా సమావేశం కానున్నారు. ఇటీవల జనసేన నాయకుల మధ్య వర్గ విభేదాలు తారస్థాయికి చేరడంతో ఆగ్రహించిన పవన్ ఇరు వర్గాలను మంగళగిరి పార్టీ కార్యాలయానికి పిలిపించి క్లాస్ తీసుకున్నారు. ఈ క్రమంలో జిల్లాలో పార్టీని గాడిలో పెట్టేందుకు రిటైర్డ్ ఐఏఎస్ అధికారి, ఏపీ ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ చైర్మన్ తమ్మిరెడ్డి శివశంకర్‌కు బాధ్యతలు అప్పగించారు. జిల్లాలోని జనసేన పార్టీలో ఏం జరుగుతుంతో స్పష్టంగా తెలుసుకొని విభేదాలకు అడ్డుకట్ట వేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

● జిల్లా నాయకులతో సమావేశాలు

పవన్ కల్యాణ్ ఆదేశాల మేరకు తమ్మిరెడ్డి శివశంకర్ మంగళగిరిలోని తన కార్యాలయంలో జిల్లా నాయకులతో సమావేశం కానున్నారు. మంగళవారం పార్టీ నగర అధ్యక్షుడు దుగ్గిశెట్టి సుజయ్‌బాబు, రీజనల్ కోర్డినేటర్లు కోల విజయలక్ష్మి, నాగరత్నం, కావలి నియోజక వర్గానికి చెందిన అలహరి సుధాకర్, ఆత్మకూరుకు చెందిన నలిశెట్టి శ్రీధర్, గూడూరుకు చెందిన తీగల చంద్రశేఖర్, జిల్లా ప్రధాన (మిగతా 8లో..)

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	127
స్కిన్ చికెన్	230
స్కిన్‌లెస్	254

కోడిగుడ్ల ధర (100): 560

సముద్రంలో ఎగసిపడుతున్న అలలు

బిట్రగుంట, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలంలో మొంథా తుపాను ప్రభావం వల్ల తూర్పు తీరప్రాంత సముద్రంలో సోమవారం అలలు ఎగసిపడుతున్నాయి. తెల్లవారుజామునుంచి గాలులతో కూడిన వర్షం కురుస్తోంది. తుపాను హెచ్చరికల నేపథ్యంలో అధికారులు తీర ప్రాంతప్రజలను అప్రమత్తం చేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు చెరువులు, గుంటలు దాదాపు నిండుకుండల్లా ఉన్నాయి.

రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో జిల్లాకు పతకాలు

నెల్లూరు(విద్య), అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో జరిగిన 38వ రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో జిల్లా క్రీడాకారులు పతకాలు సాధించారు. అండర్-50 పురు షుల విభాగం లో ఏ.శ్రీనివాసులు బంగారుపతకం, అండర్-24 మహిళల విభాగంలో ఎస్.లీనా రజితపత కం, అండర్-14 బాలుర విభాగంలో ఎస్.సాధన బంగారుపతకం సాధించారు. పతకాలు సా ధించిన క్రీడాకారులు బాపట్లలో డిసెంబర్ 27 నుంచి 29వ తేదీ వరకు జరిగే జాతీయ పోటీ లకు ఎంపికయ్యారని జిల్లా యోగా క్రీడా అసోసి యేషన్ కార్యదర్శి ప్రసన్నకుమార్ తెలిపారు.

బీసీల పట్ల వివక్ష తగదు

కావలి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) రాష్ట్రంలో 52 శాతానికి పైగా జనాభా ఉన్న బీసీల పట్ల రాజకీయపార్టీలు వివక్ష చూపుతున్నాయని బీసీ ఐక్యతభవన్ రాష్ట్ర అధ్యక్షుడు అద్దంకి ప్రభాకర్‌రావు తెలిపారు. కావలి జర్నలిస్ట్ క్లబ్‌లో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ప్రభాకర్‌రావుతో పాటు ఆ భవన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాయుడు పరి శుద్ధరావు, గౌరవాధ్యక్షుడు ఉరిటి గోవింద్, సహాయ కార్యదర్శి కోడింగారి శ్రీను, వ్యవ స్థాపక అధ్యక్షుడు చిన్ని వర ప్రసాద్‌రావు మాట్లాడారు. బీసీ ఐక్యతభవన్ ప్రథమ వార్షికోత్సవం మంగళవారం కావలిలో జరుగుతుందన్నారు. బీసీలు ఎదుర్కొంటున్న సమస్యలు, కులగణన, రాజకీయాలలో బీసీల వాటా తదితర అంశాలపై చర్చిస్తామని ఆయన తెలిపారు.

తాగునీరివ్వాలని వినతి

కావలి (టౌన్) అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బుడమగుంట గిరిజన కాలనీకి తాగునీరు సరఫరా చేయాలని సీపీఎం ఆధ్వర్యంలో గిరిజనులు సోమవారం డీఏవోకు విన తిపత్రం అందించారు. సీపీఎం పట్టణ కార్యదర్శి పసుపులేటి పెంచలయ్య మాట్లాడుతూ బుడమగుంట 17వ వార్డు గిరిజన కాలనీలో సుమారు వందకు పైగా గిరిజన కుటుంబాలు పదేళ్లుగా నివాసం ఉంటున్నా మున్సిపల్ అధికారులు తాగునీరు సరఫరా చేయడం లేదన్నారు. రెండు రోజుకోసారి ట్యాం కర్ల ద్వారా సరఫరా చేసే నీరు తాగేందుకు పనికి రావని, పాలకులు వెంటనే నీటిసరఫరా చేయించి ఎన్నికల హామీని నిలబెట్టుకో వాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు కృష్ణమోహన్, మధుసూదన్‌రావు, సీఐ టీయూ పట్టణాధ్య క్షుడు తిరుపాలు, స్థానిక గిరిజన సంఘం పెద్దలు లక్ష్మయ్య, సుశీల తదితరులు పాల్గొన్నారు.

రాయితీ వరి విత్తనాలు సరఫరా ఎప్పుడు?

జలదంకి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): రబీ వరి సాగుకు రైతులు సిద్ధమవుతున్నా నేటికీ వ్యవసాయశాఖ రాయితీ వరి విత్తనాలు సరఫరా చేయలేదు. ఈనెల చివరి తేదీల్లో, నవంబరు మొదటి వారంలో మండలంలో దాదాపు 20 వేల ఎకరాలకు పైగా నారుమళ్లు పోయనున్నారు. కానీ నేటికీ వ్యవసాయశాఖ వరివిత్తనాల సరఫరా ఊసేలేకుండా నిమ్మకుండిపోయింది. ప్రైవేటుగా విత్తనాలు కొనుగోలు చేయాలంటే వాటి నాణ్యత అన్నదాతలకు ప్రశ్నార్థకంగా మారింది. దీంతో పలువురు రైతులు ప్రభుత్వం వ్యవసాయశాఖ ద్వారా అందజేసే రాయితీ విత్తనాల కోసం ఎదురుచూస్తున్నారు.

తాగునీరు విడుదల



ప్లాంటు నుండి నీరు సంపులోకి వెళుతుండడాన్ని పరిశీలిస్తున్న ఏఈ

లింగసముద్రం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : రాళ్లపాడు ప్రాజెక్టు ఆధారంగా పనిచేసే రాళ్లపాడు-రోళ్లపాడు భారీ మంచి నీటి పథకం నుంచి సోమవారం అధికారులు తాగు నీటిని విడుదల చేశారు. సోమవారం ఏఈ రాజశేఖర్ వాటర్ ప్లాంటు నుండి పథకానికి నీటి సరఫరాను విడుదల చేశారు. రాత్రికి ఈ పథకం పరిధిలోని 43 గ్రామాలలోని మంచినీటి ట్యాంకులకు, కొన్ని గ్రామాలలోని సంపులకు నీరు సరఫరా అవుతుందన్నారు. ప్రజలు మంగళవారం ఉదయం నుండి నీటిని పట్టుకోవచ్చన్నారు. ఏఈ వెంట పథకం నిర్వాహకులు అడపా రంగయ్య, గాలంకి ప్రసాద్ ఉన్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ



ఎరువుల రికార్డులను తనిఖీ చేస్తున్న ఏవో అబ్దుల్ రహీం

కందుకూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీధనలక్ష్మీ ఎంటర్‌ప్రైజెస్ ఎరువుల దుకాణంలో మండల వ్యవసాయ అధికారి అబ్దుల్ రహీం సోమవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. డీఏపీ తదితర ఎరువులు కొనుగోలు చేసిన రైతులకు రశీదులు ఇవ్వడం లేదని గమనించి రూ.6.2 లక్షల విలువ గల ఎరువుల అమ్మకాలు నిలిపివేయాలంటూ నోటీసులు జారీ చేశారు. రైతులకు రశీదులు ఇవ్వకపోయినా, అధిక ధరలకు విక్రయాలు జరిపినా చట్టపరమైన చర్యలను తీసుకుంటామన్నారు.

కంట్రోల్ రూము ఏర్పాటు

రాపూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మొంథా తుపాను హెచ్చరికల నేపథ్యంలో ప్రజలను వరదల నుండి రక్షించేందుకు రాపూరు తహసీల్దార్ కార్యాలయంలో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ లక్ష్మీ నరసింహం తెలిపారు.

మూడు రోజులు అప్రమత్తంగా ఉండాలి

● ఆర్డీవో సన్నీ వంశీక్రిష్ణ

కావలి, అక్టోబరు27 (ఆంధ్రజ్యోతి) మొంథా తుఫాన్ ప్రభావం దృష్ట్యా ఈ నెల 30 వరకు మూడు రోజుల పాటు అన్నిశాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని కావలి ఆర్డీవో ఎం సన్నీ వంశీక్రిష్ణ ఆదేశించారు. ఎలాంటి విపత్తు వచ్చినా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. స్థానిక ఆర్డీవో కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం ఉదయం డివిజన్‌లోని వివిధ శాఖల అధికారులు, సిబ్బందితో ఆయన సమావేశం నిర్వహించారు. మండలాలవారీగా తుఫాను వల్ల ఎదురయ్యే సమస్యలను, అక్కడి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. కావలి ఆర్డీవో, మున్సిపల్, విద్యుత్‌శాఖల కార్యాలయాలతో పాటు డివిజన్‌లోని అన్ని మండల కార్యాలయాల్లో కంట్రోల్ రూములు ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు పరిస్థితులను తెలుసుకుంటూ ఉండాలన్నారు. లోతట్టు, తుఫాను ప్రభావిత ప్రాంతాలను గుర్తించి, బాధితులను అవసరమైతే సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. అవసరమైన చోట పురావాస కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీవో సన్నీ వంశీక్రిష్ణ

కావలి డివిజన్‌లో ప్రమాదకరంగా ఉన్న 34 చెరువుల వద్ద పరిస్థితులను ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు ఒక ఉద్యోగిని నియమించినట్లు తెలిపారు. అవసరమైతే మరమ్మతులు చేసే విధంగా తగు ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలన్నారు. ప్రతి మండలంలో రెండు ఎక్స్‌కవేటర్లను సిద్ధం చేసుకుని, వాటి నిర్వహణను కూడా ఒక ఉద్యోగికి అప్ప గించేలా ఏర్పాట్లు చేశామన్నారు. తుఫాను ప్రమాద ప్రాంతాలను గుర్తించి, అటువైపు ఎవరూ వెళ్ల కుండా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలన్నారు. ప్రజలు అత్యవసర మైతే తప్ప ఇళ్లలో నుంచి బయటకు రావద్దని ఆర్డీవో సూచించారు.

అప్రమత్తంగా ఉండాలి

బిట్రగుంట, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలంలోని తీరప్రాంత గ్రామాల్లో తహసీల్దారు సానా శ్రీనివాసరెడ్డి రెవెన్యూ సిబ్బందితో కలిసి సోమవారం పర్యటించారు. జువ్వలదిన్నె, సీఆర్‌పాలెం, ఎస్వీపాలెం, ఏనుగులబావి, ముంగమూరు పంచాయతీలను సందర్శించి, అక్కడి తుఫాన్ షెల్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ తీరప్రాంతంలో ఉన్న 14 తుఫాన్ షెల్టర్లలో 8 మాత్రమే ఉపయోగకరంగా ఉన్నాయన్నారు. వాటిని శుభ్రం చేయించి పునవాస కేంద్రాలుగా వినియోగించుకునేందు ఏర్పాట్లు చేశామన్నారు. ప్రజలకు వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది అందుబాటులో ఉండాలని ఆదేశించామన్నారు. ఆయనతో పాటు డిప్యూటీ తహసీల్దారు భరత్, ఆర్ఐ రామకుమారి, వీఆర్వోలు హరిబాబు, బాలనరసింహం తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

కావలి (టౌన్) అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): జనతా వారధి కార్యక్రమంలో భాగంగా బీజేపీ ఆధ్వర్యంలో సోమవారం పలు సమస్యలపై ఆర్డీవో వంశీకృష్ణకు నేతలు వినతిపత్రం అందించారు. పార్టీ ఒకటవ పట్టణ అధ్యక్షుడు మంద కిరణ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నాయకులు మాట్లాడారు. టిడ్కో గృహ సముదాయానికి ప్రహరీ గోడ నిర్మించాలని, పారిశుద్ధ్య పనులు చేపట్టాలన్నారు. ప్రభుత్వా సుపత్రిలో జనరేటర్, తగినన్ని ఆక్సీజన్ సిలిండర్లు ఏర్పాటు చేయాలని కోరారు. కందుకూరి సత్యం, బెల్లంకొండ మాల్యాద్రి, సీవీసీ సత్యం, పరుసు వెంకటేశ్వర్లు, సీవీసీ సత్యం, జయకుమార్ పాల్గొన్నారు.

భీకర గాలులకు చెట్లు, విద్యుత్ స్తంభాలు నిలిచేనా!?

కావలి రూరల్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాను ప్రభావంతో కావలి పట్టణంలో రోడ్ల పక్కన ఉన్న భారీ వృక్షాలు, దెబ్బతిన్న విద్యుత్ స్థంబాలతో ప్రమాదం పొంచి ఉందని పట్టణ వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జనతాపేట, ట్రంక్ రోడ్డు, వెంగళరావునగర్ తదితర ప్రాంతాల్లో భారీ వృక్షాల కారణంగా బిక్కుబిక్కు మంటూ గడపాల్సి వస్తోందని ఆ ప్రాంత వాసులు వాపోతున్నారు. వర్షాకాలం సమీపించకముందే చెట్ల కొమ్మలు తొలగించి ఆస్థి, ప్రాణనష్టం సంభవించకుండా చర్యలు చేపట్టాల్సిన పాలకులు, విద్యుత్, మున్సిపల్ అధికారులు సమన్వయ లోపంతో ప్రజల ప్రాణాలు గాలికి వదిలేశారు. దీంతో చిన్నపాటి గాలులు వీచినా చెట్లు, విద్యుత్ తీగలు, స్థంబాలపై పడడంతో ప్రతి ఏటా ఆస్తి నష్టం వాటిల్లుతోంది. ఇటీవల జనతాపేటలో చెట్టు కొమ్మ విరిగి రోడ్డుపై పడింది. ఆ సమయంలో ఎవరూ అటువైపు రాకపోవటంతో ప్రాణ నష్టం తప్పింది. వాయినందనప్రెస్ వీధిలో ఇటీవల విద్యుత్ స్తంభం విరిగిపడటంతో రాత్రి సమయం కావటంతో పెను ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు. దెబ్బతిన్న విద్యుత్ స్థంబాలు తొలగించాలని అనేక మార్లు విద్యుత్ అధికారులకు విన్నవించుకున్నా పట్టించుకోవటం లేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అధికారులు ముందస్తుగా దెబ్బతిన్న విద్యుత్ స్థంబాలు తొలగించటం తో పాటు భారీ వృక్షాల తలకొమ్మలు తొలగించి వృక్షాల తో పాటు ప్రజల ప్రాణాలు కాపాడాలని కోరుతున్నారు.



జెట్పీ స్కూల్ ఎదురు దెబ్బతిన్న విద్యుత్ స్తంభం

పునరావాస కేంద్రాలు సిద్ధం

అల్లూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : తుఫాన్ తీవ్రతరం దాల్చుతున్న తరుణంలో ముందస్తు చర్యల్లో భాగంగా పునరావాస కేంద్రాలను సిద్ధం చేసినట్టు ఇన్‌చార్జి తహసీల్దారు ప్రవీణ్ కుమార్ తెలిపారు. సోమవారం మండలంలోని పురిణి పంచాయతీ, అల్లూరు నగర పంచాయతీ పరిధిలోని పునరావాస కేంద్రాలు, వసతులను ఆయన పరిశీలించారు. తుఫాన్ తీవ్రత నేపథ్యంలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసిందన్నారు. మత్స్యకార గ్రామమైన ఆదినారాయణపురంలోని గ్రామ కాపులతో మాట్లాడారు. ఎలాంటి సమస్య ఉన్నా అధికారులను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో వీఆర్వోలు పాల్గొన్నారు.

కందుకూరును ప్రకాశం జిల్లాలో కలపాలి

● కలెక్టర్‌కు జేఏసీ నేతల వినతి

కందుకూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రకాశం జిల్లాలో కందుకూరు నియోజకవర్గాన్ని కలిపి ఆప్రాంత ప్రజల ఆకాంక్షను నెరవేర్చాలని కందుకూరు జేఏసీ నేతలు సోమవారం జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లాను కలిసి వినతిపత్రం అందచేశారు. ఈసందర్భంగా జేఏసీ నేతలు మాట్లాడుతూ కందుకూరు ప్రజల మనోభావాలకు విరుద్ధంగా గత వైసీపీ ప్రభుత్వం అడ్డగోలు విభజన చేసి నెల్లూరులో కలిపిందన్నారు. గతంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, యువగళం పాదయాత్రలో లోకేష్ ఇద్దరు కందుకూరు నియోజకవర్గంను ప్రకాశంలో కలుపుతామని ప్రజలకు మాట ఇచ్చారన్నారు. దీనిలో భాగంగా జిల్లాల మార్పులు చేర్పులకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్న వేళ కందుకూరును కూడా ప్రకాశంలో కలి పేందుకు సన్నాహాలు చేస్తుండగా నె ల్లూరు జిల్లా నాయకులు మోకాలు అడ్డుతున్నారని సోమవారం ఒక దిన పత్రికలో వార్తా కథనం నియోజకవర్గ ప్రజల ఆశలను నీరుకార్చినట్లు అవుతుందన్నారు. దీనిపై స్పందిస్తూ జిల్లా కలెక్టర్‌కు కందుకూరు ప్రాంత ప్రజల ఆకాంక్షను నెరవేరేలా ప్రకాశంలో కలపాలని వినతి పత్రం అందచేసినట్లు పేర్కొన్నారు. కలెక్టర్‌కు వినతిపత్రం అందించిన వారిలో టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల నాయకులు బెజవాడ ప్రసాద్, పాలేటి కోటేశ్వరరావు, దామా మల్లేశ్వరరావు, ఘట్టమనేని హరిబాబు, చిలకపాటి మధు, చదలవాడ కొండయ్య, మోషే తదితరలు ఉన్నారు.



కలెక్టర్ హిమాన్షు శుక్లాకు వినతి పత్రం అందచేస్తున్న కందుకూరు జేఏసీ నేతలు

ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలి

●ఆర్టీసీ జోనల్ చైర్మన్

కందుకూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి కందుకూరు ఆర్టీసీ డిపో మేనేజర్ శ్రీనివాసులు, సిబ్బందికి సూచించారు. సోమవారం ఆయన కందుకూరు ఆర్టీసీ డిపోను సందర్శించారు. ఈ సందర్భంగా డిపోలో పనిచేస్తున్న 35 మంది అవుట్ సోర్సింగ్ సిబ్బందికి రెయిన్ కోట్లు పంపిణీ చేశారు. అనంతరం కార్తీక మాసం స్పెషల్ బస్సుల కరపత్రాలను విడుదల చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించి వారికి మెరుగైన బస్సులను అందించిందన్నారు. బస్సులతోపాటు, బస్టాండ్ ఆవరణ కూడా పరిశుభ్రంగా ఉంచాలని అవుట్ సోర్సింగ్ సిబ్బందికి సూచించారు. అనంతరం చైర్మన్‌ను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజరు ప్రసాదు, అసిస్టెంట్ ఇంజనీరు లక్ష్మీ, స్థానిక నాయకులు ఘట్టమనేని హరిబాబు, వరప్రసాదు, వైకుంఠం, బూషయ్య, రాజేష్, మాల్యాద్రి నాయడు, శ్రీనివాసులరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



జోనల్ చైర్మన్‌ను సన్మానిస్తున్న ఆర్టీసీ సిబ్బంది

'మొంథా'పై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

లింగసముద్రం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మొంథా తుపాను నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ కె కోటేశ్వరరావు, ఎంపీడీఓ కె శ్రీనివాసులు సూచించారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో వారు మాట్లాడుతూ తుపాను నేపథ్యంలో కురిసే భారీ వర్షాలకు రాళ్లపాడు ప్రాజెక్టు దిగువన లోతట్టులో ఉన్న మన్నేరు పరీవాహక ప్రాంతాల ప్రజలు జాగ్రత్తగా ఉండాలన్నారు. అలాగే సచివాలయాల్లోని సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. ఎలాంటి అత్యవసర పరిస్థితులు ఏర్పడినా వెంటనే అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. తుఫాను సమయంలో కరెంటు, మంచినీరు విషయంలో ప్రజలు ముందు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మండలంలోని పెదపవని, వీఆర్ కోట, లింగసముద్రం హైస్కూళ్లలో తుఫాను షెల్టర్లు ఏర్పాటు చేసినట్టు, వీటి నిర్వహణకు మండల స్థాయి అధికారులను నియమించినట్టు చెప్పారు. అలాగే ప్రజలు కూడా ఏదైనా అనారోగ్యం బారిన పడితే వైద్య ఆరోగ్య శాఖ అధికారులను, సిబ్బందిని సంప్రదించాలన్నారు. సచివాలయాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోతే జనరేటర్లు ఏర్పాటు చేస్తామన్నారు. అలాగే పశువులు, గొర్రెలు, మేకలను జాగ్రత్తగా ఉంచుకోవాలని సూచించారు.



ఉలవపాడు : వెంకారెడ్డి కుంట ఎస్టీలను పునరావాస కేంద్రానికి రావాలని సూచిస్తున్న తహసీల్దార్

పునరావాస కేంద్రాలకు తరలింపు

●ఉలవపాడు : మొంథా తుఫాన్ తీవ్ర రూపం దాల్చనున్నందున లోతట్టు ప్రాంత ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తహసీల్దార్ శ్రీనివాసులు చెప్పారు. మండలంలో రామాయపట్నం, పెద్ద పట్టపుపాలెం, బాలకోటయ్య సంఘం, ఉలవపాడు, మన్నేటికోట గ్రామాల్లో తుఫాన్ బాధితులను ఆదుకునేందుకు అన్ని సౌకర్యాలతో శిబిరాలను ఏర్పాటు చేశామన్నారు. నిత్యం వారికి అందుబాటులో ఉండేలా గ్రామ, మండలస్థాయి అధికారులను నియమించామన్నారు. వైద్య సిబ్బంది, జనరేటర్, మంచినీళ్లు, శిబిరంలో ఉన్నంత కాలం వారికి ఆహారం, మందులు అందుబాటులో ఉంచామన్నారు. ఇందులో భాగంగా ఉలవపాడులోని ఎంపీడీవో కార్యాలయం పక్కన ఉన్న కోటిరెడ్డికుంట, వెంకారెడ్డి కుంట ఎస్టీలను అధికారుల వెంట పునరావాస కేంద్రాలకు తరలి వెళ్లాలని తహసీల్దార్ సూచించారు.

'ముంపు ముప్పు' నుంచి రక్షణ ఇలా..

● కావలి పట్టణంలో ముందస్తుగా కాలువల ఏర్పాటు



తుమ్మలపెంట రోడ్డులో పాపిరెడ్డి చెరువు మరవ నీరు వెళ్లేందుకు తీసిన కాలువలు

కావలి, అక్టోబరు27 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలు వస్తే పట్టణంలోని పాతూరు, దళిత వాడలు ముంపునకు గురికాకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. తుమ్మలపెంట రోడ్డులో వర్షపు నీరు వెళ్లేందుకు అనువుగా ముందస్తుగా సోమవారం ఎక్స్‌కవేటర్‌తో కాలువలు తీశారు. రెవెన్యూ, మున్సిపల్, జలవనరులశాఖాధికారులు దగ్గరుండి సమన్వయంతో కాలువలు తీయించారు. తుమ్మలపెంట రోడ్డులో లేఅవుట్ల నిర్వాహకులు నిర్మించిన ప్రహరీ వల్ల వర్షపు నీరు కిందకు వెళ్లకుండా తుమ్మలపెంట రోడ్డువైపు పారుతోంది. మరోవైపు తుమ్మలపెంట రోడ్డుకు ఇరువైపులా ఉన్న కాలువలు ఆక్రమణలకు గురి కావటంతో వర్షపు నీరు రోడ్లపై ప్రవహిస్తోంది. ఫలితంగా ఆ ప్రాంతాలు కొన్ని ముంపునకు గురయ్యాయి. అయితే ఈ ఏడాది తుమ్మలపెంట రోడ్డు వేయడంతో ఎత్తు పెరిగి.. పూర్తిగా ఆ ప్రాంతం మునకకు గురయ్యే ప్రమాదం ఉంది. అయితే మొంథా తుఫాన్ ప్రభావంతో అతి భారీ వర్షాలు కురుస్తాయన్న వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో అధికారులు అప్రమత్తమయ్యారు. తుమ్మలపెంట రోడ్డు ప్రారంభం నుంచి దక్షిణం వైపు ఆక్రమణలకు గురైన ప్రాంతాలలో కాలువలు తీసి వరద నీరు పోయేందుకు మార్గం సుగమం చేశారు. అలాగే దక్షిణం వైపు కూడా దుకాణాల ముందు ఆక్రమణలను తొలగించి కాలువలు తీశారు. కొన్ని చోట్ల కాలువల్లో పేరుకు పోయిన చెత్తా చెదారాన్ని మున్సిపల్ కార్మికులు తొలగించారు.

సకాలంలో యూరియా అందిస్తాం

జలదంకి సొసైటీ అధ్యక్షుడు కరియావుల అప్పలనాయుడు

జలదంకి, అక్టోబర్ 27 (ఆంధ్రజ్యోతి): జలదంకి మండలంలోని అన్ని గ్రామా ల రైతులకు సకాలంలో యూరియా అందజేస్తామని జలదంకి సొసైటీ అధ్యక్షుడు కరియావుల అప్పలనాయుడు పేర్కొన్నారు. జలదంకి రైతు సేవా కేంద్రంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో సోమవారం రైతులతో సమావేశం నిర్వహించారు. వరి మడులు సిద్ధం చేయకమునుపే రైతులకు యూరియా ఇవ్వలేదని వైసీపీ నాయకులు అసత్య ఆరోపణలు చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. కాకాణి గోవర్ధన్‌రెడ్డి క్షేత్రస్థాయిలో పరిశీలించి, వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలన్నారు. పార్టీలకతీతంగా ప్రతీ రైతన్నకు యూరియా అందిస్తామన్నారు. వింజమూరు ఏడీఏ శేషగిరిరావు మాట్లాడుతూ వరిసాగు చేసే రైతులకు ఎకరానికి మూడుబస్తాల వంతున యూరియా అందిస్తామన్నారు. ఈ సమావేశంలో ఏఓ శ్రీవాణి, సోమశిల ప్రాజెక్ట్ ఉపాధ్యక్షుడు పీ మధుమోహన్‌రెడ్డి, మండల తెలుగు యువత అధ్యక్షుడు మునగాల తిరుమలరెడ్డి, బీజేపీ, జనసేన మండల అధ్యక్షులు ముడి కిషోర్ రెడ్డి, తోట మురళీ, పీఏసీఎస్ డైరెక్టర్లు జానీ, మధుసూదనరెడ్డి, బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వడ్డే శ్రీనాథ్ రెడ్డి, రైతులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కరియావుల అప్పలనాయుడు

అంతర్గత రోడ్లు అధ్వానం!

● చినుకు పడితే ప్రజలకు నరకయాతన

కావలి(టౌన్), అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): పట్టణంలో అనేక ప్రాంతాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువలు లేక అంతర్గత రోడ్లు అధ్వానంగా మరి ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. పేరుకే మున్సిపాలిటీ గానీ ఇక్కడి వాతావరణం చూస్తే పల్లెటూర్ల కంటే దారుణంగా ఉంది. పట్టణంలోని అనేక ప్రాంతాల్లో సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టకపోవడంతో ఆయా ప్రాంతాల్లో పరిస్థితి దుర్భరంగా మారింది. గతంలో నిర్మించిన రోడ్లు పాతబడి వర్షాలకు పగిలి గుంతలు ఏర్పడ్డాయి. వాటి మరమ్మతులు చేపట్టకపోవడంతో ఇబ్బందికరంగా మారింది. సీసీ రోడ్లు లేక వాహనదారులు, పాదచారులు ప్రయాణాలు సాగించాలంటే ఇబ్బందికరంగా ఉంది. దీనికి తోడు అనేక ప్రాంతాల్లోని రోడ్లకు డ్రైనేజీ కాలువల నిర్మాణం చేపట్టకపోవడంతో మురుగు రోడ్లపై ప్రవహిస్తూ దుర్భరంగా మారింది. వర్షాలు పడినప్పుడు మట్టిరోడ్లు కాస్త బురద రోడ్లుగా మారడం డ్రైన్ కాలువల మురుగు అందులో చేరడంతో ప్రజలు కాలు కిందపెట్టలేని దుస్థితి నెలకొంటుంది. వాహనాలు బురదలో ఇరుక్కుని ముందుకు కదలక వాహనచోదకులు అవస్థలు పడుతున్నారు. ముసునూరు ఇందిరమ్మ కాలనీ, వినాయక కాలనీ, చంద్రబాబు నగర్, కావేటి గుంట కాలనీ, జొన్నాయగుంట కాలనీ తదితర కాలనీల్లో సిమెంట్ రోడ్లు, డ్రైనేజీ కాలువలు లేక అక్కడ నివసించే గిరిజనులు నానా అవస్థలు పడుతున్నారు. గత 25 ఏళ్ల నుంచి ఇదే దుస్థితి నెలకొన్నప్పటికీ కాలనీలను పాలకులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి.



ముసునూరు దివ్యాంగుల కాలనీ వద్ద రొచ్చు రోడ్లు



ఇందిరమ్మ కాలనీలో బురద రోడ్డు

జగనన్న రూ.100 కోట్ల హుష్ కాకే..

గత వైసీపీ పాలనలో అప్పటి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కావలి పర్యటనలో భాగంగా ఇందిరమ్మ కాలనీలో మౌలిక వసతుల కల్పనకు రూ.100 కోట్లు మంజూరు చేస్తున్నామని స్వయంగా చేసిన ప్రకటన హుష్ కాకే అయింది. రూ.100 కోట్ల కాదు కదా రూ.100 కూడా కాలనీ అభివృద్ధికి ఖర్చు చేసిన పాపాన పోలేదు. కూటమి ప్రభుత్వంలోనైనా కాలనీల్లో మౌలిక వసతుల కల్పన చేపడతారని అక్కడి ప్రజలు ఆశతో ఎదురు చూస్తున్నారు.

మాలేపాటి కుటుంబమంటే టీడీపీ కుటుంబమే!




దగదర్తి (బిట్రగుంట) అక్టోబరు 27 (ఆం ధ్రజ్యోతి): మాలేపాటి కుటుంబం అంటే టీడీ పీ కుటుంబమేనని స్థానిక టీడీపీ నేతలు తా ళ్ళూరు సుధాకర్‌నాయుడు, శ్రీహరి అన్నారు. సోమవారం స్థానిక టీడీపీ కార్యకర్తలతో కలిసి దగదర్తిలో మాలేపాటి సుబ్బా నాయు డు, మాలేపాటి భానుచందర్ నాయుడు చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళుల ర్పించారు. అనంతరం మాలేపాటి రవీంద్ర నాయుడు, కుటుంబ సభ్యులను కలిసి మా ట్లాడారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం నా యకులు పులి శీనయ్య వట్టికాల శీనయ్య, మారుబోయిన గోపాల్, తడకలూరు గ్రామ స్తులు తదితరులు పాల్గొన్నారు.

హరహర శంభో శివశంభో

భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు ● సముద్ర స్నానాలు బంద్

నెల్లూరు (సాంస్కృతికం), అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : కార్తీక మాసం తొలి సోమవారం వేడుకలు జిల్లావ్యాప్తంగా వైభవంగా జరిగాయి. తెల్లవారుజాము నుంచే శివాలయాల వద్ద భక్తులు బారులుతీరి శివనామస్మరణలు చేశారు. ఈ సందర్భంగా మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, విశేష అర్చనలు, అలంకారాలు జరిగాయి. సాయంత్రం విశేష పుష్పాలంకరణలు, కార్తీక దీపారాధనలు స్వామివార్లకు ఆలయ ప్రాకారోత్సవాలు కనుల పండువగా జరిగాయి. భక్తులతో ఆలయాలు కళకళలాడాయి. మొంథా తుఫాను కారణంగా రామాయపట్నం, తుమ్మలపెంట, ఇస్కపల్లి, రామతీర్థం, మైపాడు, కోడూరు, తదితర బీచ్‌లో కార్తీక స్నానాలకు అధికారులు అనుమతులు ఇవ్వలేదు. జిల్లా యంత్రాంగం బీచ్‌ల వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.


నెల్లూరు : మూలపేట శివాలయంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు














సీతారామపురం : భైరవకోనలో క్యూలైన్‌లో భక్తులు


మనుబోలులో పార్వతీపరమేశ్వరుల ఊరేగింపు

ఏటీఎస్ సెంటర్ రద్దు చేయాలి

● సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ఆటో కార్మికుల ధర్నా



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న సీఐటీయూ, ఆటో కార్మికులు

నెల్లూరు(వైద్యం), అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): వాహనదారులకు నష్టం కలిగించే ఆటోమేటిక్ టెస్టింగ్ సిస్టం (ఏటీఎస్) సెంటర్ రద్దు చేయాలని ఆటో కార్మికులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో వీఆర్‌సీ కూడలి నుంచి కలెక్టరేట్ వరకు నిరసన ర్యాలీ చేపట్టి కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్ష, నగర కార్యదర్శులు టీవీవీ.ప్రసాద్, నాగేశ్వరరావు, రూరల్ అధ్యక్షుడు సుధాకర్ మాట్లాడారు. ముత్తుకూరు మండలం కప్పదొరువు వద్ద నిర్మించిన ఏటీఎస్ సెంటర్ వల్ల వాహనదారులు ఫిట్నెస్ సర్టిఫికెట్‌లు, డ్రైవింగ్ లైసెన్సులు కావాలంటే అనేక ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తుందన్నారు. అంతేకాకుండా వీటిని ప్రైవేట్ సంస్థలకు ఇచ్చిన కారణంగా అవకతవకలు జరుగుతున్నాయన్నారు. గతంలో జిల్లావ్యాప్తంగా రెవెన్యూ డివిజన్‌ల వారీగా ఆర్టీఏ అధికారులే ఫిట్నెస్ సర్టిఫికెట్లు ఇచ్చేవారని తెలిపారు. ప్రస్తుతం జిల్లా అంతటా ఒకే సెంటర్ పెట్టిన కారణంగా వాహనాల రిజిస్ట్రేషన్ కోసం దాదాపు వారం రోజులు వేచి ఉండాల్సిన దుస్థితి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ఆర్టీఏ అధికారుల ద్వారానే ఈ సర్టిఫికెట్‌లు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని లేదంటే ఏటీఎస్ సెంటర్ వద్ద 48 గంటల ధర్నాకు సైతం పిలుపు నిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆటో కార్మిక సంఘం అధ్యక్షుడు సురేష్, నేతలు బాబూరావు, రవీంద్ర, పెంచలయ్య, శ్యాంసన్, ప్రేమ నివాస్, సురేష్, జకీర్, తదితరులు పాల్గొన్నారు.

రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి

● కేవీకే కోఆర్డినేటర్ లలితాశివజ్యోతి

నెల్లూరు(వ్యవసాయం), అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మొంథా తుపాను ప్రభావంతో మంగళవారం నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే) కోఆర్డినేటర్ డాక్టర్ జీ.లలితాశివజ్యోతి ఒక ప్రకటనలో తెలిపారు. బలమైన గాలులు వీచే అవకాశం ఉండడంతో పక్వం దశలో ఉన్న కూరగాయలు, ఉద్యాన పంటలను తక్షణమే కోయాలని పేర్కొన్నారు. అరటి తోటల్లో మొక్కలకు సరైన ఊతం ఉండేలా చూసుకోవాలని తెలిపారు. పిడుగుల నుంచి రక్షణ కల్పించేలా పశువులు, మేకలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, సక్రమంగా మేత అందేలా చూడాలని పేర్కొన్నారు. సజ్జ పంట కోసి పొలాల్లో ఉంచినప్పుడు 2శాతం ఉప్పు ద్రావణం లీటరు నీటికి 20గ్రాములు పిచికారి చేయడం వల్ల బూజు పట్టదని, గింజలు మొలకెత్తకుండా నివారించవచ్చని తెలిపారు. కంది పంట పొలాల్లో నిలిచిన నీటిని వెంటనే బయటకు తీసేయాలని, 1శాతం 19:19:19 లేదంటే పొటాషియం నైట్రేట్ ద్రావణాన్ని పిచికారి చేయాలని తెలిపారు. వర్షం ఆగిన తరువాత మారుకా కాయ తొలుచు పురుగు నివారణకు క్లోరిపైరిఫాస్ 2.5మి.లీ లేదా నోవాల్యూరాన్ 1మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలని పేర్కొన్నారు. మినుము, పెసర పంట పొలాల్లో నిలిచిన నీటిని తొలగించి ఇనుము లోపాన్ని సరిచేసేందుకు లీటరు నీటికి ఫెర్రస్ సల్ఫేట్ 5గ్రాములు, సిట్రిక్ యాసిడ్ 0.5గ్రాములు, యూరియా 20గ్రాములు కలిపి పిచికారీ చేయాలని తెలిపారు. వేరుకుళ్లు, ఆకుమచ్చ తెగుళ్ల నివారణకు హెక్సాకోనజోల్ 2మి.లీ లేదా ప్రొపికొనజోల్ 1మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని తెలిపారు. వర్షాలు ఆగాక నారుమడి వేయాలన్నారు.

కన్నీరొలికిన గోళ్లవారిపల్లె


మృతదేహాల వద్ద బోరున విలపిస్తున్న బంధువులు


అంతిమయాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్

వింజమూరు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): కర్నూలు వద్ద జరిగిన బస్సు ప్రమాదంలో అసువులుబాసిన గోళ్ల రమేష్ కుటుంబ సభ్యులకు సోమవారం వారి స్వగ్రామం గోళ్లవారిపల్లెలో అశ్రునయనాల మధ్య అంత్యక్రియలు జరిగాయి. బంధువులు, గ్రామస్థులు, స్నేహితులు తరలిరావడంతో గ్రామంలో దుఃఖసాగరంలో మునిగిపోయింది. కర్నూలులోని జీజీహెచ్‌లో పోస్టుమార్టం అనంతరం గోళ్ల రమేష్, అనూష, వీరి బిడ్డలు శశాంత్, మన్విత మృతదేహాలను ప్రత్యేక అంబులెన్స్‌లో ఆదివారం రాత్రి స్వగ్రామానికి చేర్చారు. సోమవారం భారీ జనసందోహంతో అంతిమయాత్ర నిర్వహించి దహనసంస్కారాలు చేశారు. గ్రామంలో ఒకే సామాజికవర్గం ఉండడం అందులో అందరూ బంధువులు కావడంతో గ్రామమంతా మూగబోయింది. గ్రామంలో అత్యధిక శాతం మంది యువకులు వ్యాపారం, ఉద్యోగరీత్యా ఇతర ప్రాంతాలకు వెళ్లి వారి జీవనోపాధి చేసుకుంటూ ఉంటారు. అలాంటి వారంతా ఈ ఘటన తెలిసిన వెంటనే స్వగ్రామానికి తరలివచ్చారు. ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ దగ్గరుండి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో లక్కీడ్రా

● విజేతకు సిల్వర్ కాయిన్ అందజేత

నెల్లూరు(సాంస్కృతికం), అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ రంగ సంస్థ బీఎస్ఎన్ఎల్‌లో దీపావళి పండుగ సందర్భంగా ఈ నెల 18 నుంచి బీఎస్ఎన్ఎల్ హెల్త్ కేర్ నుంచి రీచార్జ్ చేసుకున్న కస్టమర్లకు లక్కీ డ్రా ద్వారా 10 గ్రాముల సిల్వర్ కాయిన్ అందచేస్తామని ప్రకటించినట్లు డిప్యూటీ జనరల్ మేనేజర్ ఎం.శ్రీనివాసరావు తెలిపారు. ఆ మేరకు రీచార్జ్ చేసుకున్న కస్టమర్ల నుంచి సోమవారం లక్కీ డ్రా తీశారు. ఈ లక్కీడిప్‌లో నెల్లూరు నగరంలోని లేక్‌వ్యూ కాలనీకి చెందిన ఎన్.నాగేంద్ర విజేతగా నిలిచారు. ఆయనకు డిప్యూటీ జనరల్ మేనేజర్ వెండి కాయన్ అందజేసి అభినందించారు. వినియోగదారులందరూ బీఎస్ఎన్ఎల్ సిమ్‌లకు సెల్ఫ్‌కేర్ యాప్ ద్వారా రీచార్జ్ చేసుకుని విలువైన బహుమతులు పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ మేనేజర్ రాంమోహన్‌రావు, సుచిత్ర, వరప్రసాద్, బేబీ, పీసీ.రాణి, తదితరులు పాల్గొన్నారు.


బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో లక్కీ డ్రా విజేతను అభినందిస్తున్న డీజీఎం శ్రీనివాసరావు

డిగ్రీ సెమిస్టర్ పరీక్షల్లో ఒకరు డీబార్

వెంకటాచలం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : విక్రమ సింహపురి విశ్వవిద్యాలయ పరిధిలోని అనుబంధ డిగ్రీ కళాశాలల్లో సోమవారం జరిగిన డిగ్రీ మూడవ, ఐదవ సెమిస్టర్ పరీక్షల్లో ఒక విద్యార్థి డీబార్ అయినట్లు వీఎస్‌యూ పరీక్షల నిర్వాహణాధికారిణి డాక్టర్ ఆర్ మధుమతి ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షలకు మొత్తం 15,361 మంది విద్యార్థులకుగాను 14,282 మంది హాజరయ్యారు. 1079 మంది గైర్హాజరయ్యారు. కాగా గూడూరులోని డీఆర్‌డబ్ల్యూ డిగ్రీ కళాశాలలో ఒక విద్యార్థిని డీబార్ చేసినట్లు తెలిపారు.

ఈఈఎంటీ పరీక్షకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(విద్య), అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యాశాఖ అనుమతితో ఎడ్యుకేషన్ ఏపీ ఫణి అనే సంస్థ ఆధ్వర్యంలో ఆన్‌లైన్‌లో నిర్వహించే ఈ ఈఎంటీ మెరిట్ పరీక్షకు నవంబరు 14వ తేదీ లోపల దరఖాస్తు చేసుకోవాలని డిప్యూటీ ఈవో ఎస్‌వీ. నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ, జడ్పీ, మున్సిపల్ పాఠశాలల్లో చదివే విద్యార్థులు పరీక్షకు అర్హులని పేర్కొన్నారు. పరీక్షను ప్రిలిమ్స్, మెయిన్స్ రెండు దశల్లో నిర్వహిస్తారని, ప్రిలిమ్స్‌ను ఇంటి నుంచి లేదా పాఠశాలలో ఆన్‌లైన్‌లో రాయాలని, మెయిన్స్ పరీక్ష ఎంపిక చేసిన కేంద్రాల్లో రాయాలని పేర్కొన్నారు. టెన్త్ విభాగంలో రాష్ట్రస్థాయిలో తొలి 3 స్థానాల్లో ఉన్న వారికి రూ.30వేల, రూ.25వేల, రూ.20వేల, జిల్లాస్థాయిలో రూ.8వేల, రూ.6వేల, రూ.4వేల, 7వ తరగతిలో రాష్ట్రస్థాయి విజేతలకు రూ.20వేల, రూ.15వేల, రూ.10వేల, జిల్లాస్థాయిలో రూ.5వేల, రూ.4వేల, రూ.3వేల అందిస్తారని పేర్కొన్నారు. వివరాలకు కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

జన సైనికుల్లో సయోధ్యకు సన్నాహాలు

(5వ పేజీ తరువాయి)

కార్యదర్శి గునుకుల కిషోర్, జిల్లా కార్యదర్శి షేక్ ఆలియాలతో సమావేశం అవుతారు. 29న సూళ్లూరుపేటకు చెందిన ఉయ్యాల ప్రవీణ్, సర్వేపల్లి నియోజకవర్గానికి చెందిన బొబ్బేపల్లి సురేష్, కోవూరుకు చెందిన చప్పిడి శ్రీనివాసులు, గూడూరుకు చెందిన వీవోసీ కే మోహన్, వెంకటగిరికి చెందిన గూడూరు వెంకటేశ్వర్లు, జిల్లా ప్రధాన కార్యదర్శి మున్వర్ బాషా, జిల్లా లీగల్ సెల్ అధ్యక్షుడు చెదలవాడ రాజేష్‌లతో సమావేశం అవుతారు. పార్టీలో ఏం జరుగుతోంది.. విభేదాలు ఎందుకు వస్తున్నాయి.. ఇలా అనేక అంశాలపై శివశంకర్ జిల్లా నాయకులతో మాట్లాడనున్నారు. నాయకులు తెలిపిన విషయాలను ఆయన పవన్‌కల్యాణ్‌కు తెలియజేయనున్నారు.

ఈతకు వెళ్లి విద్యార్థి మృతి

మర్రిపాడు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఈతకు వెళ్లి విద్యార్థి మృతి చెందిన సంఘటన సోమవారం మర్రిపాడు మండలం రామానాయుడు పల్లిలో చోటుచేసుకుంది. గ్రా మంలో జయరాములు, భాగ్యమ్మల కుమారుడు కోనంకి రామ్‌చరణ్ (13) 8వ తరగతి చదువు తున్నాడు. స్నేహితులతో కలిసి బొగ్గేరులో ఈతకు వెళ్లి ప్రమాదవశాత్తు మునిగి మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఆత్మ కూరు సీఐ గంగాధర్, మర్రిపాడు ఎస్ఐ శ్రీనివాస్‌రావు సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసునమోదు చేశారు.

వీఎస్‌యూలో ఇంటర్వ్యూలు 30కి వాయిదా

వెంకటాచలం : విక్రమ సింహపురి యూనివర్సిటీ పరిధిలోని కావలి పీజీ క్యాంపస్‌లోని ఫార్మసీ కళాశాలలో ఉద్యోగాల భర్తీకి జరగాల్సిన ఇంటర్వ్యూలు 30వ తేదీకి వాయిదా వేసినట్లు రిజిస్ట్రార్ కే సునీత ఒక ప్రకటనలో తెలిపారు. తుఫాన్ హెచ్చరిక నేపథ్యంలో మంగళవారం జరగాల్సిన ఇంటర్వ్యూలను వాయిదా వేసినట్లు పేర్కొన్నారు.

డీఆర్వోగా విజయకుమార్

● రామాయపట్నం క్లస్టర్‌కు నలుగురు డిప్యూటీ కలెక్టర్లు

● ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం


డీఆర్వో విజయకుమార్

నెల్లూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్వో)గా ఎన్ విజయకుమార్‌ను నియమిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ఆయన జిల్లా పౌరసరఫరాల శాఖాధికారిగా పని చేస్తున్నారు. అలానే ఇన్‌చార్జ్ డీఆర్వోగా కూడా వ్యవహరిస్తున్నారు. ఇటీవల జరిగిన రేషన్ అక్రమ రవాణా వ్యవహారాల్లో పౌరసరఫరాల శాఖ డీఎస్‌వో వియజకుమార్‌ను సరెండర్ చేసింది. ఇప్పుడు ఆ అధికారిని రెగ్యులర్ డీఆర్వోగా నియమిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే విజయానంద్ ఉత్తర్వులు జారీ చేశారు. పశ్చిమ గోదావరి జిల్లా కేఆర్‌ఆర్‌సీ డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేస్తున్న బీఎస్ నారాయణరెడ్డిని టీజీపీ భూసేకరణ విభాగం రాపూరు యూనిట్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా నియమించారు. కాగా రామాయపట్నం ఇండస్ట్రియల్ క్లస్టర్‌పై ప్రభుత్వం దృష్టి పెట్టింది. ఈ క్లస్టర్‌లో ఇండోసోల్‌తోపాటు ఇతర పరిశ్రమల స్థాపనకు అవసరమైన భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేసేందుకుగానూ తాజాగా నలుగురు డిప్యూటీ కలెక్టర్లను నియమించింది. విజయవాడ జీజీహెచ్ అడ్మినిస్ట్రేటర్‌గా పనిచేస్తున్న జీవీవీ సత్యనారాయణ, ఏపీమారిటైం బోర్డులో పనిచేస్తున్న ఆర్ శివారావు, పోలవరం ప్రాజెక్టులో పనిచేస్తున్న కోమటినేని నరసయ్య, బాపట్ల ఎస్ఎస్ఏ అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్‌గా పనిచేస్తున్న ఎం నాగిరెడ్డిలను రామాయపట్నం ఇండస్ట్రియల్ క్లస్టర్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లుగా నియమిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి.

ఎల్ఆర్ఎస్ గడువు.. 3 నెలలు పొడిగింపు

నెల్లూరు(సిటీ), అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : అనధికార లే అవుట్లు, ప్లాట్లను క్రమబద్ధీకరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఎల్ఆర్ఎస్‌ను మరో మూడు నెలలపాటు పొడిగిస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో ఇచ్చిన జీవో ఈ నెల 23వ తేదీకి ముగియడంతో తాజాగా 2026, జనవరి 23వ తేదీ వరకు రెగ్యులరైజ్ చేసుకోవచ్చని తాజా ఉత్తర్వుల్లో రాష్ట్ర ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేష్‌కుమార్ పేర్కొన్నారు.

31 నుంచి వేదగిరి పవిత్రోత్సవాలు

నెల్లూరురూరల్,అక్టోబరు 27,(ఆంధ్రజ్యోతి) : ప్రముఖ పుణ్యక్షేత్రం వేదగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఈ నెల 31వ తేదీ నుంచి పవిత్రోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆ ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ అచ్యుత శంకర్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆలయంలోని తన కార్యాలయంలో మాట్లాడారు. నవంబరు 3వ తేదీ వరకు ఈ ఉత్సవాలను నిర్వహించేందుకు అధికార, అర్చక బృందం సిద్ధమైనట్లు తెలిపారు. 31న భగవత్ప్రార్థన, 1వ తేదీన అగ్ని ప్రతిష్ఠ, 2న కుంభారాధన, గిరిప్రదక్షిణ, 3న ఉక్త, సర్వగాయత్రీహోమం, అక్షతారోపణతో ఉత్సవాలు ముగిస్తాయని పేర్కొన్నారు.

గుర్రపు డెక్కలు.. ప్రమాద ఘంటికలు!

● మెష్‌ల ఏర్పాటుతో ఆందోళనలో గ్రామస్థులు


మెష్‌కు ఆనిన గుర్రపు డెక్క

అల్లూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): తీవ్ర తుపాను హెచ్చరికల నేపథ్యంలో అల్లూరు చెరువు, రామన్న చెరువుల వద్ద ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి. మాత్రం ప్రమాదభరితంగా మారాయి. నిండు కుండల్లా చెరువుల్లో నీరు చేరడంతో స్థానికులు భయాందోళనలకు లోనవుతున్నారు.

● నీటి సరఫరాకు అంతరాయం

చెరువుల్లో, కాలువల్లో గుర్రపుడెక్క నిండిపోయి నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతోంది. ఈ సమస్య అల్లూరు చెరువు, రామన్న చెరువుల్లో అధికంగా ఉంది. పైడేరు ఎస్కేప్ - 2 ఛానల్ ద్వారా వచ్చే నీటిని ఏటీఎస్ (అల్లూరు ట్యాంక్ సప్లై ఛానల్) ద్వారా అల్లూరు చెరువుకు, అక్కడి నుండి రామన్న చెరువుకు తరలించేవిధంగా ఏర్పాటు చేశారు. కానీ ఏటీఎస్ ఛానల్ ద్వారా అల్లూరు చెరువుకు వచ్చే నీటితోపాటు గుర్రపు డెక్క చెరువుల్లో చేరుతోంది.

● మెష్‌లతో పొంచి ఉన్న ప్రమాదం

చెరువులకు నీటిని సరఫరా చేసే ప్రధాన కాలువలు, చెరువులు నిండితే నీటిని బయటికి పంపే కలుజుల్లోకి చేపలు వెళ్లకుండా మెష్‌లను ఏర్పాటు చేశారు. ఫలితంగా గుర్రపుడెక్క వీటికి అడ్డుపడి నీరు సులభంగా బయటికి వెళ్లే పరిస్థితి లేదు. దీంతో సమస్య జఠిలమయ్యే పరిస్థితి ఉందని స్థానికులు, రైతులు ఆందోళన చెందుతున్నారు. భారీ వర్షాలతో ప్రమాదం పొంచి ఉన్న తరుణంలో ఈ విధంగా మెష్‌లను ఏర్పాటు చేయడం సరికాదని, సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. ఎన్నడూ లేని విధంగా ఇలా మెష్‌లను ఏర్పాటు చేయడం ఏమిటని రైతులు, ప్రజలు ప్రశ్నిస్తున్నారు. జిల్లా ఉన్నతాధికారులు వెంటనే స్పందించి ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

సివిల్ సర్వీస్ ఉద్యోగుల క్రీడా జట్ల ఎంపిక వాయిదా

నెల్లూరు (విద్య), అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : జిల్లా సివిల్ సర్వీసు ఉద్యోగుల 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించిన క్రీడా జట్ల ఎంపికను ఈనెల 29వ తేదీన నిర్వహించాల్సి ఉండగా భారీ వర్షాల కారణంగా తాత్కాలికంగా వాయిదా వేసినట్లు డీఎస్‌డీవో ఆర్‌కే.యతిరాజ్ ఒక ప్రకటనలో తెలిపారు. వర్షాలు ముగిసిన తరువాత తేదీలను తిరిగి ప్రకటిస్తారని, ఉద్యోగులు దీనిని గుర్తించాలని పేర్కొన్నారు.


ఐఈఆర్‌పీల సర్టిఫికెట్ల పరిశీలన


సర్టిఫికెట్లు పరిశీలిస్తున్న అధికారులు

నెల్లూరు(విద్య), అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు జిల్లాలోని మండల భవిత కేంద్రాల్లో విజువల్ ఇంపైర్, హియరింగ్ ఇంపైర్ విభాగాల్లో విధులు నిర్వహిస్తున్న 43 మంది ఐఈఆర్‌పీల ఒరిజినల్ సర్టిఫికెట్లను జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో సోమవారం పరిశీలించారు. సమగ్రశిక్ష ఏపీసీ వెంకటసుబ్బయ్య పర్యవేక్షణలో త్రిసభ్య కమిటీ సర్టిఫికెట్లను పరిశీలించి నిర్ధారణ చేశారు. మంగళవారం ఎంఆర్ విభాగంలో పనిచేసే ఐఈఆర్‌పీల సర్టిఫికెట్ల పరిశీలన చేపడుతామని, ప్రతి ఒక్కరూ తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఉద యం 10 గంటలకు విద్యాశాఖ కార్యాలయంలో హాజరు కావాలని అధికారులు తెలిపారు. ఈ పరిశీలనలో డిప్యూటీ ఈవో వెంకటేశ్వరనాయక్, టీపీగూడూరు ఎంఈవో జయరామ్‌నాయుడు, టీపీగూడూరు జడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం రియాజ్‌అహ్మద్, ఎస్ఎస్ఏ సహిత విద్యా కోఆర్డినేటర్ పీ.ప్రసాద్‌రావు, ఎస్ఎస్ఏ తిరుపతి సహిత విద్యకోఆర్డినేటర్ చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

మద్యం నకిలీనా.. కాదా!?

● అందుబాటులోకి ఏపీ సురక్ష ఎక్సైజ్ యాప్



నెల్లూరు(క్రైం), అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మద్యం షాపుల్లో కొనుగోలు చేస్తున్న మందు నకిలీనా.. కాదా!? తెలుసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏపీ సురక్ష ఎక్సైజ్ యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. దీనిపై మద్యంప్రియులతో పాటు షాపులు, బార్ల యజమానులకు ఎక్సైజ్ అవగాహన కల్పిస్తున్నారు. స్మార్ట్ ఫోన్లలో గూగుల్‌లోకి వెళ్లి ఏపీ ఎక్సైజ్ సురక్ష యాప్ అని టైప్ చేసి క్లిక్ చేసిన వెంటనే గూగుల్ పే సురక్ష యాప్ కనిపిస్తుంది. ఆ తర్వాత ఇన్‌స్టాల్ బటన్ క్లిక్ చేస్తే యాప్ డౌన్‌లోడ్ అవుతుంది. యాప్‌ను ఓపెన్ చేసిన వెంటనే కన్జూమర్, రిటైలర్ అని రెండు ఆప్షన్స్ ఉంటాయి. కన్జూమర్ ఆప్షన్ ఎంపిక చేసిన వెంటనే లొకేషన్, కెమెరాలకు అనుమతులు అడుగుతుంది. వాటిని ఓకే చేసిన వెంటనే కన్జూమర్ పోర్టల్ పేజీ ఓపెన్ అయి స్కాన్ క్యూఆర్ కోడ్ ఆప్షన్‌లో కెమెరా సింబల్ కనిపిస్తుంది. కెమెరాపై క్లిక్ చేసి మద్యం బాటిల్‌పై ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి, కిందనే ఉన్న సెక్యూరిటీ కోడ్‌ను ఎంటర్ చేసి వెరిఫై ప్రొడక్ట్‌ను క్లిక్ చేస్తే మద్యం నకిలీది అయితే ఎర్రర్ అంటు రెడ్ అని చెబుతోంది. నకిలీది కాకపోతే గ్రీన్ సిగ్నల్ వస్తుంది. దీంతోపాటు ఆ మద్యం ఎక్కడ తయారైంది.. ఎప్పుడు తయారు చేశారు.. ఇలా పూర్తి వివరాలు తెలుసుకోవచ్చు. ఏపీ ఎక్సైజ్ సురక్ష యాప్ ద్వారా లిక్కర్ బాటిళ్లు మాత్రమే స్కాన్ చేసుకునే అవకాశం ఉంటుంది. బీర్లకు వర్తించదు. నకిలీ మద్యం అని తేలితే 14405 టోల్‌ఫ్రీ నెంబరుకు ఫిర్యాదు చేయవచ్చు. వెంటనే అధికారులు విచారిస్తారు.

● ప్రజలకు అవగాహన కల్పిస్తూ...

ఏపీ ఎక్సైజ్ సురక్ష యాప్‌ను ఎక్సైజ్ శాఖ ఈ నెల 16వ తేదీ నుంచి అందుబాటులోకి తీసుకువచ్చింది. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు జిల్లాలోని బార్లు, వైన్‌షాపుల యజమానులు, సిబ్బందికి యాప్‌పై అవగాహన కల్పించారు. బార్లు, మద్యం దుకాణాల్లో విక్రయించి ప్రతి మద్యం బాటిల్‌ను యాప్‌లో స్కాన్ చేయాలని అధికారులు ఆదేశించారు. అంతేగాక మందుబాబుల్లో అవగాహన కల్పించేందుకు వైన్‌షాపులు, బార్ల వద్ద సురక్ష యాప్ బోర్డులను ఏర్పాటు చేశారు. కరపత్రాలను ముద్రించి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.

దివ్యాంగుల శాఖ ఏడీపై చర్యలకు ఆదేశం

నెల్లూరు (హరనాథపురం), అక్టోబరు 27,(ఆంధ్రజ్యోతి): జిల్లా దివ్యాంగులశాఖ అసిస్టెంట్ డైరెక్టర్‌పై విచారణ జరిపి చర్యలు తీసుకోవాని కోరుతూ ఆశాఖ డైరెక్టర్ జిల్లా కలెక్టర్‌కు ఆదేశాలు జారీ చేశారు. వివరాల్లోకి వెళితే.. నగరంలోని దివ్యాంగ బాలికల పాఠశాలలో ఉండాల్సిన జూనియర్ సహాయకుడు, వాచ్ ఉమన్‌లను దివ్యాంగుల సంక్షేమశాఖ ఏడీ తన కార్యాలయంలో పనిచేయడానికి వినియోగిస్తున్నాడని నవ్యాంధ్ర వికలాంగ హక్కుల సేవాసమితి రాష్ట్ర అధ్యక్షుడు ఎస్‌కే కాలేషా ఆరోపించారు. అంతేకాకుండా ఆ పాఠశాలలో దివ్యాంగుల బాగోగులు చూసేందుకు ఆ ఉద్యోగులు ఉండాలని, ఆ పాఠశాలలో సీసీ కెమరాలు లేవని, దివ్యాంగ బాలికల రక్షణ కరువైందని డైరెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో విచారణ జరిపి ఏడీపై చర్యలు తీసుకోవాలని డైరెక్టర్ ఆదేశాలు ఇచ్చారు.